: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM
విజయవాడ
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

11-6-2025
బుధవారం
సంపుటి: 31
సంచిక: 130
పేజీలు: 12
వెల: 6.50

# పక్కాగా ఖరీఫ్ ప్రణాళిక



## 365 రోజుల్లో 3 పంటలు పండించేలా చర్యలు

## నరేగా నిధులతో వరిపొలాల గట్లు వెడల్పు

## ఎరువుల వినియోగం 35 లక్షల మె.టన్నులకు తగ్గాలి

### వ్యవసాయశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ జూన్ 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఖరీఫ్ పంటలను తుఫాన్ల నుంచి రక్షించుకునేలా పంటకాలాన్ని ముందుకు తీసుకురావాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో వ్యవసాయశాఖ అధికారులు కార్యాచరణ మొదలు పెట్టారు. ఇందుకు అనుగుణంగా గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతాలకు ఈ ఏడాది ముందుగానే సాగు నీరు విడుదల చేశారు. అధికారులు ఈ మేరకు వివరాలను మంగళవారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన వ్యవసాయ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రికి తెలిపారు. పశ్చిమ గోదావరి, ఏలూరు, కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ, కృష్ణా జిల్లాల్లో భూములకు కాలువల ద్వారా ఇప్పటికే నీరు విడుదల చేశామని, జూలై మొదటి వారంలో గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు నీరు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు. అలాగే రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వరి, కందులు, వేరుశనగ, ప్రత్తిసాగు చేస్తుండగా, వేరుశనగ, ప్రత్తి సాగు తగ్గుతూ వస్తోందని, కందుల సాగుమాత్రం పెరిగిందని, వరిసాగు స్థిరంగా కొనసాగుతోందని అధికారులు చెప్పారు. గత 20ఏళ్లుగా పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్ 14 తుఫాన్లను ఎదు ర్కొంది. వీటిలో 5 తుఫాన్లు అక్టోబర్‌లో, 6తుఫాన్లు నవంబర్‌లో, 3 తుఫాన్లు డిసెంబర్‌లో రాష్ట్రంపై ప్రభావం చూపాయి. అక్టోబర్‌లో వచ్చే తుఫాన్లు ఎక్కువగా ఉత్తర కోస్తా, తూర్పుగోదావరి జిల్లాలకు నష్టం కలిగించాయి. ఇక నుంచి ఏటా 3 పంటలు 365 రోజులు సాగుభూములు పచ్చగా ఉండేలా చూడాలని ఇందుకోసం 3 పంటల విధానం తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. వచ్చే ఏడాది వేసవిలో ఉత్తర కోస్తా, గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతాల్లోని 5 లక్షల ఎకరాల్లో వేసవి పంటలు వేయాలని చెప్పారు. అనంతపురం వంటి జిల్లాల్లో 365 రోజుల్లో కేవలం 4 నెలలే పంటలు సాగు చేసి, 8 నెలల పాటు భూములు ఖాళీగా వదిలేస్తున్నారని, దీనివల్ల భూసారం దెబ్బ తింటోందని, అలాకాకుండా మిగిలిన 8 నెలలు కూడా ఏదో ఒక పంట సాగు చేసే పరిస్థితులు కల్పించాలని చెప్పారు. వచ్చే వేసవిలో జలవనరుల లభ్యత ఉన్న 141 మండలాల్లోనూ పంటలసాగు జరిగేలా రైతుల్ని సన్నద్ధం చేయాలన్నారు. ఇందులో 19మండలాలు రిజర్వాయర్లు, 57మండలాలు చెరువులు, 65 మండలాలు భూగర్భజలాలపై ఆధారపడి ఉన్నాయని. వీటిని వినియోగించుకుని దిగుబడులుసాధించాలన్నారు. అలాగే వరిలో అధిక డిమాండ్ ఉన్న సన్నరకాలనుపండిచేలా రైతులను ప్రోత్సహించాలన్నారు.

**వరి రైతు లాభపడేలా చర్యలు:** వరి రైతుకు ఆదాయం మరింత పెరిగే మార్గాలు చూడాలని అధికారులకు చెప్పిన ముఖ్యమంత్రి వరిలో అంతర పంటగా గట్లపై కూరగాయలు, పండ్ల మొక్కలు పెంచే విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయాలన్నారు. రైతుల పొలం మధ్యలో వెడల్పుగా అదనపు గట్లు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. అవసరమైతే ఈ గట్లు నరేగా నిధులతో ఏర్పాటు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. అలాగే వరిపంట మధ్యలో లేదా, పంట చుట్టూ ఆక్వాకల్చర్, హార్టికల్చర్ సాగును కూడా ప్రయత్నించాలన్నారు.

**కొనుగోళ్లతో పొగాకు రైతుల్లో సంతృప్తి :** హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లు పర్చూరు ఏఎంసీలో ప్రారంభించామని, దీనిపై రైతుల్లో సంతృప్తి వ్యక్త మైందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. హెచ్డీబర్లీ స్థానంలో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కోకో, మామిడి కొనుగోళ్ల వివరాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అడిగి తెలుసుకు >>2



## యుఎన్‌పిఎఫ్ నివేదిక

## ప్రపంచంలో భారత్ టాప్

# మన జనాభా 146 కోట్లు

### దేశంలో 1.9కి పడిపోయిన జననాల రేటు

### పురుషుల సగటు ఆయుష్షు 71, మహిళలకు 74

**న్యూయార్క్, జూన్ 10:** జనాభాపరంగా ప్రపంచంలోనే ఈ యేడాది కూడా భారత్ నంబర్ 1 స్థానంలో కొనసాగుతోంది ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ (యుఎన్ పిఎఫ్) పేర్కొంది. ఈ ఏడాది చివరికల్లా జనాభా 146 కోట్లకు చేరుకుంటుదని అంచనా వేసింది. స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ (ఎస్ఒడబ్ల్యుపీ) పేరుతో విడుదల చేసిన నివేదికలో ఈ మేరకు తెలిపింది. జననాల రేటు నిర్దేశిత స్థాయి కంటే దిగువకు పడిపోయిందని వెల్లడించింది. భారత్‌లో సంతానోత్పత్తి ప్రధాన సమస్యగా ఉందని వివరించింది.సమితి నివేదిక ప్రకారం ప్రస్తుతం భారత్‌లో జననాల రేటు1.9గా ఉంది. ఏ దేశంలోనైనా సగటు రీప్లేస్‌మెంట్ రేటు కనీసం 2.1గా ఉండాలి. కానీ, భారత్‌లో సంతానోత్పత్తి రేటుపడిపోయింది. జననాల రేటు తగ్గిపోయినప్పటికీ భారతదేశ జనాభా సంఖ్య >>2

## రేపు అమరావతిలో ఎన్డీయె కూటమి విజయోత్సవసభ

**విజయవాడ,జూన్10,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది సందర్భంగా ఈనెల 12న అమరావతిలో భారీ సభను నిర్వహించనున్నారు. ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వివరించనున్నారు. అలాగే వచ్చే నాలుగేళ్లలో ఎలాంటి కార్యక్రమాలు చేయబోతున్నారు, ప్రణాళికలు ఏంటి, నాలుగేళ్ల పాలన ఏ విధంగా కొనసాగనుంది అనే దానిపై ఈ వేదిక ద్వారా చెప్పే అవకాశం ఉంది. వచ్చే నాలుగేళ్ల పాలనకు సంబంధించి డ్రాఫ్ట్‌ను కూడా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశం మొత్తాన్ని కూటమి నేతల ఆధ్వర్యంలో నిర్వహించాలని నిర్ణయించారు. సుపరిపాలన స్వర్ణాంధ్రప్రదేశ్ పేరుతో రాష్ట్ర స్థాయిలో వేడుకలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. >>2

## సిఎం కాన్వాయ్ మార్గంలో ప్రత్యేక కెమెరాలు

**విజయవాడ,జూన్ 10,ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు రాకపోకలు సాగించే సందర్భాల్లో ట్రాఫిక్ నిలిపివేత సమయాన్ని వీలైనంత తగ్గించేందుకు వీఐపీ మూవ్‌మెంట్ మాని టరింగ్ సిస్టమ్ అనే వ్యవస్థను పోలీసులు పరీక్షిస్తున్నారు. తన వాహనశ్రేణి కోసం ట్రాఫిక్‌ను నిలిపివేయొద్దని సీఎం చంద్రబాబు ఆదేశించిన నేపథ్యంలో ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో సిఎం నివాసం నుండి ప్రకాశం బ్యారేజీ మీదుగా విజయవాడ నగరం, విమానాశ్రయం వరకు సాగే మార్గంలో ఇరువైపులా 36 ప్రత్యేక కెమేరాలు ఏర్పాటు చేశారు. ఇవి ఏఐ ఆధారంగా పనిచేస్తాయి. >>2

## సజ్జలకు సమన్లు పంపుతాం

### మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

**విజయవాడ, జూన్ 10,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డికి సమన్లు పంపిస్తామని ఏపీ మహిళా కమీషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ చెప్పారు. వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని కమీషన్ స్పష్టం చేసింది. సజ్జల వ్యాఖ్యలను నిరసిస్తూ రాజధాని మహిళలు మంగళగిరి లోని మహిళా కమీషన్ చైర్‌పర్సన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వైకాపా నేతలకు అమరావతి ప్రాంత మహిళలంటే చులకనైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.గతఐదేళ్ళు కేసులతో వేధించిన వైకాపా ప్రభుత్వం ఇప్పుడు >>2

## జాతీయ భద్రతా సలహా బోర్డు సభ్యునిగా సతీష్‌రెడ్డి

**విజయవాడ, జూన్ 10,ప్రభాతవార్త ప్రతినిధి:** జాతీయ భద్రతా సలహా బోర్డు(ఎన్ఎస్ఏబీ) సభ్యుడిగా డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి నియమితులయ్యారు. నేటి నుండి రెండేళ్ళ పాటు ఆయన ఎన్ఎస్ఏబీ సభ్యుడిగా కొనసాగనున్నారు. 'రా' చీఫ్ అలక్ జోషి నేతృత్వరంలో కేంద్ర ప్రభుత్వం ఈ జాతీయ భద్రతా సలహా బోర్డును ఏర్పాటు చేసింది. ప్రధాని నేతృత్వంలో ఉన్న జాతీయ భద్రతా కౌన్సిల్‌కి ఈ బోర్డు సూచనలు చేయనుంది. బోర్డులో ఏడుగురు సభ్యులకు ఆరుగురిని ఇప్పటికే నియమించింది. వారిలో మాజీ వెస్టన్ ఎయిర్ కమాండ్ ఎయిర్ మార్షల్ పీఎం సిన్హా,ఆర్మీ సదరన్ మాజీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ఏకెఓ సింగ్,రియర్ అడ్మిరల్ మోంటీ ఖన్నా,విశ్రాంతి ఐపీఎస్ అధికారులు రాజీవ్ రంజన్ వర్మ,మన్మోహన్‌సింగ్, మాజీ విదేశాంగ శాఖ అధికారి బి.వెంకటేష్ వర్మ ఉన్నారు. తాజాగా రక్షణ రంగ నిపుణుడు సతీష్‌రెడ్డికి బోర్డులో చోటు కల్పించారు. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారునిగా కూడా ఉన్నారు.

# పోలీసులకు పూర్తి స్వేచ్ఛ

### గంజాయి బ్యాచ్ ఆటకట్టించండి

### యువతి హత్య, బాలికపై అత్యాచారం కేసుల్లో సత్వర విచారణ జరపాలి: సిఎం చంద్రబాబు


### రెండు ఘటనల్లో దర్యాప్తు, చర్యల వివరాలు సిఎంకు వివరించిన డిజిపి, ఉన్నతాధికారులు

విజయవాడ,జూన్ 10,ప్రభాతవార్తప్రతినిధి: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆడబిడ్డలపై జరిగిన రెండు ఘటలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉండవల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో సమీక్ష చేశారు. అనంతపురం పట్టణంలో ఇంటర్ విద్యార్థిని హత్య, శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగురాళ్లపల్లిలో బాలికపై అత్యాచారం ఘటనపై సీఎం సమీక్షించారు. రెండు ఘటనలపై డీజీపీ సహా ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి దర్యాప్తు అంశాలను వివరించారు. అనంతపురం ఘటనలో తన్మయి అనే యువతి తెలిసిన వ్యక్తి చేతిలో హత్యకు గురికాగా....ఏడుగురాళ్లపల్లిలో బాలికపై కొద్దిమంది చాలా కాలంగా అత్యాచారానికి పాల్పడడం దారుణమని అన్నారు. ఈ రెండు ఘటనలపై సీఎం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కేసు పూర్వాపరాలు పూర్తిగా తెలుసుకున్న ముఖ్యమంత్రి...ఈ కేసుల్లో నిందితులకు వెంటనే శిక్షలు పడాలని అన్నారు. వెంటనే విచారణ పూర్తి చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేసి ట్రయల్స్ పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రత్యేక శ్రద్ధతో పక్కాగా ఆధారాలు సేకరించి నిందితులకు అత్యంత కఠిన శిక్షలు పడేలా చూడాలని సీఎం అన్నారు. మహిళలపై నేరాల విషయంలో పోలీసు శాఖ కఠినంగా వ్యవహరించాలన్నారు. నేరం చేయాలనే ఆలోచన ఉన్నవారు పోలీసులు తీసుకునే చర్యల గురించి భయపడే పరిస్థితి రావాలన్నారు. ఆడబిడ్డలపై క్షణికావేశంలోనో గంజాయి మత్తులోనో, వ్యవస్థీకృతంగానో నేరాలకు పాల్పడే వారికి శిక్షతప్పదనే అభిప్రాయాన్ని కలిగించాల్సి ఉందని సీఎం అన్నారు. ఈ రెండు ఘటనలే కాకుండా మహిళలపై అఘాయిత్యాలకు, వారిపై హింసకు, లైంగిక దాడికి ఎవరు పాల్పడినా గట్టి సందేశం ఇచ్చేలా పోలీస్ శాఖ దర్యాప్తు, చర్యలు ఉండాలని సీఎం అన్నారు. గత ప్రభుత్వంలో 5 ఏళ్ల నేరగాళ్లపై నియంత్రణ లేదని, గంజాయి, డ్రగ్స్, చట్టం అంటే భయం లేకపోవడం వల్ల నేరగాళ్ల అదుపులో లేకుండా పోయారని...దీంతో నేటికీ కొందరు పాత అలవాట్లను మానుకోవడం లేదని అన్నారు. ముఖ్యంగా గంజాయి బ్యాచ్ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. ఈ విషయంలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తు న్నాన న్నారు. 100 శాతం మార్పు కనిపించాలని సీఎం తెలిపారు. ఈ సమీక్షలో చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇంటలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్రలడ్డా ఇతర అధికారులు పాల్గొన్నారు. జూన్ 21న విశాఖలో జరిగే యోగా దినోత్సవానికి ప్రధాని మోదీ హాజరవుతున్నందున మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని మంత్రుల బృందం దిశానిర్దేశం చేస్తుందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. గత నెల 21 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న యోగాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు సమీక్షను నిర్వహించారు. చరిత్రను సృష్టించే విధంగా యోగాంధ్ర 2025 నిర్వహిస్తాన్నామన్నారు. ఫోటోల కోసమో, ఈవెంట్ల కోసమే చేసే కార్యక్రమం కాదు. నెల మొత్తం పలు కార్యక్రమాలు నిర్వహించి యోగాపై ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకురావాలని నిర్ణయించాం. విశాఖ ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు 5 లక్షల మందితో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తాం. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్లమందికి తగ్గకుండా కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నాం. 10 లక్షల మందితో యోగా కోర్సులు చేయించి వారికి సర్టిఫికెట్లు కూడా అందజేయాలని నిర్ణయించాం. సముద్రం పక్కన ఇలాంటి యోగా నిర్వహించడం అరుదైన విషయం. సముద్ర తీరాన, ప్రకృతి ఒడిలో జరిగే ఈ కార్యక్రమం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. పలు యూనివర్సిటీలు, పబ్లిక్, ప్రైవేటు సంస్థల్లోని వాలంటీర్లు, మహిళలు, వృద్ధులు, పోలీసులు, ఉద్యోగులు యోగా దినోత్సవంలో భాగస్వా >>2

## గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలు విడుదల

**విజయవాడ,జూన్10,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీపీఎస్సీ గ్రూప్1 మెయిన్స్ ఫలితాలు విడుదలయ్యాయి. మే 3 నుంచి 9వ రకు నిర్వహించిన ఈ ఎగ్జామ్స్‌కు 4000ల మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జాప్యం లేకుండా మూల్యాంకనం పూర్తి చేసి నెల రోజుల్లోనే ఫలితాలను రిలీజ్ చేసింది. 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను మౌఖిక పరీక్షలకు ఎంపిక చేసింది. ఈనెల 23 నుంచి 30 వరకు ఇంటర్వ్యూలు జరగనున్నాయి. స్పోర్ట్ కోటాలో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 17న సర్టిఫికెట్ల వెరికేషన్ చేసి వాటిని శాప్ కు పంపుతారు. అక్కడి నుంచి ధృవీకరణ వచ్చాక స్పోర్ట్స్ అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేయనున్నారు. మెయిన్స్ ఫలితాలను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్ లో ఉంచారు. నిబంధనల ప్రకారం పూర్తిగా పారదర్శకంగా, సీసీ కెమెరాల నీడలో హడావుడి లేకుండా జవాబు పత్రాల మూల్యాంకనం జరిగిందని ఏపీపీఎస్సీ వర్గాలు వెల్లడించాయి.

2023 డిసెంబర్‌లో 89 గ్రూప్1 ఉద్యోగాల నియామకానికి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. గత సంవత్సరం మార్చి 17న ప్రిలిమ్స్ పరీక్షను >>2



మంగళవారం అమరావతిలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సిఎం చంద్రబాబు

## సిఎం చంద్రబాబుతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భేటీ

### రాష్ట్ర పురోభివృద్ధిని వివరించిన సిఎం

### మోడీ నాయకత్వంలో దేశం అసాధారణ ప్రగతి సాధించిందన్న కిషన్ రెడ్డి

**విజయవాడ జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మంగళవారం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సమావేశం అయ్యారు..సీఎం చంద్రబాబునాయుడిని ఆయన వ్యక్తిగత నివాసగృహంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కలుసుకున్నారు.సీఎం ఆహ్వానం మేరకు ఆయనతో కలసి భోజనం చేసారు. ఆ సమయంలో వీరిద్దరూ వివిధ అంశాలపై చర్చించుకున్నారు. సుమారు రెండు గంటల పాటు వారిద్దరు వికసిత్ భారత్,అమరావతి,పోలవరం,బనచర్ల ప్రాజెక్ట్, పీ-4 విధానం సహా రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై ప్రస్తావన వచ్చింది.అమరావతి నిర్మాణంలో తీసుకుంటున్న కార్యచరణ,నగరానికి అనుసంధానంగా రాష్ట్రంలోని అన్ని కీలక ప్రాంతాలను కలుపుతూ రోడ్ల తదితరంశాలపై సీఎం కేంద్రమంత్రితో సంభాషించారు.గత ప్రభుత్వంలో ఏపీ విధ్వంసానికి గురైందని, కేంద్రం సహాయంతో రాష్ట్రాన్ని వికాసం వైపుకు తీసుకుని వెళ్తున్నామని సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో వ్యాఖ్యానించారు. >>2

## 'ఫోన్' తీసిన ప్రాణం

### తల్లిమందలించిందని కుమార్తె ఆత్మహత్య

**రాజంపేట అర్బన్, జూన్ 10 ప్రభాతవార్త :** మదనపల్లెలో గఫూర్, హసీనా దంపతుల కుమార్తె మస్తానీ (16) ఎనిమిదో తరగతి వరకు చదువుకుని >>2

## రిమాండ్ ఖైదీ పిఎస్సార్‌కు తీవ్ర అస్వస్థత

**విజయవాడ, జూన్ 10ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీపీఎస్సీ అక్రమాల కేసులో రిమాండ్‌లో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్సార్ ఆంజనేయులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి పోలీసులు తరలించారు. హై బీపీ, హృద్రోగ సమస్యతో పీఎస్సార్ బాధపడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలో ఐపీఎస్ అధికారికి వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. ఏపీపీఎస్సీ పరీక్ష మూల్యాంకనం అవకతవకల కేసులో పీఎస్సార్ అరెస్ట్ అయి విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. బెయిల్ కోసం జిల్లా కోర్టులో పిటిషన్ వేయగా నిరాశే ఎదురైంది. దీంతో హైకోర్టుకు అప్పీలుకు వెళ్లగా ఆయన వేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. అనారోగ్య సమస్యలుంటే కింద కోర్టులో పిటిషన్ దాఖలు చేసుకుంటే రెండు వారాల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందే విధంగా అనుమతి పొందవచ్చుని ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉండగా ఈరోజు ఉదయం జిల్లా జైలులో హైబీపీ, గుండె సంబంధిత సమస్యతో పీఎస్సార్ ఇబ్బంది పడుతున్నట్లు సిబ్బంది తెలియజేయడంతో అప్రమత్తమైన జైలు అధికారులు స్థానికంగా ఉన్న వైద్యులకు చూపించారు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని సిఫార్సు చేయడంతో >>2

# 'తొక్కిసలాట' దోషులెవరు?

### తప్పిదాలపై ఇంకా స్తబ్దుగా కమిషన్ నివేదికలు

### విజిలెన్స్ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బాధితుల ఆరోపణ

### విచారణ పూర్తయినా బయటకురాని 'బాధ్యులు'



**తిరుపతి,జూన్ 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలు కల్పించే సమయంలో జనవరి8వతేదీ రాత్రి తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనలో ఎవరి తప్పిదమనేది నేటికీ మిస్టరీ తేలడం లేదు. ఈ ఘటనలో అప్పట్లో ఏకంగా తిరుపతిలోని బైరాగి పట్టెడ రామానాయుడు పాఠశాల కౌంటర్ల ప్రాంతంలో బందోబస్తు విధుల్లో ఉన్న తిరుపతి నగర క్రైమ్ డీఎస్పీ రమణకుమార్, టీటీడి ఎస్వీ గోశాల డైరెక్టర్ హరనాథరెడ్డిని అదేరోజు సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఇంకా అక్కడ విధుల్లో ఉన్న అప్పటి టిటిడి జెఇఒ గౌతమి, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ శ్రీధర్‌పై తక్షణం బదిలీ వేటుపడింది. ఆ తరువాత తిరుపతి నగర డీఎస్పీ వెంకటనారాయణను కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ తొక్కిసలాటఘటనకు తిరుపతిలో ఆఫ్ లైన్‌లో టోకెన్లు జారీకి ముందు తగిన జాగ్రత్తలు, ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించలేక >>2

11-6pg2exHMNWJQE.qxd:11-6pg2exHMNWJQE.qxd 01/01/01 8:53 AM Page 1





మంగళవారం కోర్టుకు హాజరవుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

# వరుస కేసులతో కాకాణి ఉక్కిరిబిక్కిరి!

**నెల్లూరు రూరల్, జూన్ 10, ప్రభాతవార్త:** అక్రమ మైనింగ్ కేసులో ఏ4 ముద్దాయిగా మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి అరెస్ట్ 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం నెల్లూరు జిల్లా కోర్టులో పోలీస్ కస్టడీకి మూడు రోజులు నెల్లూరు రూరల్ డిఎస్పి ఆధ్వర్యంలో పలు ప్రశ్నలుకు ఎలాంటి సమాధానం లేకపోవడంతో పోలీస్ కస్టడీ పూర్తి కావడంతో గుంటూరు సిఐడి పోలీసుల అదుపులో మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి ప్రతిష్టకు భంగం కలిగేలా సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడంపై వైఎస్ఆర్సిపి మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి పై కేసు నమోదయింది. మాజీమంత్రి అంబటి రాంబాబు ఆయన్ని కలిసేందుకు గుంటూరు కోర్టుకు వచ్చారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పై మాఫింగ్ ఫోటోలతో సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు కాకాని గోవర్ధన్ రెడ్డి సోషల్ మీడియా నుండి అభ్యంతరమైన పోస్టు పెట్టారంటూ మేకల సురేంద్ర ఇచ్చిన కంప్లేట్‌ని ఆధారంగా తీసుకుని గుంటూరు సిఐడి పోలీసులు పిటి వారెంట్ అందించారు. మాజీమంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని గుంటూరు కోర్టులో ప్రవేశపెట్టనున్న పోలీసులు ఈ కేసులో గుంటూరు కోర్టు 14 రోజులు డిమాండ్ విధించింది. ఆయన్ని గుంటూరు కోర్టు నుండి నెల్లూరు జిల్లా సెంట్రల్ జైలుకు తరలించారు. కోర్టులో ఆయన్ని పరామర్శించి వచ్చిన వైఎస్ఆర్సిపి మాజీ మంత్రి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని కోర్టుకు తీసుకొచ్చిన తీరు ఒక టెర్రరిస్ట్ ని తీసుకువచ్చిన విధంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. కనీసం ఎవరిని ఆయన్ని కలిసేందుకు అనుమతించకుండా మిలటరీ రాజ్యాంగం నడుస్తున్నట్టు వ్యవహరిస్తున్నారు. కాకాణిపై గత శనివారం రాత్రి మరో రెండు కేసులు నమోదు చేసినట్టు సమాచారం.

# స్వర్ణాంధ్ర పారిశ్రామిక అభివృద్ధికి చంద్రబాబు చైర్మన్‌గా టాస్క్‌ఫోర్స్

**విజయవాడ,జూన్10,ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణాంధ్ర-2047 పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా ఏపీ ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది. దీనికి చైర్మన్‌గా సిఎం చంద్రబాబు...కో-చైర్మన్‌గా టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ వ్యవహరించనున్నారు. సభ్యులుగా సీఐఐ డీజీ చంద్రజిత్ బెనర్జీ,అపోలో అస్పత్రి వైస్ చైర్‌పర్సన్ ప్రీతారెడ్డి,భారత్ బయోటెక్ ఎండీ సుచిత్ర ఎల్ల,ప్రొఫెసర్ రాజ్‌రెడ్డి,సతీష్‌రెడ్డి,జీఎం రావు,ఎల్ అండ్ టీ చైర్మన్ సుబ్రహ్మణ్యన్,టీవీఎస్ మోటార్ చైర్మన్ వేణు శ్రీనివాసన్,సీఎస్ విజయానంద్ ఉండనున్నారు సొసైటీ ఆఫ్ జీరో పావర్టీ, ఉద్యోగ కల్పన, నైపుణ్యత, మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, వ్యవసాయ సాంకేతికత, అంతర్జాతీయ స్థాయి లాజిస్టిక్స్, ఇంధన వనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులుబ్రాండింగ్, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్..ఇలా 10 ప్రధాన సూత్రాలతో కార్యాచరణ నిర్దేశించుకున్నాను స్వర్ణాంధ్ర విజన్2047లో భాగంగా ఏపీ ప్రభుత్వం ప్రణాళిక చేపట్టింది.అన్ని జిల్లాలు సమానంగా అభివృద్ధికి వాట్సప్ గవర్నన్స్ ద్వారా 400కి పైగా ప్రభుత్వ సేవలు అందిస్తుంది. వచ్చే 2 నెలల్లో మొత్తం ప్రభుత్వ సేవల్ని మన మిత్రతో పొందడానికి వీలు కల్పించింది. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, సచివాలయ స్థాయిల్లో విజన్ అమలు ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ హెల్తీ, వెల్తీ, హ్యాపీ రాష్ట్రంగా ఉండాలనేది మన అంతిమ లక్ష్యంగా ప్రభుత్వం ఉంది.రాష్ట్రంతో పాటు 26 జిల్లాలకు విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు సిద్ధం చేశాం. విజన్ యాక్షన్ ప్లాన్ పర్యవేక్షణ, అమలుకు ప్లానింగ్ విభాగం, జీఏడీ, ఐటీఈ సీ, ఆర్టీజీఎస్, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ, ఫైనాన్స్, ఐ పీఆర్, సీఎంఓ కలిసి పనిచేస్తున్నాయి. 26 జిల్లాలకు గాను 5 ఏళ్ల రోడ్‌మ్యాప్ రూపొందించాం. లక్ష్యాలను సాధించడం కోసం యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు, స్వర్ణాంధ్ర విజన్2047తో పాటు ఈ నాలుగేళ్లలో ఏమి చేస్తాం అనేది ప్లాన్ చేసుకోవాలి. అన్ని జిల్లాలు సమానంగా అభివృద్ధి చెందేలా చూస్తున్నారు.ఈ క్రమంలో ఆదాయ వృద్ధి,ఉపాధి,ఉద్యోగ కల్పనలో భాగం పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తుంది.ఇందు కోసం ఏపీ ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది .

# భారత్ యువకునిపై అమెరికా పోలీసుల దాష్టీకం

## వలసవాదిని రానివ్వమంటూ ఎయిర్‌పోర్టులో దౌర్జన్యం

## నేలకేసి నొక్కిపట్టి హింసించిన వైనం

**న్యూయార్క్, జూన్ 10:** ఎన్నో ఆశలతో స్వయంసమృద్ధి లక్ష్యంగా అమెరికాలోకి అడుగుపెట్టిన భారతీయ విద్యార్థి పట్ల అమెరికా అధికారులు ప్రవర్తించిన తీరు ప్రస్తుతం సర్వత్రా విమర్శలపాలవుతోంది. న్యూయార్క్ ఎయిర్‌పోర్ట్‌లో విమానం దిగిన అతడ్ని సెక్యూరిటీ అధికారులు అడ్డుకున్నారు. నేలకేసి నొక్కిపెట్టి హింసించారు. ఇదుకు సంబంధించిన వీడియో వైరల్ అయ్యింది. ఈ ఘటనను భారతీయులు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన నేపథ్యంలో భారత్‌లోని యూఎస్ రాయబార కార్యాలయం తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధమైన ప్రయాణికులను అమెరికా స్వాగతిస్తూనే ఉంటుందని పేర్కొంది. అయితే, చట్టవిరుద్ధమైన వారికి తమ దేశంలోకి ప్రవేశించే హక్కు లేదని పేర్కొంది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. 'మా దేశంలోకి వచ్చే చట్టబద్ధమైన ప్రయాణికులను అమెరికా స్వాగతిస్తూనే ఉంటుంది. అయితే, చట్టవిరుద్ధమైన వారికి యూఎస్‌ను సందర్శించే హక్కు లేదు. అక్రమ ప్రవేశం, వీసాల దుర్వినియోగం, యూఎస్ చట్టాలను ఉల్లంఘించడాన్ని మేము సహించము. వారిని మా దేశంలోకి అనుమతించబోము' అని భారత్‌లోని యూఎస్ ఎంబసీ తన ట్వీట్‌లో పేర్కొంది. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది. కాగా, రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఆ దేశంలో అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించి స్వదేశాలకు పంపుతున్నారు. ఈ క్రమంలో భారత్‌కు చెందిన ఓ విద్యార్థి న్యూయార్క్ ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే అక్కడి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. నేలపై పడుకోబెట్టి, చేతులకు బేడీలు వేశారు. వీసా రద్దయిందని, చట్ట వ్యతిరేకంగా అమెరికాలోకి ప్రవేశించావని చెప్తూ తిరిగి వెనక్కి పంపించారు. ఎయిర్‌పోర్ట్‌లో ఈ వీడియో తీసిన కునాల్ జైన్ అనే ప్రవాస భారతీయుడు సోషల్‌మీడియాలో పోస్ట్ చేశాడు. సదరు విద్యార్థి మాటతీరు చూస్తుంటే హర్యానాకు చెందిన వ్యక్తిగా అనిపించాడని పేర్కొన్నాడు. కలలను సాకారం చేసుకోవడానికి వచ్చానని, ఎవరికీ హాని తలపెట్టేందుకు రాలేదని, విద్యార్థి బోరున విలపిస్తున్నా పట్టించుకోకుండా నేరస్థుడి పట్ల వ్యవహరించినట్టు ప్రవర్తించారని చెప్పాడు. ప్రత్యక్ష సాక్షిగా ఈ దారుణంపై స్పందించలేని, నిస్సహాయ స్థితిలో చూస్తూ ఉండిపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశాడు

# అపార్టుమెంట్‌లో అగ్నిప్రమాదం

**న్యూఢిల్లీ,జూన్ 10:** దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ద్వారక ప్రాంతంలోని ఓ నివాస భవనంలో చెలరేగిన మంటలు ఓ కుటుంబాన్ని చిదిమేశాయి. ప్రాణాలు కాపాడుకునేందుకు బాల్కనీ నుంచి దూకిన తండ్రి, ఇద్దరు పిల్లలు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ద్వారక సెక్టర్13లోని షాపత్ సొసైటీ అనే రెసిడెన్షియల్ భవనంలోని 8, 9 అంతస్తుల్లో ఈ రోజు ఉదయం 10 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు పెద్దయెత్తున వ్యాపించడంతో కిటికీల నుంచి దట్టమైన పొగలు, అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. దీంతో ఎనిమిదవ అంతస్తులో ఉంటున్న యశ్ యాదవ్ (35), ఆయన ఇద్దరు పదేళ్ల పిల్లలు ఒక అబ్బాయి, ఒక అమ్మాయి తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రాణాలు కాపాడుకోవడానికి బాల్కనీ నుంచి కిందకుదూకేశారు. ఎనిమిదవ అంతస్తు నుంచి దూకడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ యశ్ తో పాటు ఆయన పిల్లలు ఇద్దరూ మరణించారని వైద్యులు తెలిపారు. ప్రమాద సమయంలో ఇంట్లోనే ఉండిపోయిన యశ్ యాదవ్ భార్య, పెద్ద కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అధికారులు వారిని ఐజీఐ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఐదు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది స్కై లిఫ్ట్ సహాయంతో సహాయక చర్యలు చేపట్టి, మంటలను అదుపులోకి తెచ్చారు. ముందుజాగ్రత్త చర్యగా షాపత్ సొసైటీలోని నివాసితులందరినీ ఖాళీ చేయించారు. తదుపరి ప్రమాదాలు జరగకుండా భవనానికి విద్యుత్, గ్యాస్ కనెక్షన్లను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మన జనాభా 146 కోట్లు

>> నిలకడగా కొనసాగుతోందని యూఎన్ కితాబిచ్చింది. ప్రస్తుతం భారతదేశ జనాభా 146 కోట్ల దరిదాపుల్లో ఉంది. రాబోయే 40 ఏళ్లలో భారత జనాభా 170 కోట్ల గరిష్ఠ స్థాయికి చేరొచ్చు. ఆ తర్వాతి నుంచి జనాభా తగ్గుదల మొదలయ్యే అవకాశం ఉందని సమితి విశ్లేషించింది. భారత్‌లోని 68 శాతం జనాభా 15 నుంచి 64 ఏళ్లలోపు వయో వర్గానికి చెందినది. ఇది వర్కింగ్ ఏజ్ గ్రూప్. అత్యధిక జనాభా వర్కింగ్ ఏజ్ గ్రూప్‌లో ఉండటం అనేది భారత్‌కు కలిసొచ్చే అంశం. వర్కింగ్ ఏజ్‌లోని వారికి తగినన్ని ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ విధానపరమైన మద్దతు లభిస్తే భారత్ ఆర్థికంగా మంచి పురోగతిని సాధిస్తుంది. భారత జనాభాలో 10-24 ఏళ్లలోపు వారు 26శాతం, 14 ఏళ్లలోపు వారు 24శాతం, 10-19 ఏళ్లలోపు వారు 17 శాతం మంది ఉన్నారు. 65 ఏళ్లకుపైబడిన వారు భారత్‌లో కేవలం 7 శాతం మందే ఉన్నారు. ప్రజల ఆయుష్షు పెరుగుతున్నందున రాబోయే కొన్ని దశాబ్దాల్లో 65 ఏళ్లకుపైబడిన వయో వర్గంలోని వృద్ధుల సంఖ్య మరింత పెరగొచ్చు. 2025 నాటికి భారత దేశంలోని పురుషుల సగటు ఆయుష్షు 71 ఏళ్లుగా, మహిళల సగటు ఆయుర్దాయం 74 ఏళ్లుగా ఉంది.ప్రపంచ దేశాల్లో సంతానోత్పత్తి సంక్షోభం ఏర్పడిందని ఐరాస ఆందోళన వ్యక్తం చేసింది. కుటుంబ నియంత్రణ చర్యలు, గర్భనిరోధక సాధనాల వినియోగం, లైంగిక ఆరోగ్యం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఎవరికి వారుగా సంతానోత్పత్తి నిర్ణయాలను తీసుకోవాలని నివేదికలో పేర్కొంది. ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు వారి వ్యక్తిగత సంతానోత్పత్తి లక్ష్యాలను గుర్తించలేకపోయారని, జనాభా అంశంలో ప్రస్తుతానికి ఇదే నిజమైన సంక్షోభమని అని సమితి హెచ్చరించింది. 1970వ దశకం నాటికి భారతీయ మహిళల సగటు సంతానోత్పత్తి రేటు ఐదుగురు పిల్లలని, కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయిందని యూఎన్ఎఫ్ భారత విభాగం ప్రతినిధి ఆండ్రియా ఎం వోజ్నర్ తెలిపారు. భారత ప్రభుత్వం చొరవ వల్ల మహిళల్లో అన్ని రకాల అవగాహన పెరిగింది. ఇప్పుడు భారతీయ మహిళలు సగటున ఇద్దరు పిల్లలకే జన్మనిస్తున్నారు. ప్రెగ్నెన్సీ సమయంలో సంభవించే మహిళల మరణాలు తగ్గిపోయాయి. అయితే ఈవిషయంలో భారత్‌లోని వివిధ రాష్ట్రాలు, కులాలు, ఆదాయ వర్గాల్లో తేడాలున్నాయి. సంతానం ఎంతమంది ఉండాలనే దానిపై స్వేచ్ఛగా నిర్ణయం తీసుకునే హక్కు ప్రతి ఒక్కరికి ఉంది. సంతానోత్పత్తిలో ప్రజలకు స్వేచ్ఛను కల్పిస్తూ, ఆర్థిక ఉన్నతిని సాధించే గొప్ప అవకాశం భారత్ ఎదుట ఉందని ఆండ్రియా పేర్కొన్నారు. భారత జనాభా త్వరలో 150 కోట్లకు చేరుకుంటుందని, ఆ తర్వాత 170 కోట్ల వరకు వెళ్తుందని, అయితే మరో 40 ఏళ్లలో ఆ జనాభా తగ్గుదల ప్రారంభం అవుతుందని రిపోర్టులో పేర్కొన్నారు.1960లో భారతీయ జనాభా 44 కోట్లు ఉండేదని, ఆసమయంలో మహిళలు కనీసం సగటున ఆరుగురిని కనేవారని, అప్పట్లో గర్భనిరోధక విధానాలు తక్కువ అని, ప్రాథమిక విద్య కూడా తక్కువగా ఉండేదన్నారు. కానీ రిప్రొడక్టివ్ హెల్త్‌కేర్‌పై అవగాహన పెరగడంతో ఫెర్టిలిటీ రేటు తగ్గుతూ వచ్చిందన్నారు. ప్రస్తుతం సాధారణ భారతీయ మహిళ ఇద్దరికి జన్మనిస్తోందని రిపోర్టులో పేర్కొన్నారు. 1970లో అయిదుగుర్ని కనేవాళ్లు, ఇప్పుడు ఆ సంఖ్య రెండుకు చేరిందని, పునరుత్పత్తి ఆరోగ్యవిషయంలో భారతీయమహిళల్లో అవగాహన పెరిగిందని యూఎన్ ఎఫ్‌పీఏ ప్రతినిధి ఆండ్రియా ఎంవోజ్నర్ తెలిపారు. మెటర్నటీ మోర్టాలిటీ కూడా తగ్గినట్లు తేల్చారు.

# 'తొక్కిసలాట' దోషులెవరు?

>> పోవడమే కారణమని పలువురు క్షతగాత్రులైన బాధితులు స్విమ్స్,రుయా ఆస్పత్రుల్లో చికిత్స పొందిన సమయంలోనే సిఎం చంద్రబాబుకు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే ఘటనలో జనవరి 8వతేదీ రాత్రి విశాఖపట్నం తాటిచెట్లపాలెంకు చెందిన లావణ్యస్వాతి(37), కంచర్లపాలెంకు చెందిన శాంతి(35), మద్దెలపాలెంకు చెందిన రజని(47), నరసరావుపేట రామచంద్రాపురంకు చెందిన బాబునాయుడు(51), తమిళనాడు సేలంజిల్లా మేదారిగ్రామంకు చెందిన మల్లిగ(50), పొల్లాచ్చికి చెందిన నిర్మల(45)అర్థాంతరంగా ప్రాణాలుయ కోల్పోయిన ఉదంతం విదితమే. మరో 50మంది వరకు క్షతగాత్రులయ్యారు. ఈ విషాద ఘటన జనవరిలో దక్షిణభారతదేశంలోనే పెద్ద దుమారం రేపింది. ఈ కేసులో కీలక విషయాలు వెలుగులోకి తీసుకురావడానికి, ఇంకా బాధ్యులైన పోలీస్, రెవెన్యూ, టిటిడి విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బందిపై చర్యలకు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తిని విచారణ కమిషన్ ఛైర్మన్‌గా నియమించింది. ఆయన నేతృత్వంలోని కొందరు సిబ్బంది ఏకంగా మూడునెలలు తిరుపతి జిల్లాకలెక్టరేట్‌లో ప్రత్యేక ఛాంబర్ నుండి విధులు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరచారి, అప్పటి జెఇఒ గౌతమి, సివిఎస్ఒ శ్రీదర్‌లను పలు దఫాలుగా విచారణ చేశారు. దీనిపై ప్రత్యేక నివేదిక రూపొందించారు. పూర్తిగా పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తొక్కిసలాట, ఆరుగురు ప్రాణీలు తీసిందనేది బాధితుల ఆరోపణలు. విచారణ కమిషన్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తి ఎదుట తమ వాదన వినిపించారు.

**నివేదికలో ఇంకెవరున్నారో!?:** ఈ ఏడాది జనవరిలో వైకుంఠద్వార దర్శన టోకెన్లకోసం తెలుగు రాష్ట్రాలనుండేగాక తమిళనాడు, కర్నాటక, కేరళ, మహారాష్ట్రల నుండి భారీగా భక్తులు తరలివచ్చిన సంగతి తెలిసిందే. జనవరి 10వతేదీ నుండి వైకుంఠద్వార దర్శనాలు చేయించేందుకు 8వతేదీ నిర్దేశించిన సమయం కంటే 18-20గంటల ముందే 40వేలమంది భక్తులు తిరుపతికి రావడంతో అదేరోజు ఆహారం, తాగునీరు, ఇతర సౌకర్యాల కోసం తంటాలు పడ్డారు. ఒక్కసారిగా వేలాదిమంది తరలివచ్చేయడంతో ఆఫ్‌లైన్‌లో దర్శన టోకెన్లు జారీచేసే ఇందిరామైదానం,,శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవికాం ప్లెక్స్, ఎంఆర్‌పల్లి, బైరాగిపట్టెడ, జీవకోన,రామచంద్రపుష్కరిణి ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ఎటు చూసినా గోవిందమాలలు ధరించిన భక్తులు, తమిళనాడు, కర్నాటక, తెలుగూరాష్ట్రాల నుండి కొన్నివందల కిలోమీటర్లు కాలినడకన ,వాహనాల్లో చేరుకున్న వారితో కిక్కిరిసిపోయాయి.భారీగా వచ్చిన భక్తులను నియంత్రించి కట్టడిచేయడంలో అటు టిటిడి అధికారులు ఇటు పోలీసుయంత్రాంగం ఘోర వైఫల్యంతో ఆరుమంది భక్తులు ప్రాణాలు కోల్పోవడం జరిగింది. ఇప్పటికీ విచారణ పూర్తయినా ఇంకా ఈ ఘటనలో బాధ్యులెవరనేది తేల్చాల్సి ఉంది. పోలీస్ పరంగా సిఐలు, ఎస్ఐలు, రెవెన్యూశాఖపరంగా సిబ్బంది, టిటిడి విజిలెన్స్ విభాగంలో ఏవిఎస్ఒలు, విఐలు బాధ్యులెవరనేది కమిషన్ నివేదికలో వెల్లడికావలసి ఉంది. ఇంతటితో ఈ కేసుకు పుల్‌స్టాప్ పెట్టేశారా అనేది కూడా జనంలో చర్చగా మారింది.

# పోలీసులకు పూర్తి స్వేచ్ఛ

>>ములు కావాలన్నారు. అలాంటివారికి ధ్రువపత్రాలు కూడా అందజేస్తాం. పట్టణాలు, నగరాల నుంచి గ్రామస్థాయి వరకూ యోగాభ్యాసన కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మన రాష్ట్రంలో రూ. 5 కోట్ల కంటే ఎక్కువ ఆదాయం వచ్చే ఆలయాలు 21 ఉన్నాయి. అమరావతి బుద్ధ స్థూపం, లేపాక్షి శిల్పారామం, గండికోట, అరకు, లంబసింగి, కోనసీమ , అఖండ గోదావరి ఇలా 100 పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాల్లో యోగా ప్రాముఖ్యతను వివరించే ఏర్పాట్లు చేశాం. ప్రధాని మోదీ ప్రపంచమంతా యోగాను ప్రమోట్ చేస్తున్నప్పుడు మనకూ బాధ్యత ఉంటుంది కదా. ఎలక్ట్రానిక్, ప్రింట్, సోషల్ మీడియా కూడా చొరవ తీసుకుని యోగాను ప్రమోట్ చేయాలి. మంచి కంటెంట్ తో ఆర్టికల్స్ రాయాలి. మంచి వీడియోస్ తయారుచేయాలి. మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగాతో అసోసియేట్ చేసుకుని 2 వేలమంది యోగా శిక్షకులను తయారుచేస్తాం. పాఠశాలలో రెండు వేల మందిని తయారుచేస్తాం.యోగా ప్రాముఖ్యత తెలిపేలా స్కూల్ సిలబస్‌లో పెడతాం. స్కూళ్లు మొదలవగానే గంట సేపు విద్యార్థులకు యోగా శిక్షణ ఇప్పిస్తాం. యోగా గురించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన వాలంటీర్లకు జూన్ 21న ప్రధాని సభలో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. అందరికీ ఆరోగ్యం, సంపద, సంతోషమే స్వర్ణాంధ్ర 2047 లక్ష్యం. మన సమస్యలకు చక్కటి పరిష్కారం యోగా. అందరూ రోజూ ఒక గంట ప్రాణాయామం, ఆసనాలు, మెడిటేషన్ చేయాలి. వీటిని ప్రాక్టీస్ చేస్తే ఒత్తిడి మాయమై పనిని ఎంజాయ్ చేస్తారు. యోగా కోసం ఆర్ట్ ఆఫ్ లివింగ్,ఈషా, పతంజలి, బ్రహ్మ కుమారీస్ ఇలాంటి అసోసియేషన్లు దేశవ్యాప్తంగా పనిచేస్తున్నాయి. వీరితో నేను ఎన్నో ఏళ్లుగా అసోసియేట్ అవుతున్నానన్నారు.

# సిఎం చంద్రబాబుతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భేటీ

>> ప్రధాని సమర్ధనాయకత్వం అందరికి ఆదర్శనీయమన్నారు.కిషన్‌రెడ్డిని సీఎం చంద్రబాబు ఉచితరీతిన సత్కరించి,జ్ఞాపికను అందజేసారు. విజయవాడ పర్యటలనకు మంగళవారం వచ్చిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దేశంలో బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయాలను మాట్లాడుతూ గత 11 సంవత్సరాల్లో భారతదేశం మోడీ నాయకత్వం అనేక రంగాల్లో అసాధారణ పురోగతి సాధించిందని స్పష్టం చేశారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆయన మోడీ ప్రభుత్వం 11 ఏళ్ల అభివృద్ధి కార్యక్రమాలపై పుస్తకాన్ని విడుదల చేశారు. ఆయనతోపాటు ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి ఇంకా బీజేపి నేతలు దేశ అభివృద్ధికి మోడీపాలన ఎంత కీలకమైందో వివరించారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ గత 11 ఏళ్లలో మోడీ ప్రభుత్వం మీద ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాలేదని ఇది దేశ ప్రజల నమ్మకానికి నిదర్శనమన్నారు. పేద అణగారిని వర్గాలకు పెద్దపీట వేసేలా మోడీ పాలన ఉండిందని అన్నారు. రైతులు, యువత, మహిళలు ఈ నాలుగు ప్రధాన విభాగాల అభివృద్ధి కోసమే ప్రతి కార్యక్రమం రూపకల్పన చేశారని అన్నారు. భారతదేశం నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని ఇటీవలే 4 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీగా మారిందని కిషన్ రెడ్డి తెలిపారు. పన్నుల వ్యవస్థలో సమగ్ర మార్పులు చేసి జీఎస్టీ ద్వారా వన్ నేషన్ వన్ ట్యాక్స్ లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. 2014లో 6.91 కోట్ల పన్నులు కట్టేవారు ఉండగా ఇప్పుడు 15.66 కోట్లకు పెరిగిందని వివరించారు. అలాగే మోడీ ప్రభుత్వం రైతుల కోసం పలు కీలక నిర్ణయాలు తీసుకుందని తెలుపుతూ వ్యవసాయ బడ్జెట్ 25,633 కోట్ల నంఉచి 1.33 లక్షల కోట్లకు పెరిగిందని, 82% వరకు గిట్టుబాటు ధరలు పెరిగినట్లు వెల్లడించారు. 11 కోట్ల మంది రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఏటా నేరుగా రైతు అకౌంట్‌లోకి నగదు అందిస్తామని అన్నారు. అలాగే ఉగ్రవాదం విషయంలో జీరో టాలరెన్స్ పాలసీ అనుసరిస్తున్నామని చెప్పారు. పఠాన్ కోట్ సర్జికల్ స్ట్రైక్ , పహల్గావ్ దాడి ఆపరేషన్ సింధూర్ వంటి చర్యలు భారత్ శక్తిని చాటిచెప్పినట్టు పేర్కొన్నారు. బ్రహ్మోస్, బ్రహ్మాస్త్రం వంటి సామర్థ్యాలు దేశ రక్షణను మరింత బలంగా తీర్చిదిద్దాయని అన్నారు.

# 'ఫోన్' తీసిన ప్రాణం

>> ఇంటి వద్దే ఉంటోంది. తల్లి హసీనా పనులకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి, మస్తానీ ఫోన్ మాట్లాడుతుండటం గమనించింది. దీంతో ఆమె కుమార్తెను మందలించింది.తల్లి మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మస్తానీ, తాను వేసుకున్న చున్నీతో బాత్రూంలోకి వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది.



భారత్ కాన్సులేట్ జనరల్, ఫుఎన్ ప్రావిన్స్ సంయుక్తంగా మంగళవారం ఫిన్‌షాంగ్ టవర్ వద్ద అతిపెద్ద యోగా ప్రదర్శన జరిపిన చిత్రం

# గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలు విడుదల

>> నిర్వహించింది. అయితే వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హడావుడిగా ప్రిలిమ్స్ నిర్వహించడం వల్ల తాము తీవ్రంగా నష్టపోయామని, మెయిన్స్ పరీక్ష రాసేందుకు తగిన గడువును ఇవ్వాలని కమిషన్ ని పలువురు అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు మెయిన్స్‌కి సన్నద్ధమయ్యేందుకు వీలుగా మరింత గడువు ఇవ్వాలని ఏపీపీఎస్సీ నిర్ణయం తీసుకొని మే 3 నుంచి 9 వరకు మెయిన్స్ పరీక్షలను నిర్వహించింది. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం పట్టణాల్లో 13 కేంద్రాల్లో వీటిని పకడ్బందీగా నిర్వహించారు. త

# సిఎం కాన్వాయ్ మార్గంలో ప్రత్యేక కెమెరాలు

>> వీటిని విజయవాడలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించారు.కొండవీటి వాగు ఎత్తిపోతల వద్ద ఏర్పాటు చేసిన తొలి కెమెరా ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ) ఆధారంగా పనిచేస్తుంది. చంద్రబాబు వాహనశ్రేణికి ముందు వెళ్ళే వాహనం ఎత్తిపోతల వద్దకు రాగానే ఆ కెమెరా జిపిఎస్ ఆధారంగా పసిగడుతుంది. ఆ దృశ్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు పంపుతుంది. అక్కడి నుండి వచ్చిన సమాచారం ఆధారంగా తదుపరి మూడు పాయింట్లను అప్రమత్తం చేస్తుంది. దీంతో పాటు ఈ కెమెరాలు మానవ ప్రమేయం లేకుండా ప్రతి పాయింట్ వద్ద ట్రాఫిక్‌ను నిలిపిన సమయాన్ని లెక్కించి సర్వర్‌కు పంపుతాయి. గన్నవరం విమానాశ్రయం నుండి బయటకు వచ్చిన తర్వాత వచ్చే తొలి కూడలి కేసరపల్లి జంక్షన్ దగ్గర కూడ ఐఓటీ ఆధారంగా పనిచేసే కెమేరాను ఏర్పాటు చేశారు. దాదాపు రెండు నెలల నుండి ఈ వ్యవస్థపై పోలీసులు పనిచేస్తున్నారు. ఇందుకు ప్రత్యేకంగా ఏఐ ప్రోగ్రాంను తయారుచేయించారు.ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గాల్లో తొలుత 10 నిముషాల మేర ట్రాఫిక్ నిలిపివేత సమయం నమోదయ్యేది. ఈ వ్యవస్థ సాయంతో అది గరిష్టంగా 5 నిమిషాలే ఉంటోంది. క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించాక అధికారికంగా ఈ వ్యవస్థను ప్రారంభించనున్నారు.

# సజ్జలకు సమన్లు పంపుతాం

>> ఆ పార్టీ నాయకులు మానసిక క్షోభకు గురిచేస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. 11 సీట్లకే పరి మితం కావడానికి రాజధాని మహిళలే కారణమని ఈ విధంగా తమను కించపరిచేలా వ్యాఖ్యానించడం తగదని హితవు పలికారు.రాజధాని మహిళల ఫిర్యాదును జాతీయ మహిళా కమిషన్‌కు పంపిస్తామని శైలజ చెప్పారు. ఫిర్యాదు అందక ముందు కమీషన్ సుమోటోగా తీసుకొని జాతీయ మహిళా కమీషన్‌కు లేఖ రాసిందని పేర్కొన్నారు.

# భారత్‌లో తగ్గుతున్న పేదరికం: ఎస్‌బిఐ

**ముంబయి, జూన్ 10:** దేశంలో పేదరికం క్రమంగా తగ్గుతోందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజా నివేదిక స్పష్టం చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 5.3 శాతంగా ఉన్న పేదరికం 2023-24 ఆర్థిక సంవత్సరంలో 4.6 శాతానికి తగ్గిందని ఎస్బీఐ తన రిపోర్టులో తెలిపింది. దేశంలో పేదరికం విషయంలో ఎస్బీఐ నివేదిక, ప్రపంచ బ్యాంక్ నివేదిక దాదాపు ఒకే విధంగా ఉన్నాయి. ప్రపంచ బ్యాంక్ కూడా దేశంలో పేదరికం క్రమంగా తగ్గుతోంది. 2023లో 5.3 శాతంగా ఉన్న పేదరికం ఇప్పుడు 4.6 శాతానికి తగ్గిందని తెలిపింది. పేదరిక నిర్మూలనలో దేశం పురోగతి సాధిస్తున్నదనడానికి ఇది నిదర్శనమని ఎస్బీఐ పేర్కొంది. 2011-12 ఆర్థిక సంవత్సరంలో దేశంలో పేదరికం 27.1 శాతంగా ఉండేనని ఎస్బీఐ తన రిపోర్టులో పేర్కొంది. ఇదిలావుంటే ప్రపంచ బ్యాంక్ ఇటీవల గ్లోబల్ పావర్టీ లైన్‌ను సవరించింది. గతంలో రోజుకు 2.15 అమెరికా డాలర్ల కంటే తక్కువ సంపాదన ఉన్నవారిని పేదలుగా పరిగణించగా ఇప్పుడు దాన్ని మూడు డాలర్లకు పెంచింది. అంటే రోజుకు రూ.260 కంటే తక్కువ సంపాదన కలిగి వారిని పేదలుగా పరిగణలోకి తీసుకుంది. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం 2011-12లో దేశంలోని మొత్తం నిరుపేదల్లో 65 శాతం మంది కేవలం ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనే ఉన్నారు. 2011-12లో రూరల్ ఇండియాలో 18.4 శాతం నిరుపేదరికం ఉండగా 2022-23లో అది 2.8 శాతానికి తగ్గింది. అదేవిధంగా 2011-12లో అర్బన్ ఇండియాలో 10.7 శాతం నిరుపేదరికం ఉండగా. 2022-23 నాటికి అది 1.1 శాతానికి దిగివచ్చింది.

# విజయోత్సవసభ

>> గురువారం సాయంత్రం మంగళగిరిలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు సీఎస్ వి.యానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, అఖిలభారత సర్వీసు అధికారులతో కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి తగిన ఏర్పాట్లు చేయాలని ఉత్తర్వుల్లో సీఎస్ పేర్కొన్నారు.

# పక్కాగా ఖరీఫ్ ప్రణాళిక

>> న్నారు. మరోవైపు వాట్సాప్ గవర్నెన్స్ మన మిత్ర ద్వారా కొత్తగా వ్యవసాయ శాఖకు సంబంధించి 3సేవలు అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. పంటల బీమా, వ్యవసాయ యాంత్రీకరణ, మార్క్‌ఫెడ్‌కు సంబంధించిన సేవలను ఇకపై వాట్సప్ ద్వారా రైతులు పొందే అవకాశం కలిగిందన్నారు. రైతులకు ఆఫ్ లైన్, ఆన్ లైన్ లో కూడా వ్యవసాయ విజ్ఞానంపై అవగాహన పెంచాలని ముఖ్యమంత్రి అన్నారు. ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని కాపాడేందుకు కృషి చేయాలి. ఎక్కడా ఎరువుల కొరత లేకుండా చూడాలి ఎరువులు, పురుగుమందుల వినియోగంపై తాజా సమాచారం ఉండాలి. రాష్ట్రంలో గత ఏడాది పంటకాలంలో 39 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించగా, ఈ ఏడాది దానిని 35 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గించేలా చూడాలి. పల్సెస్, మిల్లెట్స్ సాగు పెరగాలి. ఈ సీజన్‌లో రైతులు కోరిన 24 గంటల్లో బ్యాంకులు రుణాలు ఇవ్వాలి అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు.

# పిఎస్సార్‌కు తీవ్ర అస్వస్థత

>> విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గుండె సంబంధిత వైద్యులు ఆయనకు పరీక్ష చేస్తున్నారు. పది రోజుల క్రితం జైలులో ఇదే విధంగా పీఎస్సార్ అనారోగ్యంతో ఇబ్బంది పడటంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యుల పర్యవేక్షణలో సేవలిందించారు. రెండు రోజులు ఉండాల్సి వస్తుందని చెప్పినప్పటికీ వినకుండా నేరుగా జిల్లా జైలుకు వెళ్లినట్లు సిబ్బంది చెబుతున్నారు. తిరిగి ఈరోజు అదే సమస్య పునరావృతం అవడంతో ఆందోళన చెందిన జైలు సిబ్బంది వెంటనే ప్రభుత్వాస్పత్రికి పీఎస్సార్‌ను తరలించారు.ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, సాయంత్రం వరకు చికిత్సకొనసాగిన తర్వాత పరీక్షలు నిర్వహించిన అనంతరం వైద్యుల నివేదికను బట్టి జిల్లా జైలుఅధికారులునిర్ణయంతీసుకునే అవకాశం ఉంది.

## వారం - వర్జ్యం

తేది : 11-06-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు
పౌర్ణమి మ.11.11
జ్యేష్ఠ రా.8.08
వర్జ్యం ఉ.9.17-ఉ.11.00
దు.ఉ.11.42- మ.12.34
శుభసమయం : ఉ.6.15-6.50
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెట్టినా జీవిత భాగస్వామి సాయంతో పూర్తిచేస్తారు.

**వృషభం :** శ్రమకు తగిన ఫలితం కష్టమే. బంధువుల నుండి శుభవార్తలు అందు కొంటారు.

**మిథునం:** ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**కర్కాటకం :** ముఖ్యమైన వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. స్థిరాస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**సింహం:** సంతానంనకు నూతన ఉద్యోగ, విద్యావకాశాలు దక్కుతాయి. మీ మాటకు విలువ పెరుగుతుంది.

**కన్య :** నూతన మిత్రులు పరిచయమై కొత్త వ్యాపారాలకు శ్రీకారంచుడతారు. శుభవార్తలు.

**తుల :** కుటుంబంలో ఏర్పడిన విభేదాలు పరిష్కరించుకొంటారు. మాట పట్టింపులు ఏర్పడతాయి.

**వృశ్చికం:** నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. అనుకున్న పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**ధనుస్సు:** బంధువుల నుండి కీలక సమాచారం అందుతుంది. వివాహ యత్నాలు కొంతవరకు కలిసివస్తాయి.

**మకరం:** విద్యార్థులకు సాంకేతిక విద్యావకాశాలు పొందుతారు. ఇంటా బయటా మీదే పైచేయిగా వుండును.

**కుంభం:** సంతానం నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. షేర్లు భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**మీనం :** సోదరుల నుండి కీలక సమాచారం అందుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తిచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

11-06Pg3 for bz.qxd:11-06Pg3 for bz.qxd 01/01/01 7:17 AM Page 1



# కొమ్మినేని శ్రీనివాస్‌కు 14 రోజుల రిమాండ్

## - గుంటూరు జైలుకు తరలింపు



**మంగళగిరి,జూన్ 10,ప్రభాతవార్త :** ఏపి మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో నమోదైన కేసులు సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస్‌కు మంగళగిరి కోర్టు రిమాండ్ విధించింది.మంగళవారం ఉదయం కొమ్మినేని ని పోలీసులు మంగళగిరి కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చగా..న్యాయమూర్తి కొమ్మినేనికి 14రోజుల పాటు రిమాండ్ విధించారు. అమరావతి మహిళలు,అమరావతి ప్రాంతంపై అసభ్య కరమైన వ్యాఖ్యలతో నిర్వహించిన డిబెట్‌పై రాష్ట్రంలోని అనేక పోలీస్టేషన్లలో పలువురు మహిళలు ఫిర్యాదులు చేశారు.అందులో భాగంగా తుళూ ్ళరు పొలిస్టేషన్ లో టిడిపి మహిళా నాయకురాలు కంభంపాటి శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాదులోని కొమ్మినేని శ్రీనివాస్‌ను ఆయన నివాసంలోనే అరెస్టు చేశారు.అనంతరం గుంటూ రుకు తరలించిన పోలీసులు. రాత్రి నల్లపాడు పోలీసే ్టషన్‌లో విచారణ జరిపారు.ఆపై మంగళవారం ఉదయం గుంటూ రు జిజిహెచ్‌లో కొమ్మినేనికి వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత మంగళగిరి కోర్టులో హాజరుపర్చారు.మంగళగిరి కోర్టు కొమ్మినేని శ్రీనివాస్‌కు 14రోజులపాటు రిమాండ్ విధించింది. రిమాండ్ అనంతరం కొమ్మినేనిని గుంటూరు జైలుకు తరలించారు. అయితే ఇప్పుడు కొమ్మినేని విషయంలో ఒకే అంశంపై పలు పోలీస్టేషన ్లలో కేసు నమోదు అవుతున్నాయి, విజయవాడ సత్యనారాయణ పురం,పడమట పిఎస్ సాలూరు పోలీస్టేషన్‌లో టిడిపి నేతల ఫిర్యాదుతో కొమ్మినేని పై కేసులు నమోదువుతున్నట్లు తెలుసు ్తంది. మంగళగిరి కోర్టులో కొమ్మినేని పై దాఖలు చేసిన పలు సెక్షన్లపై న్యాయమూర్తి అభ్యంతరాలు వ్యక్తంచేశారు.ముఖ్యంగా ఎసీ ్స,ఎస్టీ అట్రాసిటీ కేసు ఈ కేసులో ఎలా చేర్చారంటూ పోలీసులను నిలదీసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును న్యాయమూర్తి తొలగించారని తెలుస్తుంది.ఒకవేళ ఈ కేసులో బెయిల్ లభించిన మిగిలిన కేసుల్లో మళ్ళీ అరెస్టు అయ్యే అవకాశాలున్నాయని అంటున్నారు.విచారణ సమయంలో కొమ్మినేని న్యాయమూర్తిని తన వయస్సు రీత్యా కొన్ని ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని కోరగా, న్యాయమూర్తి ఇందుకు తిరస్కరించారు. అనంతరం కొమ్మినేని ని భారీ బందోబస్తు నడుమ గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

# పంట నష్టానికి రాయితీగా రూ.5.37 కోట్లు

**విజయవాడ జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో ఏప్రిల్‌లో ఉద్యానపంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.పంట చేతికి వచ్చే దిశలో రైతుకు ఈ వర్షాలు తీరని నష్టం కలిగింది.ఈ క్రమంలో వానలకు దెబ్బతిన్న ఉద్యానపంటల రైతులను వెంటనే ఆదుకుంటామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు.వానలు తగ్గుముఖం పట్టిన వెంటనే యుద్ధప్రతిపాదిక పంట నష్టం అంచనాకు ఉద్యాన,వ్యవసాయ ్రశాఖలను ప్రభుత్వం ఆదేశించింది.ఆ నివేదికలను అనుసరించి దెబ్బతిన్న ఉద్యాన పంటలకు పెట్టుబడి రాయితీ కింద రూ.5.37 కోట్లు విడుదల చేస్తూ విపత్తుల నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి జయలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. ఏప్రిల్ 3 నుంచి 22 వరకు కురిసిన వర్షాలకు పలు జిల్లాల్లోని పంటలు దెబ్బతిన్నాయని ఉద్యానశాఖ ప్రభుత్వానికి నివేదించింది. ఈ మేరకు ఏప్రిల్ 3 నుంచి 5 వరకు జరిగిన నష్టానికి రూ.90.85 లక్షలు ఏప్రిల్ 7 నుంచి 22 వరకు జరిగిన నష్టానికి రూ.4.47 కోట్లు విడుదల చేసింది.ఈ డబ్బు వెంటనే నష్టపోయిన రైతులకు అందజేస్తారు.

# తిరుమల సమాచారం



## ముత్యపుకవచంలో మెరిసిన మలయప్ప

**తిరుమల,జూన్ 10ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలేశుని ఆలయంలోపల సంపంగాప్రాకారంలో మలయప్పఉత్స వర్లకు జరుగుతున్న జ్యేష్టాభిషేకాల్లో రెండవరోజు మంగళవారం సాయంత్రం ముత్యపుకవచంలో కనువిందుచేశారు. శ్రీదేవిభూదేవిసమేతుడైన మలయప్పకు ఉదయం వేదపారాయణదారులు, ఆలయ అర్చకులు మహాశాంతి హోమం, విశేష స్నపనతిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్స వమూర్తులకు ముత్యపుకవచం అలంకరింపజేశారు. సాయంత్రం సహస్రదీపాలంకారసేవలో ఊంజల్‌సేవలో వయ్యారంగా ఊరేగిన మలయప్ప ఉభయదేవేరులు ఆలయ మాఢవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ ముగ్ధమనోహరరూపాన్ని వీక్షించిన భక్తులు తన్మయత్వం చెందారు.ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ ఏవిఎస్ఒ రాజశేఖర్, ఆలయ అర్చకులు, అధికారులు, గృహస్థభక్తులు పాల్గొన్నారు.

## అమరావతి మహిళలపై సజ్జల అనుచిత వ్యాఖ్యలు.. డిజిపికి రఘురామ ఫిర్యాదు

**విజయవాడ,జూన్ 10,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని ప్రాంత మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన లేఖ రాశారు. కుల వివక్షకు సంబంధించిన పదం వాడిన సజ్జలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన దూషణలు అమరావతి లోని వేలాది మంది మనోభావాలను దెబ్బతీసాయని...ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల క్రింద కేసు నమోదు చేయాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అవమానకర భాషను ఎవరూ వాడకుండా చర్యలు తీసుకోవాలని రఘురామ కోరారు. అమరావతి మహిళలపై ఓ ఛానల్‌లో జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై నిరసన తెలుపుతున్న మహిళలను ఉద్దేశించి సజ్జల అనుచితంగా మాట్లాడారని రఘురామ ఆరోపణ.. పిశాచాలు కూడ ఇలా చేయరోమో?వారిని రాక్షసులు అని కూడ అనలేం. అందరూ కలిసి సంకరం అయినట్టుంది. ఇవన్నీ కలిపి తయారైన తెగ ఏదో ఒకటున్నట్టుందని సజ్జల మాట్లాడారని రఘురామ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

# విజయవాడ, విశాఖపట్టణాల్లో క్లీన్ ఎయిర్ జోన్ ప్రాజెక్టు

**విజయవాడ,జూన్10,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ,విశాఖపట్నంలోని కొన్ని నియోజకవర్గాల్లో క్లిన్ ఎయిర్ జోన్ ప్రాజెక్టును జూలై నెలలో అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతుంది. ఈ ప్రాజెక్టు అమలుతో శ్వాసకి ఉపశమనం పొందే అవకాశముంది. ఈ కార్యక్రమం దశలవారీగా అమలుకాబోతుంది. ప్రాథమికంగా, విజయవాడలో రమేష్ హాస్పిటల్ జంక్షన్, సిద్ధార్థ కాలేజ్ జంక్షన్, విశాఖపట్నంలో కింగ్ జార్జ్ హాస్పిటల్ పరిసరాలు ఈ పథకం లబ్ధిదారులుగా ఎంపికయ్యాయి. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో నిర్వహించిన వర్క్‌షాప్ ద్వారా ఈ దశలవారీ అమలు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ సంస్థలు, ట్రాన్స్‌పోర్ట్, పోలీస్ శాఖల అధికారులు.ప్రాజెక్ట్ సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.ఈ దశలవారీ విధానం ద్వారా ఈ ప్రాంతాల కోసం ప్రత్యేక పరిష్కారాలను రూపొందించి, నగరమంతా శుభ్రమైన గాలికి మార్గం సుగమం చేస్తుంది," అని ఏపీపీసీబీ ఛైర్మన్ పి. కృష్ణయ్య ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమం గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలనా దృష్టికోణం మేరకు, ఆరోగ్యకరమైన మరియు భవిష్యత్‌కు సిద్ధంగా ఉన్న పట్టణాల ఏర్పాటులో భాగంగా రూపుదిద్దుకుంది అన్నారు. ఈ ప్రాజెక్టుకు అమలు పరంగా మార్గనిర్దేశనం అందిస్తున్నది ముంబయిలో ఉన్న అర్థ ఇండియా సంస్థ. సాంకేతిక సహకారం లభిస్తోంది. "క్లీన్ ఎయిర్ జోన్‌లు విజయవంతంగా అమలవుతే, ప్రాదేశిక కాలుష్య మోతాదులు తగ్గి గాలి నాణ్యత మెరుగవుతుంది. గత రెండు సంవత్సరాలుగా తాము సాంకేతిక సమాచారం సేకరించడమే కాకుండా, ట్రాఫిక్, ప్రజా రవాణా మెరుగుదల, చివరి దశ అనుసంధానాలు వంటి అంశాల్లో చురుకైన పరిష్కారాలను రూపొందించాం. క్లీన్ ఎయిర్ జోన్లలో పర్యావరణ హిత కాలీబాటలు ఏర్పాటు చేయడంతోపాటు స్థలం వున్న చోట మియావాకి అడవులను రాబోయే రోజుల్లో ఏర్పాటు చేయడానికి సిద్ధమయ్యాము" అని తెలిపారు అర్థ ఇండియా సీఈఓ శ్రీమతి ప్రితికా హింగోరానీ. "జూలై నుండి ప్రారంభమయ్యే కాలుష్య నియంత్రణ చర్యల్లో అన్ని స్టేక్‌హోల్డర్లు చురుకుగా పాల్గొనడం వల్ల, ఈ జోన్‌లు విజయవంతమవుతాయని నమ్మకం ఉంది. తక్కువ ఖర్చుతో ఈ ప్రాజెక్టును దీర్ఘకాలికంగా కొనసాగించడానికి వ్యాపార సంస్థలను భాగస్వాములుగా చేయాలని కూడా ప్రయత్నిస్తున్నాం. ఈ చర్యలు విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో స్వచ్ఛమైన గాలి కోసం వేగంగా ముందుకు వేసిన పటిష్టమైన అడుగులు.

# ఇ-వాహనాలతో చెత్త సేకరించాలనే యోచనలో ప్రభుత్వం

## లక్నోలో అధికారుల బృందం అధ్యయనం

**విజయవాడ,జూన్ 10,ప్రభాతవార్త ప్రతినిధి:** పట్టణ,స్థానిక సంస్థల పరిధిలో ఉన్న ఇళ్ళ నుంచి తడి,పొడి చెత్త సేకరణకు పకడ్బందీగా ప్రణాళికను సిద్దం చేసేందుకు పురపాలక శాఖ,స్వచ్ఛాంధ్ర సంస్థ అధికారుల బృందం లఖ్‌నవూలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు అధ్యయనం చేయనుంది. ఇందులో పురపాలక శాఖ సంచాలకులు,స్వచ్ఛాంధ్ర సంస్థ ఎండీ,చీఫ్ ఇంజనీర్,చీఫ్ ఆపరేటింగ్ ఫీసర్,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కమీషనర్లు పాల్గొననున్నారు. లఖనవూలో ఈ-వాహనాల ద్వారా చెత్తను సేకరిస్తున్న తీరును పరిశీలించి,ఘన వ్యర్థాల నిర్వహణలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను తెలుసుకోనున్నారు. రాష్ట్రం లోని నగరాలు,పట్టణాల్లో చెత్త పన్ను వసూళ్ళను నిలిపి వేసిన కూటమి ప్రభుత్వం,ఈ-వాహనాలతో వ్యర్థాలను సేకరించాలని యోచిస్తోంది. అధ్యయన కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకోనుంది.

## భక్తుల పుణ్యస్నానాలతో ముగిసిన గోవిందరాజుని చక్రస్నానమహోత్సవం

**తిరుపతి, జూన్ 10ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో అంగ రంగ వైభవంగా జరిగిన వార్షిక బ్రహ్మో త్సవాలు మంగళవారం ఉదయం చక్ర స్నాన మహోత్సవంతో ముగిశాయి. ఉదయం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత ఉత్సవమూర్తులను, చక్రత్తాళ్వార్‌ను ఆలయం నుండి కపిలతీర్థంలో ఉన్న పవిత్ర పుష్కరిణి వద్దకు మంగళ వాయిద్యాల నడుమవేంచేపుచేశారు. ఆళ్వార్‌తీర్థంలో ఉదయం 8గంటల నుండి 9.30గంటల మధ్య చక్రధారుడి



చక్రస్నాన మహోత్సవం వైభవంగా ముగిసింది. విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించారు. సుదర్శన చక్రత్తాళ్వారుకు స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో ముందుగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ,ముఖప్రక్షాళన, దూపదీపనైవేద్యం,రాజోపచారం నిర్వహించారు. అర్ఘ్యపాదనివేదనలో భాగంగా పాలు,తేనె, కొబ్బరినీళ్ళు ,పసుపు,గంధంతో స్నపనం నిర్వహించారు. అభిషేకానంతరం వివిధ పాశురాలనుపెద్దజియ ్యర్‌స్వామి, చిన్నజియ్యర్‌స్వామి పఠించారు. చక్రస్నానసమయంలో అర్చకులు కర్పూరహారతులిచ్చారు.ఈ కార్యక్రమంలో టిటిడి ఎప్ఎసిఎఒ బాలాజీ, ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ మునికృష్ణారెడ్డి,అర్చకులు,భక్తులు పాల్గొన్నారు.

## ప్రతి సామాజికవర్గం ఎదుగుదల సాధించాలన్నదే వికసిత్ భారత్ లక్ష్యం

### - ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి

**విజయవాడ,జూన్10,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్డీఏ కూటమికి ప్రజలు మంచి విజయాన్ని అందించారని బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతదేశానికి సుపరిపాలన, ధృడమైన నాయకత్వంతో మంచి పాలన అందిస్తున్నారని ఉద్ఘాటించారు. వికసిత్ భారత్ కేవలం అభివృద్ధి చెందిన భారత దేశమే కాదు ప్రతి సామాజికవర్గం ఎదుగుదల సాధించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు పురందేశ్వరి.మంగళవారం విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో పురందేశ్వరి మీడియాతో మాట్లాడారు. మోదీ నాయకత్వంలో దేశాన్ని పాలించగల సత్తా ఉందని ప్రజలు భావించి బీజేపీకి భారీ విజయాన్ని అందించారని చెప్పారు. సబ్ కా వికాస్, సబ్ కా ప్రయాస్, సబ్ కా విశ్వాస్‌తో అన్ని లక్ష్యాలని ఛేదించాలనే ఉద్దేశంతో మోదీ పాలన కొనసాగిస్తున్నారని వివరించారు. దేశంలో అవినీతి రహిత పాలన ఉండాలని ప్రజలు భావించి బీజేపీని గెలిపిస్తున్నారని పురందేశ్వరి అన్నారు. ఆంధ్రరాష్ట్రంలో గత జగన్ ప్రభుత్వం రాక్షస పాలనతో ప్రజలని ఇబ్బందులకి గురి చేశారని పురందేశ్వరి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏపీలో అధికారంలోకి వచ్చాక అభివృద్ధి దిశలో పాలన కొనసాగుతోందని అన్నారు.

## తిరుమల శిలాతోరణం వద్ద మంటలు

### - అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది

**తిరుమల,జూన్ 10ప్రభాత వార్తప్రతి నిధి:** శేషాచలం అటవీప్రాంతంలో తిరు మలకు సమీపంలోని శిలా తోరణం, శ్రీవారిపాదాలకెళ్ళే మార్గం లో కొండల్లో మంగళవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. వెంటనే అప్రమత్తమైన అటవీశాఖ, అగ్నిమాపకశాఖ, విజిలెన్స్ సిబ్బంది రెండు అగ్నిమాపక వాహనాలతో మంటలను అదుపుచేశారు. ఉన్నఫళంగా జరిగిన ఈ



అగ్నిప్రమాదంతో ఆ మార్గంలో ఉన్న శ్రీవారి భక్తులు ఉలిక్కిపడ్డారు. సుమారు వందమీటర్ల వరకు పచ్చనిఅటవీప్రాంతం అగ్నికి ఆహుతైంది. అగ్నికీలలు చెలరేగడంతో భక్తులు భయంతో పరుగులుతీశారు. ఈ ప్రమాదానికి కారణాలు తెలియడంలేదు. ఎవరైనా సిగరెట్ వెలిగించి అలా వేసేశారా లేక నిప్పుపెట్టారా అనేది విజిలెన్స్ విభాగం విచారణ చేస్తోంది.

# మైనర్ బాలికపై అత్యాచారం కేసులో మరో ఏడుగురు నిందితులు రిమాండ్‌కు తరలింపు: ఎస్పీ వి. రత్న




వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ వి.రత్న

**పుట్టపర్తి, జూన్ 10 , ప్రభాతవార్త** రామగిరి మండలం, ఏడుగుర్రాలపల్లి పల్లి లో మైనర్ బాలిక పై జరిగిన అత్యాచారం కేసులో మరో ఏడు మంది నిందితులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ విరత్న తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ధర్మవరం డిఎస్పి హేమంత్ కుమార్ తో కలిసి వివరాలను తెలియజేశారు. సత్య సాయి జిల్లా, రామగిరి మండలం, ఏడుగుర్రాలపల్లి గ్రామంలో మైనర్ బాలిక పై జరిగిన అత్యాచారం కేసులో నిందితులను ధర్మవరం సబ్ డివిసనల్ పోలీస్ అధికారి అయిన బి.హేమంత్ కుమార్ అరెస్టు చేయడం జరిగిందన్నారు. నిందితుల వివరాలను తెలియజేస్తూ రామగిరి మండలం ఏడుగురాళ్లపల్లి గ్రామానికి చెందిన బి. నాగరాజు కుమారుడు బుడిద రాజేష్, టి ముత్యాలన్న కుమారుడు తుము హేమంత్, సి బి నారాయణ కుమారుడు చిన్న బాసి కార్తిక్, బి సల్లప్ప కుమారుడు బాసి సోనప్ప, బి నాగరాజు కుమారుడు బూడిద రాజేంద్ర, కనగానపల్లి మండలం తల్లిమడుగుల గ్రామానికి చెందిన ముత్యాలప్ప కుమారుడు అంకె ముక్తానంద అలియాస్ జుక్కు, నాతోపాటు ఏడవ నిందితుడు మైనర్ గా తెలియజేశారు. సత్య సాయి జిల్లాలో 15 ఏళ్ల బాలికపై ఈ ఏడుగురు వ్యక్తులు సంయుక్తంగా శారీరక దాడులు చేసి అత్యాచారం చేసిన ఘటనలో మైనర్ బాలిక ఫిర్యాదు మేరకు రామగిరి పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నెంబర్.21/2025 అండర్ సెక్షన్ 115(2), 351(2), 96, 87, 77, 238, 308(5), 65 ఆర్/డబ్ల్యూ 3(5) బి ఎం ఎస్ యాక్ట్, సెక్షన్5, 5(జె)(), 5() ఆర్/డబ్ల్యూ 6 ఫోక్సో యాక్ట్-2012 మరియు సెక్షన్.3(1)(డబ్ల్యూ)(), సెక్షన్.3(2)(వి) ఎస్సీ/ఎస్టీ (పి ఓ ఏ) యాక్ట్ క్రింద-2015 మరియు సెక్షన్.66ఇ, 67, 67ఏ ఐటీ యాక్ట్2000 కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం జరిగిందన్నారు. ఈ కేసులో పోలీసులు కఠిన చర్యలు తీసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలియజేశారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు సమగ్ర దర్యాప్తు చేసి, ఇది వరకే కొంతమంది ముద్దాయిలను అరెస్టు చేయడం జరిగిందని, మళ్ళీ ఈ రోజు పై ముద్దాయిలను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి, పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ధర్మవరం డిఎస్పి పర్యవేక్షణలో రామగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ వి. శ్రీధర్ నేతృత్వంలోప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఈ బృందాలు గాలింపు చర్యలు చేపట్టి , నిందితులను గుర్తించి, అరెస్టు చేయడం జరిగిందన్నారు. మిగిలిన ముద్దాయిల అరెస్టు కోసం పలు బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్నాయని, త్వరలోనే వారిని కూడా అరెస్టు చేయడం జరుగుతుందన్నారు.ఈ విలేకరుల సమావేశంలో ఎస్పీతో పాటు ధర్మవరం డిఎస్పి హేమంత్ కుమార్, ఎస్బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, రామగిరి సిఐ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

## 16నుండి టిటిడి పాఠశాలల్లో 'సద్గమయ'

**తిరుమల,జూన్ 10ప్రభాత వార్తప్రతి నిధి:** టిటిడి విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకు దైవభక్తి, నైతిక విలువలు, నిజాయితీ, క్రమశిక్షణ, సమాజంపట్ల బాధ్య తలు ఇతర అంశాలపై అవగాహన కల్పించేందుకు "సద్ గమయ" కార్యక్రమం చేపడుతున్నారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 16వతేదీ ఉండి 19వరకు నాలుగురోజులు టిటిడికి చెందిన 7 పాఠశాల్లో టిటిడి విద్యార్థులకు నిర్వహించనున్నారు. భగవద్గీత సారాంశాన్ని పిల్లలకు అర్థమయ్యేలా, సరళమైన పదజాలంతో బోధించాలని టిటిడి ఇఒ శ్యామలరావు సూచించారు. శ్రీవారి వైభవాన్ని యువత,పిల్లలకు మరింతగా తెలి సేలా శిక్షణ ఉండా లన్నారుప్రపంచధార్మికసంస్థ తిరు మల తిరుపతిదేవస్థానం సామాన్య భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో బాటు సనాతన ధర్మం విలువలను పిల్లలో అలవాటు చేసినట్లు అయితే తమ జీవనాన్ని నేర్పితే ఫలితాలు ఉంటాయన్నారు.


**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

**అమ్మకము కొరకు ముందస్తు ప్రకటన**

**SARFAESI చట్టం 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ 8(6) ప్రకారం జారీ చేయడమైనది.**

టు, ఋణగ్రహీత : శ్రీమతి కూచిమంచి నాగ దుర్గా శిరీష, భర్త : శ్రీ శ్రీనివాస సుబ్రహ్మణ్యం, 3వ లైన్, డి నెం.59A-18-15, ఫన్ టైమ్స్ క్లబ్ దగ్గర, టీచర్స్ కాలనీ, విజయవాడ-520 008, కృష్ణా జిల్లా. మరొక చిరునామా : శ్రీమతి కూచిమంచి నాగ దుర్గా శిరీష, భర్త : శ్రీనివాస సుబ్రహ్మణ్యం, ఇంటి నెం.60-6-7, 3వ లేన్, సిద్ధార్థనగర్, మొగలిరాజపురం, విజయవాడ-520 008. మరొక చిరునామా : శ్రీమతి కూచిమంచి నాగ దుర్గా శిరీష, భర్త : శ్రీనివాస సుబ్రహ్మణ్యం, ఫ్లాట్ నెం.22, NSR నగర్, 5వ రోడ్డు, పంట కాలువ దగ్గర, విజయవాడ.

సార్ / మేడమ్

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (2002 యొక్క 54) లోని సెక్షన్ 13(2) దీనితో చదువుకోవలసిన సదరు రూల్స్‌లోని రూల్ 3 ప్రకారం ఋణగ్రహీతలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి తేది.02.01.2020 న జారీచేసిన డిమాండ్ నోటీసులో తెలిపిన విధంగా తేది.02.01.2020 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం రూ.29,50,489/- (అక్షరాల ఇరవై తొమ్మిది లక్షల యాభై వేల నాలుగు వందల ఎనభై తొమ్మిది రూపాయలు మాత్రమే) + కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు వసూలు నిమిత్తం పైన తెలిపినట్లు 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తెలియజేయడమైనది.

మీరు మొత్తం ఋణాలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సదరు ఆస్తులను సెక్షన్ 13(4) దీనితో సదరు రూల్స్‌లోని రూలు 8(1) ప్రకారం అధీకృత అధికారి సదరు తనఖా ఆస్తిని తేది. 10.03.2020 న స్వాధీనం చేసుకున్నారు. సదరు స్వాధీనత నోటీసును తేది.13.03.2020 న సాక్షి (తెలుగు) మరియు హాన్స్ ఇండియా (ఇంగ్లీష్) స్థానిక దినపత్రికలలో రూలు 8(2) ప్రకారము ప్రచురించడమైనది.

తేది. 02.01.2020 నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తమును ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా చెల్లించవలెను. లేని యెడల తనఖా ఉంచిన దిగువ తెలిపిన ఆస్తులు విక్రయించుటకు బహిరంగ వేలం కొరకు టెండర్లు / కొటేషన్లు సాధారణ ప్రజానీకం వద్ద నుండి ఆహ్వానించబడును.

**స్థిరాస్తి వివరములు:**

పశ్చిమ గోదావరి జిల్లా, వట్లూరు ఎస్ఆర్ఓ, పెదవేగి మండలం, దుగ్గిరాల గ్రామం మరియు పంచాయితీ వద్ద ఆర్ ఎస్ నెంలు.427/4, 429/1 మరియు 429/7 నందు మొత్తం విస్తీర్ణం 464.05 చ॥గ॥లులోని (250.25 చ॥గ॥లు + 151.60 చ॥గ॥లు + 62.20 చ॥గ॥లు) ఖాళీ రెసిడెన్షియల్ ప్లాట్ నెంలు.VIP-2, 5, 6 శ్రీమతి కూచిమంచి నాగ దుర్గ శిరీష, భర్త : శ్రీ శ్రీనివాస సుబ్రహ్మణ్యం గారికి చెందినది (రిజిష్టర్డ్ డాక్యుమెంట్ నెం.3143/2016, తేది.27.09.2016 ప్రకారం). ఫ్లాట్ నెం.VIP-2 నందు 250.25 చ॥గ॥కు హద్దులు: తూర్పు: ఫ్లాట్ నెం.VIP-3 లోని స్థలం, దక్షిణం: రోడ్డు, పడమర : రోడ్డు, ఉత్తరం : ఫ్లాట్ నెం.VIP-1 లోని స్థలం. ఫ్లాట్ నెం.5 నందు 151.60 చ॥గ॥కు హద్దులు : తూర్పు: ఫ్లాట్ నెం.6 లోని దిగువ చెప్పబడిన 3వ ఐటమ్, దక్షిణం : హక్కుదారునిచే వదిలిన స్థలం, పడమర : రోడ్డు, ఉత్తరం: రోడ్డు. ఫ్లాట్ నెం.6 నందు 62.20 చ॥గ॥కు హద్దులు: తూర్పు: హక్కుదారునిచే వదిలిన స్థలం, దక్షిణం: హక్కుదారునిచే వదిలిన స్థలం, పడమర : ఫ్లాట్ నెం.5 లోని పైన చెప్పబడిన 2వ ఐటమ్, ఉత్తరం: రోడ్డు. పై 1 నుండి 3 ప్లాట్లు కలిపి మొత్తం విస్తీర్ణం 464.15 చ॥గ॥లులోని ఖాళీ రెసిడెన్షియల్ స్థలం

తేది : 06.06.2025
ప్రదేశం : విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా


# మహిళలను సంకర జాతి అంటారా?

## - సజ్జలకు సమాజంతో తిరిగే హక్కు లేదు : మంత్రి సంధ్యారాణి

**సచివాలయం,జూన్ 10,ప్రభాతవార్త :** మహిళలను ఉద్దేశించి సాక్షి టీవి డిబేట్‌లో ఒక జర్నలిస్టు,మరో విశ్లేషకుడు వ్యవహరించిన తీరు చాలా దుర్మార్గం. ఆడపడుచులను కించపరిచేలా మాట్లాడిన వ్యక్తిని సూ ్టడియోలోనే తన్ని చొక్కా పట్టుకొని బయటకు లాగి పోలీసులకు అప్పగించాలి ్సందిపోయి జగన్ వెనకేసుకు రావడం దారుణం.సీరియస్‌గా రియాక్ట్ కావల్సిన కొమ్మినేని శ్రీనివాసరావు వ్యంగ్యంగా నవ్వుతాడు.ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా పనిచేసిన కొమ్మినేని ప్రవర్తన హేయమైన చర్య కొమ్మినేనిని అరెస్టు చేయడం తప్పు,గవర్నమెంట్ పొరపాటు చేసిందని జగన్‌రెడ్డి వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉంది.అక్కా చెల్లెళ్ళ ఓట్లతో ఐదేళ్ళు సిఎం పదవి వెలగబెట్టి ఇప్పుడు దారుణంగా ప్రవర్తిసా ్తరా?? అవమానిస్తారా? వైసీపీకి వచ్చిన 40 శాతం ఓట్లలో మహిళలవి లేవా? అమరావతి ఆడపడుచుల్లో ఒక్కరు కూడా వైసీపీకి ఓటు వేయలేదని భావిస్తునా ్నరా? సజ్జల రామకృష్ణారెడ్డి సంకరజాతి అని వ్యాఖ్యానించడం మరింత దురదృష్టకరం. తల్లులు,అక్కాచెల్లెళ్ళ గురించి ఇంత హీనంగా మాట్లాడటానికి వైసీపీ నేతలకు మనస్సు ఎలా వస్తుందో?? సీఎంగా కెబినెట్ ర్యాంకులో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా,ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా పనిచేసిన వ్యక్తులు ఇలా ప్రవరి ్తంచడం బాధాకరం.నేను ఒక టిడిపి ప్రజాప్రతినిధిగా ఈ అభిప్రాయాలు వ్యక్తం చేయడం లేదు.ఒక మహిళగా బాధ్యతతో,బాధపడుతూ స్పందిస్తున్నాను. వైసీపీనాయకుల తీరు చాలా హీనం.. సహించరాని విషయం.. సమాజంలో చేయకూడని తప్పులు చేసేశారు. మనుషులుగా మారు తున్నారో.. మృగాలుగా వ్యవహరి స్తున్నారో అర్థం కావడం లేదు.వైసీపీ నేతల తీరును నేను తీవ్రంగా ఖండిస్తున్నాను.వైసీపీని,సాక్షి మీడియాను మూసేసే రోజులు దగ్గర పడ్డాయి.వైసీపీని ప్రజలు 11సీట్లకు పరిమితం చేసి చీకట్లోకి తొక్కినా ఆ పార్టీ నేతల తీరు మారలేదు. వైసీపీ నాయకులకు మహిళలంటే మొదటి నుంచి చిన్నచూపే, మహిళల్ని వైసీపీ నాయకులు కించపర్చేలా మాట్లాడుతుంటే నాడు సాక్షాత్తు ముఖ్యమంత్రి హోదాలో ఉన్న జగన్ ఖండించకపోగా సమర్థించారు. ఇప్పుడు మీడియాలో మహిళల ఆత్మగౌరవం దెబ్బతినేలా వ్యాఖ్యాలు చేసిన వారిని వెనకేసుకొస్తారా? నాడు అమరావతితో పెట్టుకునే వైసీపీ అధ:పాతాళానికి వెళ్లిపోయింది.

# జర్మన్ భాషతో అంతర్జాతీయ అవకాశాలు

### - రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ, సిఇఒ గణేష్‌కుమార్

**విజయవాడ జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** జర్మన్ భాష నేర్చుకుంటే అంతర్జాతీయ ఉద్యోగావకాశాలు లభిస్తాయని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ, సీఈఓ గణేష్‌కుమార్ తెలిపారు. జర్మనీలో ఐటీఐ విద్యార్థులకు ఉద్యోగావకాశాలను కల్పించడానికి ఆన్‌లైన్ గ్లోబల్ నైపుణ్య కార్యక్రమాన్ని నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రాజెక్టు సర్వేసేతు సంయుక్తంగా ప్రారంభించాయి. 14 ఐటీఐ కళాశాలల నుంచి 240 మందికి పైగా విద్యార్థులకు మొదటివిడతలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రారంభదశలో భాష నేర్చుకోవడంలో కొన్ని సవాళ్లు ఎదురవాతయని వాటిని అ ది ్గ వి ం చా ల ని సూచించారు. విద్యార్థులకు జర్మనీ తెలుగు నిపుణులసహాయం లభిస్తుందని తెలిపారు. అనంతరం ప్రాజెక్టు సర్వసేతు వ్యవస్థాపకులు రాహుల్‌కుమార్ మాట్లాడుతూ భారత సాంకేతిక నైపుణ్యాలను గ్లోబల్ స్థాయికి చేర్చేందుకు ఈ భాగస్వామ్యం ఒక మైలురాయి అని తెలిపారు.

వార్త

సంబంధి కాకపోయినప్పటికీ ఎవడు మిత్ర భావంతో మసలుతున్నాడో అతడే బంధువు, అతడే మిత్రుడు, అతడే గతి, అతడే ఆశ్రయం.

-గ్లిబ్బర్

# సయోధ్యకు మసక!

అగ్రరాజ్యాధిపతి ట్రంప్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌ల మధ్య రానురాను దూరం పెరిగిపోతోంది. ఆది నుంచి ట్రంప్ తీసుకున్న వివాదాస్పద నిర్ణయాల విషయాల్లో మస్క్‌కు భిన్నాభిప్రాయాలున్నాయని అంతా అనుకునేవారు. కానీ ఆ నేపథ్యంలోనే మస్క్‌ను కట్టడి చేయాలనే ఉద్దేశ్యంతో ట్రంప్ వ్యూహాత్మకంగా తీసుకొచ్చిన 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్' వారిద్దరి మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రధాన కారణంగా విశ్లేషించుకోవచ్చు. తన వ్యాపార సామ్రాజ్యాన్ని భారత దేశానికి విస్తరించే క్రమంలో కూడా ఎందుకో మస్క్ ప్రయత్నాల పట్ల ట్రంప్ విముఖంగా ఉండేవారనే విషయం ఇప్పుడిప్పుడే అర్థమౌతోంది. మస్క్‌పై ఆధిపత్యం సాధించే క్రమంలో 'రాయితీల్లేకుండా విద్యుత్ వాహనాల బిల్' ప్రవేశ పెట్టారు. అదే మస్క్ తీవ్ర అసహనానికి గురవడానికి కారణమైంది. మొన్నటి అమెరికా ఎన్నికల్లో వారిద్దరిదీ విడదీయరాని బంధం. అలాంటిది ప్రస్తుతం వారిద్దరి మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు అంతర్జాతీయ సమాజం లో చర్చనీయాంశాలు అవుతున్నాయి. కానీ వారిద్దరి మధ్య సయోధ్య ఇక గాలిలోని దీపమే. తొలుత డిపార్ట్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిసి యన్సీ( డోజ్) నుంచి తప్పించినందుకే మస్క్‌కు తనపై ఆగ్రహమని స్వయంగా ట్రంపే చెప్పారు. దానిపైనే చర్చోపచర్చలు సాగుతున్నాయి. వేలాదిమంది ఉద్యోగుల తొలగింపు ద్వారా ట్రెజరీకి నిధులనుమిగులుస్తున్నానని, అలాగే లక్షల కోట్ల విదేశీ నిధులను నిలిపి వేస్తూ ఆర్థిక శాఖను పరిపుష్టం చేస్తున్నట్లు మస్క్ ఫీలవుతున్నారు. వారి మిత్రభేధానికి బయట వారెవరూ కారణం కాదనేది సుస్పష్టం. విధానాల్లో వేర్వేరు ఆలోచనలే వారిని దూరం చేస్తున్నట్లు విశదమౌతోంది. రిపబ్లికన్ లైతే ఇద్దరూ కలిసి పనిచేయడంవల్ల అమెరికాకు మంచిదని కోరుకుంటున్నారు. డెమోక్రటిక్‌లకు నిధులిస్తే తమ బంధానికి తుది ఘడియలు సమీపించినట్లేనన్న ధోరణితో ట్రంప్ ప్రవర్తిస్తున్నారు. తాను ప్రతిపాదించిన బిల్లును వ్యతిరేకించే డెమోక్రటిక్ సభ్యులకు ఏమాత్రం ఆర్థిక సహకారం అందించినా తీవ్ర పరిణామాలుంటాయని ట్రంప్ హెచ్చరించారు. ఇదిలాఉండగా ట్రంప్ విధానాలన్నీ తిరోగమనానికి దారి తీస్తాయని మస్క్ విమర్శించడం వారి మధ్యదూరం తగ్గకపోవడానికి మరో బలమైన కారణం. ప్రతిపాదిత బిల్లులో విద్యుత్ వాహనాల రాయితీలు ఎత్తివేత ప్రధానాంశం. దీనివల్ల తొలుత ఇబ్బంది పడేది మస్క్ సంస్థ 'టెస్లా'యే. విద్యుత్ వాహనాలపై రాయితీలు తగ్గించడమే కాకుండా ప్రభుత్వ వ్యయంలో కొత్త విధిస్తూ ట్రంప్ ఏకపక్షంగా బిల్లు తెచ్చారన్నది మస్క్ వాదన. గత ఎన్నికల ప్రచారంలో తాను ఆర్థికంగా, నైతికంగా మద్దతు ఇచ్చానని అందుకు మూడు వందల మిలియన్ల డాలర్లు కుమ్మరించానని మస్క్ మండిపడ్డారు. ప్రపంచ స్థాయిలో ట్రంప్, మస్క్ లిద్దరూ ఘటికులే, ఘనాపాఠీలే, రాజకీయాలను బాగా ఔపోసన పట్టినవారే, బహుముఖ ప్రజ్ఞావంతులే. ఎప్పుడో అప్పుడు వీరిద్దరి స్నేహానికి బీట్లు పడతాయని అనుకుంటున్నదే. కానీ కేవలం ఏడాదిలోనే అవి బదాబదలౌతాయనిఎవరూ ఊహించలేదు. ట్రంప్ నిర్ణయాల వల్ల మస్క్ వ్యాపారాల తోపాటు షేర్ మార్కెట్ దారుణంగా పతనమై భారీ నష్టాలు వచ్చాయి. 14శాతం మేర టెస్లా షేర్లు పడిపోయాయి. దీంతో 153 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో 13 లక్షల కోట్లు)కు పైగా నష్టం వాటిల్లింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ 1 ట్రిలియన్ డాలర్ల మార్కు కంటే దిగువకు పడిపోయి, 916 బిలియన్ డాలర్ల వద్ద ముగిసింది. టెస్లా సంపద ఒక్కరోజులోనే ఇంతటి స్థాయిలో తరిగిపోవడం సంస్థచరిత్రలోనే ఇదే తొలిసారి కావడం గమనార్హం. ట్రంప్ విధానాలు ఇలానే కొనసాగిస్తే అమెరికా దివాలా తీస్తుందని, ట్రంప్‌ను గద్దె దించాలనే వరకు మస్క్ వెళ్లాడు. ట్రంప్ కూడా ఏ మాత్రం తగ్గకుండా మస్క్ వ్యాపారాలపై ఆంక్షలు విధిస్తున్నాడు. వీరి మధ్య వైరం ఆ దేశ అంతరిక్ష ప్రాజెక్టుల భవిష్యత్తునే ప్రశ్నార్థకం చేస్తోంది. ప్రస్తుతం స్పేస్‌ఎక్స్‌కు నాసా, అమెరికా రక్షణ విభాగం నుంచి సుమారు 22 బిలియన్ల విలువైన కాంట్రాక్టులు ఉన్నాయి. మస్క్ సమాఖ్య ఒప్పందాలను రద్దు చేస్తామని ట్రంప్ బహిరంగంగా బెదిరించడంతో అంతరిక్ష సమాజం ఉలిక్కిపడింది. ఇది అమెరికా అంతరిక్ష ప్రోగ్రాంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. అమెరికాకు చెందిన కీలకమైన డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ సేవలను నిలిపివేస్తామని మస్క్ సంచలన ప్రకటన చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి అమెరికా నుంచి వ్యోమగాములను, సరుకులను తీసుకెళ్లే ఏకైక వ్యోమనౌక డ్రాగన్ క్యాప్సూల్. ట్రంప్‌ఎప్స్టీన్ వీడియో బయటకు వస్తోందంటూ మస్క్ చెప్పడం కూడా ట్రంప్ జీర్ణించు కోలేకపోతున్నారు. దీనివల్ల ఇక వారి మధ్య స్నేహం చిగురించే పరిస్థితి లేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై లైంగిక కేసులున్న నేపథ్యంలో ఆయన్ను అభిశంసించాలని, ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ అతని స్థానంలో నియమించాలని ఎలాన్ మస్క్ ప్రకటించారు. ట్రంప్ను అభిశంసించాలన్న డిమాండ్ని మస్క్ ఎత్తుకోవడం అమెరికాలో సంచలనంగా మారింది. తాజాగా ది అమెరికా పార్టీ అంటూ మస్క్ జేసిన పోస్ట్‌కు 80.4 శాతం మంది దానికి అనుకూలమని మస్క్ వ్యాఖ్యానించడంతో ట్రంప్ కు చిర్రెత్తుకొచ్చింది. ఈ సందర్భంగానే ట్రంప్ అభిశంసనకు మద్దతు ఇస్తానంటూ తొలుత పోస్ట్ పెట్టిన మస్క్ ఆ వెంటనే ఉపసంహరించుకున్నారు. ఇవన్నీ వారి మధ్య సఖ్యత కుదరని, తీసుకురాలేని అంశాలు. ప్రస్తుతం వీరి మధ్యనున్న వైరుధ్యాలు అమెరికాకే పరిమితమైతే పర్లేదు. కానీ భారత దేశం మీద ప్రభావం పడితే మనకూ ఇబ్బందే!

మాట్లాడటానికి ముందు శ్రద్ధగా వినాలి. రాయడానికి ముందు బాగా ఆలోచించాలి.



ప్లినీ

విజయం వల్ల లాభాలు ఆశించేవారు ఆ విజయాన్ని పొందేందుకు తిప్పలు పడక తప్పదు.



డబ్ల్యు. ఎమర్సన్

# ప్రజావాక్కు



### కుటుంబ వ్యవస్థను పరిరక్షించాలి

ఈ మధ్యకాలంలో మన దేశంలో విడాకుల సంఖ్య గణనీయంగా పెరిగిపోతున్నదనే విషయం గమనార్హం. పురాతన కాలంలో "వివాహం ఒక శాశ్వత బంధం" అన్న భావన గట్టి స్థితిలో ఉండేది. కానీ ఆధునిక జీవనశైలి, స్వాతంత్ర్య అభిమానం, ఆర్థిక స్వావలంబన, భావోద్వేగాలపై నియంత్రణ లోపం వంటి కారణాల వల్ల దంపతుల మధ్య మనస్పర్థలు, అపార్థాలు పెరుగుతున్నాయి. దీని ఫలితంగా విడాకులు సాధారణం అయ్యాయి. ఇటీవల యువత ఎక్కువగా స్వతంత్రంగా బతకాలని కోరుకుంటున్నారు. వారు సంబంధాల్లో సమానత్వాన్ని, గౌరవాన్ని కోరుతున్నారు – ఇది చాలా హేతుబద్ధమైన కోరిక. కానీ ప్రతిఒక్కరూ తమ బాధ్యతలను నెరవేర్చాల్సిన అవసరం ఉంది. చిన్నచిన్న విభేదాలు పెద్దసమస్యలుగా మారడం, పెద్దలను మర్చిపోయి అసహనం చూపడం వంటి వ్యవహారాలు సంబంధాలను కలుషితంచేస్తున్నాయి. కుటుంబ వ్యవస్థ మన సంస్కృతికి మూలస్థంభం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### వికలాంగులకు రాత్రిపూట డ్యూటీలు వద్దు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల విద్యాభివృద్ధికి చాలా కృషిచేస్తుంది. ఇటీవల కాలంలో లెక్చరర్ ఉపాధ్యాయుల 9210పోస్టులను భర్తీచేసింది. అందులో వికలాంగులకు నైట్ స్టడీ విధుల నుండి 2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం మినహాయింపు ఇవ్వాలి. శారీరక వికలాంగులు దృష్టిలోపం వికలాంగులు నైట్ స్టడీ వలన చాలా ఇబ్బందులు పడుతున్నారు. పొద్దంతా డే డ్యూటీలు చేసి రాత్రిపూట నైట్ స్టడీ చేయడం ఇబ్బందికరంగా ఉంటుంది. డ్యూటీలు ముగిసిన తర్వాత రాత్రిపూట ఇండ్లకు చేరడం చాలా కష్టమవుతుంది.

- రాపాక రవీందం, జనగాం

### డబ్బుకు లోకం దాసోహం

డబ్బు లేనిదే ఏ పని సాధ్యం కాదంటే అతిశయోక్తికాదు. ఇప్పుడు మాటకన్నా డబ్బుకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. సమాజంలో పలుకుబడి రావాలంటే తప్పకుండా నాలుగు అక్షరముక్కలు నేర్చుకోవాలి. శ్రమ, పట్టుదలతో తమకు తోచిన రంగంలో రాణిస్తే కీర్తి ప్రతిష్టలు వెతుక్కుంటూ వస్తాయనడంలో సందేహం లేదు.

- ఆర్. వెంకటేష్ చరన్, బెంగళూరు

### అత్యంత అవమానకరమైన వ్యాఖ్య

'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాహ' అనికదా వేదవాక్కు. ఆంధ్రలో తెలుగుదేశం ప్రభుత్వానికి వ్యతిరేకులుగా భావిస్తున్నజర్నలిస్టులు ఆరాష్ట్ర రాజధాని అయిన అమరావతిని వేశ్యా వాటికతో పోల్చారు. ఇది అత్యంత అవమానకరమైన వ్యాఖ్య. అమరావతి బౌద్ధఆరామం. పవిత్రమైన నేల. ఇటువంటి హేయమైన కామెంట్లు చేసిన వారికేమి శిక్ష వేయాలి? ఆంధ్ర ప్రభుత్వం నేరస్తుల మీద సరైన చర్యలు తీసుకోవడం లేదని పార్టీ ప్రముఖులు, గత ప్రభుత్వం వలన అనేక విధాలుగా కష్టపడ్డ నష్టపడ్డ ప్రజలు వాపోతున్నారు. ఇలా ఎంతకాలం? అప్పుడే ఏడాది గడచి పోయింది. ఘోరంగా ఓడిపోయిన పార్టీ ప్రజలలోబలాన్ని పుంజుకోవడానికిచేయని ప్రయత్నమేదీ లేదు. అంత ఫాస్టుగా నాయుడి గారి ఉమ్మడి ప్రభుత్వం కనిపించడం లేదు. ఇలాగే కాలం వెళ్ళబుచ్చితే నాలుగేళ్ల తరువాత రాబోయే ఎన్నికల్లో ప్రజల మనసులు మారితే రాజకీయం కూడా మారవచ్చు. తస్మాత్ జాగ్రత్త.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### పిల్లలపై డిజిటల్ దుష్ప్రభావం

ఇప్పటి డిజిటల్‌యుగంలో మొబైల్స్, ట్యాబ్‌లు, టీవీలు వంటి గ్యాడ్జెట్ల వాడకం పిల్లల జీవితంలో భాగమైపోయింది. అయితే దీనివల్ల వారిఆరోగ్యంపై, చదువుపై, ప్రవర్తనపై అనేక దుష్ప్రభావాలు కనిపిస్తున్నాయి. ఎక్కువ సమయం స్క్రీన్ ముందు గడపడం ద్వారా కంటిచూపు సమస్యలు, శారీరక జడత్వం పెరుగుతోంది. ఆన్‌లైన్ గేమ్స్, యూట్యూబ్ వీడియో లు వంటి వినోదాల వల్ల చదువుపై ఏకాగ్రత తగ్గుతోంది. అలాగే, సోషల్ మీడియా వల్ల పిల్లల్లో అసహనం, ఒత్తిడి ఏర్పడుతోంది ఆత్మ విశ్వాసం తగ్గుతుంది కొన్నిసార్లు. డిజిటల్ ప్రపంచానికి పరిమితి ఉండాలి, తల్లిదండ్రులు గమనించాలి, పిల్లలకు సమయ పాలన, నైతిక విలువలు నేర్పాలి. అప్పుడే ఈ టెక్నాలజీ వారి అభివృద్ధికి తోడ్పడుతుంది.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### బస్సు చార్జీలు తగ్గించాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆకస్మాత్తుగా ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచడం జరిగింది. దీంతో సామాన్య ప్రజానీకానికి ఆర్థిక భారం అవుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని వెంటనే పెంచిన బస్సు చార్జీలు తగ్గించాలి. అదే విధంగా బస్సుల సంఖ్య పెంచాలి. అలాగేరాష్ట్రంలో మారుమూల ప్రాంతాలకు బస్సు సౌకర్యము కల్పించాలి.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రభుత్వ బడులకు పునర్వైభవం లేదా?

**ప్రైవేట్ పాఠశాలలతో పోటీపడి నేడు ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టినా దానిప్రభావం అంతగాలేదు. విద్యార్థులకు బిల్డింగులు లాంటి మౌలికవసతులు, అనేక సౌకర్యాలు సమకూర్చినా తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలను వదిలిపెట్టి ప్రైవేటు పాఠశాలలో చేర్పించడానికి సుముఖత చూపడం దేనికి సంకేతం? తమ పిల్లలబంగారు భవిష్యత్తు కోసం కష్టార్జితమైన లక్షలరూపాయలు ప్రైవేట్ పాఠశాలలకు ధారపోయడానికైనా తల్లిదండ్రులు సిద్ధపడుతున్నారు. ఇది ప్రభుత్వ పాఠశాలల చేతగానితనమా లేక ప్రైవేట్ పాఠశాలలు చురుకుగా పనిచేసి అడ్మిషన్లు పొందుతున్నాయా? దీనిపై ఒక సమగ్రమైన అధ్యయనం జరగాలి. అసర్ గణాంకాలు మన వ్యవస్థలోని డొల్లతనాన్ని బహిర్గతపరిచాయి. ఇకనైనా మేలుకోకపోతే ప్రభుత్వ పాఠశాలలు ఒకప్పటి మాటగా చెప్పుకోవాల్సిన రోజులు వస్తాయి. ప్రభుత్వ పాఠశాలలను పునరుజ్జీవింప జేయాలి. వాటికి ప్రాణం పోసి నిలబెట్టాలి.**

శ్రీశ్రీ కుమార్

దేశాభివృద్ధిలో మానవ వనరుల పాత్ర ఎనలేనిది విద్యను మానవ వనరుగా నాటి ప్రభుత్వం గుర్తించి విద్యా శాఖను మానవ వనరుల శాఖగా నామకరణం చేసింది. వార్షిక విద్యాస్థితి నివేదిక (అన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్) ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో జరిగే ఎన్రోల్మెంట్ అభ్యసన సామర్థ్యాలపై అధ్యయనం జరిపి ఒక నివేదిక సమర్పించడం ఆనవాయితీ. 26 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 65 జిల్లాల్లో నిర్వహించిన ఈ సర్వే 3 నుండి 16 సంవత్సరాల వయసున్న విద్యార్థుల విద్యా స్థితి ఇంకా వారి అభ్యసన స్థాయిలను అధ్యయనం చేసింది. దాదాపు 18,000 గ్రామాల్లో చదువుతున్న 6,50,000 మంది విద్యార్థులు ఈ సర్వేలో పాల్గొనడం గమనార్హం. ముఖ్యంగా కోవిడ్ తర్వాత అభ్యసన స్థాయిలపై జాతీయ స్థాయిలో జరిగిన సర్వేలో కొంత పెరుగుదల కనపడినప్పటికీనీ ఇంకా ఈ పరిస్థితి ఆశాజనకంగా లేదనేది వాస్తవం. ప్రాథమిక స్థాయి అక్షరాస్యత, గణాంక జ్ఞానం ఈ సర్వేలో అధ్యయనం చేయబడిన ముఖ్యమైన అంశాలు. వీటితో పాటుగా డిజిటల్ అక్షరాస్యత కూడా సర్వేలో భాగం చేశారు. ఈ సంస్థ 2007 నుండి అధ్యయనం చేసి నివేదికలు సమర్పిస్తున్నది. 2025 ఫిబ్రవరిలో సమర్పించిన నివేదిక చాలా విస్తుపోయే విషయాలను బహిర్గతం చేయగాసంబంధిత మంత్రులు, విద్యాశాఖ అధికారులు, విద్యావేత్తలు దీని గురించి ఎక్కువగా చర్చించకపోవడం మరింత ఆశ్చర్యకరం. బాధ్యత వహించవలసిన వారు మౌనం వహించడం వ్యవస్థ దయనీయస్థితిని తెలియజేస్తున్నది. విద్యాశాఖ దౌర్భాగ్యాన్ని కూడా దాటి చెబుతున్నది. ఈ సర్వేప్రకారం 76.6 శాతం మంది మూడో తరగతి విద్యార్థులు, 55.2శాతం ఐదవ తరగతి విద్యార్థులు, 32.5శాతం మంది ఎనిమిదో తరగతి విద్యార్థులు తమ స్థానిక భాషలో రెండవ తరగతి స్థాయి పుస్తకాలు చదవలేని దుస్థితిలో ఉన్నారంటే మన దేశంలోని విద్యా ప్రమాణాల స్థాయి ఏదశలో ఉందో ఊహించుకోవచ్చు. 3-5 తరగతులలో 66శాతం మంది సామాన్య గణితంలో ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా 8వ తరగతి విద్యార్థులు సైతం రెండవ తరగతి పాఠ్యాంశాలను చదవగలిగిన వారు కేవలం 67.5శాతం అనేది గమనార్హం. ప్రాథమిక గణితంలో మాత్రం అంటే అంకెలు గుర్తించడం, రెండంకెల తీసివేతలు చిన్న భాగహారాలు చేయడంలో కొంత మెరుగుదల కనిపించడం విశేషం. ఇక డిజిటల్ లిటరసీ 14-16 వయసుల మధ్య 89శాతం విద్యార్థులకు ఇంటి వద్ద స్మార్ట్‌ఫోన్ అందుబాటులో ఉండగా 31.4శాతం విద్యార్థులకు సొంత స్మార్ట్ ఫోన్లు ఉన్నాయి. ఇక తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన నివేదికలో కొంత తగ్గుముఖం వెనుకబాటుతనం స్పష్టంగా కనబడుతున్నాయి. ప్రాథమికోన్నత తరగతులలో చదవడం అంకగణిత నైపుణ్యాల్లో గణనీయమైన సంఖ్యలో వెనుకబడి ఉన్నారు. 3-8 తరగతుల విద్యార్థులు కనీస గుణితాలు సాధారణ భాగహారాలు చేయడంలో విఫలమవుతున్నారు. కంప్యూటర్ల లభ్యత కూడా కేవలం తొమ్మిది శాతం మాత్రమే ఉన్నది. ఇది జాతీయ స్థాయి సగటు కంటే 27.4శాతం తక్కువగా ఉండటం శోచనీయం. డిజిటల్ అక్షరాస్యతలో ప్రావీణ్యత కలిగి ఉండటం ఉపశమనం కలిగించే విషయం. ఇక విద్యార్థుల నమోదు విషయానికొస్తే 6 నుండి 14 వయసున్న విద్యార్థులు జాతీయ స్థాయిలో 66.8శాతం ఉండగా తెలంగాణలో అది 59.8శాతం మాత్రమే ఉండటం బాధాకరం. సర్వే 9 జిల్లాల్లో జరగగా అత్యల్పంగా 47.9శాతం నిజామాబాద్ జిల్లాలో నమోదైంది. ఇక అభ్యసన స్థాయిలను పరిశీలిస్తే మూడు ఐదో తరగతి విద్యార్థులు కేవలం 18 శాతంమంది రెండవ తరగతి వాచకం చదవగలుగుతున్నారు. 49 శాతం



మంది మాత్రమే కనీస గణితం చేయగలిగే పరిస్థితిలో ఉన్నారు. 6-8 తరగతి విద్యార్థులను పరిశీలిస్తే వారిలో కేవలం 46.4శాతం మంది రెండవ తరగతి పాఠ్యాంశాలు చదవగలుగుతున్నారు. 34.7శాతం మంది ప్రాథమిక గణితం చేయగలుగుతున్నారు. 8వ తరగతి విద్యార్థుల్లో 56.4 శాతం రెండవ తరగతి వాచకం చదవగలరు. 41.1శాతం మాత్రమే సామాన్య గణితం చేయగలుగుతున్నారు. ఈ గణాంకాలు అన్ని జాతీయ స్థాయి సామర్థ్యాల కన్నా తక్కువగా ఉండటం గమనార్హం. మరికొన్ని విషయాలు ప్రభుత్వాలు జీర్ణంచేసుకోలేని విధంగా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 4.47 లక్షల మంది విద్యార్థులు ఎన్రోల్మెంట్ తగ్గగా ప్రైవేటు పాఠశాలల్లో 5.37 లక్షల మంది కొత్తగా నమోదు కావడం ప్రభుత్వం సమీక్షించుకోవాల్సిన విషయం. ప్రజలకు ప్రభుత్వం కన్నా ప్రైవేటు రంగంలో నడుస్తున్న పాఠశాలలు మెరుగన్న అభిప్రాయం బలపడితే భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలో ఉనికి మనుగడ ప్రశ్నార్థకమవుతాయి. సాలీనా బడ్జెట్లో పది శాతం బదులుగా 6-7 శాతం నిధులు కేటాయిస్తూ మౌలిక వసతులు కల్పనలో వెనుకబడి ఉండడం ప్రథమ కారణం అవుతుంది. మానవ వనరులు ముఖ్యంగా ఉపాధ్యాయుల కొరత ప్రభుత్వ పాఠశాలల్లో స్పష్టంగా కనబడుతోంది. వారిని దశల వారీగా నియమించడంతో పదవి విరమణ చెందుతున్న వారి స్థానంలో లేదా ఖాళీల్లో ఉపాధ్యాయుల నియామకం ఇంకా పూర్తిస్థాయిలో జరగడంలేదు. ప్రతిఏడూ వేల సంఖ్యలో నియామకాలు జరుపుతున్నామని చెప్పుకోవడమే గాని దాని ఫలితం భౌతికంగా ఎక్కడా కనబడదు. అంటే కేటాయింపులు నియామకాలు అంతాఅంకెల గారడీయేనా అనే సందేహం కలుగుతుంది. పాఠశాలల్లో బోధనా నిర్వహణను తనిఖీ చేసే యంత్రాంగం కొరవడింది అనడంలో ఎట్టి సందేహం లేదు. కేవలం పుస్తకాలపంపిణీ, ఏకరూప దుస్తుల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకంవంటి వాటిపై అధికార యంత్రాంగం తమ 'శక్తియుక్తులు' ధారపోస్తున్నారే కానీ తరగతి గదిలో బోధనలను పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు సరైన సలహాలు సూచనలు ఇవ్వడం లేదు. కంప్యూటర్ విద్య అవసరాన్ని గ్రహించి వాటిని ఉపయోగించే నైపుణ్యాలు విద్యార్థులకు నేర్పే సిబ్బందిని పాఠశాలల్లో నియమించాలి. లేదంటే కంప్యూటర్లు అలంకారప్రాయం అవుతాయి. 6500 పాఠశాలల్లో ఒకే ఒక్క ఉపాధ్యాయుడు పద్ధతిలో నడుస్తుండటం ఏ పరిస్థితికి నిదర్శనం? వారాంతపు శిక్షణలు, వేసవి శిక్షణలు మొక్కుబడిగా కాక ఒక నిర్దిష్టమైన లక్ష్యంతో నిర్వహించాలి. అనుభవజ్ఞుల విద్యావేత్తలసలహాలు సూచనలు తీసుకొని వాటిని అమలుపరచాలి. అవసరమైతే ఇతర రాష్ట్రాలలో పేరెన్నికగన్న విద్యాసంస్థలను సందర్శించి అక్కడి బోధనా పద్ధతులను, ప్రణాళికలను ఇతర విధానాలను అధ్యయనం చేసి మదింపుచేసి వాటిని కూడా మనకు తగిన విధంగా అమలు చేయడానికి సిద్ధపడాలి. విద్యార్థుల నమోదుకోసం టీచర్లు బడిబాట లాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం. కానీ అవి 'మొక్కుబడి' బాట కాకూడదు. అది ప్రజల్లో ప్రభుత్వ పాఠశాలల పట్ల విశ్వాసాన్ని పెంపొందించాలి. ముఖ్యంగా కోవిడ్ తర్వాత విద్యార్థుల్లో వచ్చిన మానసిక పరివర్తనను గ్రహించి బోధన జరగాలి. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలల కంటే ఉన్నతమైనవని సమాజంలో ఒక అభిప్రాయాన్ని బలంగా తీసుకురావాలి. నేటి ఐఎఎస్ అధికారులు అనేకమంది ప్రభుత్వ బళ్లలో చదివిన వారే. నేటి తల్లిదండ్రులు ఒకనాడు ప్రభుత్వ పాఠశాలలో చదివినవారే. వారికి తిరిగినమ్మకాన్ని కలిగించి విద్యార్థుల నమోదు గణనీయంగా పెంచాలి. అందుకు విద్యాశాఖలోని ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా గ్రహించి పని చేస్తేఫలాలు ఫలితాలు ఆలస్యంగానైనాచేతికి వస్తాయి. ప్రైవేట్ పాఠశాలలతో పోటీపడి నేడు ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టినా దానిప్రభావం అంతగాలేదు. విద్యార్థులకు బిల్డింగులు లాంటి మౌలికవసతులు, అనేక సౌకర్యాలు సమకూర్చినా తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలను వదిలిపెట్టి ప్రైవేటు పాఠశాలలో చేర్పించడానికిసుముఖత చూపడం దేనికి సంకేతం? తమ పిల్లలబంగారు భవిష్యత్తు కోసం కష్టార్జితమైన లక్షలరూపాయలు ప్రైవేట్ పాఠశాలలకు ధార పోయడానికైనా తల్లిదండ్రులు సిద్ధపడుతున్నారు. ఇది ప్రభుత్వ పాఠశాలల చేతగానితనమా లేక ప్రైవేట్ పాఠశాలలు చురుకుగా పనిచేసి అడ్మిషన్లు పొందుతున్నాయా? దీనిపై ఒక సమగ్రమైన అధ్యయనం జరగాలి. అసర్ గణాంకాలు మన వ్యవస్థలోని డొల్లతనాన్ని బహిర్గతపరిచాయి. ఇకనైనా మేలుకోకపోతే ప్రభుత్వ పాఠశాలలు ఒకప్పటి మాటగా చెప్పుకోవాల్సిన రోజులు వస్తాయి. ప్రభుత్వ పాఠశాలలను పునరుజ్జీవింప జేయాలి. వాటికి ప్రాణం పోసి నిలబెట్టాలి. పాలకులు, విద్యాశాఖ అధికారులు, తల్లిదండ్రులు అందరూ ఇందులో భాగస్వాములు కావాలి. ●

# 'కల్తీ నెయ్యి'లో అసలు సూత్రధారులెవరు?

గరిమెళ్ల రామకృష్ణ

తిరుమల తిరుపతి దేవస్థానంలో స్వామివారి ప్రసాదంలో లడ్డూకి భక్తుల్లో అచంచల భక్తి, విశ్వాసాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కోట్లాది భక్తుల విశ్వాసానికి ప్రతీ! స్వామివారి లడ్డూ ప్రసాదంకి వినియోగిస్తున్న నెయ్యి గతంలో కర్ణాటక ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న (నందిని బ్రాండ్)డైరీ నుంచి సరఫరా చేసేవారు. ఆ క్రమంలో 2023లో ఆ డెయిరీ సంస్థ నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడమనీ, టిటిడికి తక్కువ ధరకు నెయ్యి సరఫరా చెయ్యలేమని టెండర్ల దశలోనే వైదొలిగారు. టెండర్లను దక్కించుకున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఏఆర్ డైరీ, వైష్ణవి డైరీలను ముందు పెట్టి ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన భోలే బాబా ఆర్గానిక్ డైరీ ప్రైవేట్ లిమిటెడ్ నెయ్యి సరఫరా చేయడం, అందులో కల్తీజరిగిందన్న ఆరోపణలు పెద్దయెత్తున రావడం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం మారడం రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు పెద్దయెత్తున చోటు చేసుకున్న నేపథ్యంలో విచారణకు రాష్ట్రప్రభుత్వం నియమించిన సిట్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో కేంద్ర దర్యాప్తు సంస్థ సి.బి.ఐ. నేతృత్వంలో మరో దర్యాప్తు బృందం చేపట్టిన విచారణలో తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా చేసిన నెయ్యి అసలు నెయ్యే కాదని దర్యాప్తు బృందం విచారణలో వెల్లడి అయినట్లు సి.బి.ఐ న్యాయవాది నిందితుల బెయిల్ పిటిషన్ల విచారణ సందర్భంగా రాష్ట్ర హైకోర్టుకి తెలియపరిచారు. భోలే బాబా డైరీకి అసలు పాల సేకరణ, నెయ్యి ఉత్పత్తి చేసే వ్యవస్థే లేదని, వారు సరఫరా చేసింది పామాయిల్‌తో కొన్ని రసాయనాలు కలిపి నకిలీనెయ్యి సర ఫరా చేసినట్లు సి.బి.ఐ. దర్యాప్తులో తేలిన వైనం స్పష్టం అయింది. ఇక్కడ దేవస్థానం అధికారులు అలా కోట్ చేసిన తక్కువ ధరలకు కల్తీ లేని నెయ్యి సరఫరా చేయడం సాధ్య మేనా అనేది కనీసం విచారించలేదు! వాళ్లు సరఫరా చేస్తు న్నది కల్తీ నెయ్యి అని పరీక్షల్లో బహిర్గతమైన తర్వాత ఆ ధరలకు ఎలా సరఫరా చేయగలరు అన్న ప్రశ్న ఉత్పన్నం అయింది. అంటే టెండర్లను ఆమోదించే దశలోనే ఇలాంటి మౌలిక అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. అయితే ఇక్కడ మనం గమనించవలసిన మరో అంశం సీనియర్ ఐ.ఏ.ఎస్ అధికారి టిటిడి దేవస్థానం మాజీ ఈవో, రాష్ట్ర ప్రభుత్వ మాజీ ముఖ్య కార్యదర్శి శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం తాను నెయ్యిలో కల్తీ జరుగుతుందనీ ల్యాబ్ రిపోర్ట్ ద్వారా స్పష్ట మైందని హెచ్చరించినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని వాపోయారు. రుచి, శుచితో పాటు లడ్డు పవిత్రతను దేవస్థానం పాలకమండలి కాపాడాలి. కల్తీ నెయ్యి ద్వారాస్వామి వారికి అపచారం జరిగిందని అందుకు ప్రాయశ్చిత్తం కోసం వేడుకుంటున్నానని మీడియా ముందు సుబ్రహ్మణ్యంఆవేదన వెలిబుచ్చారు. ఇక్కడ ప్రజా ప్రయోజనాల దృష్ట్యా న్యాయస్థానాలు, ప్రజా ప్రతినిధులు ఇలా దేశంలో ఎన్ని సంస్థలు డైరీల పేరుతో కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నారు, వాటిపై నిఘా ఉందా? ఈ భోలే బాబా డైరీ ఇతర సంస్థలకు సరఫరా చేసిన కల్తీ నెయ్యిపై విచారణ చేయాలి కదా? ఇదే డైరీలు దేశంలోని ఇతర దేవాలయాలకు సరఫరా చేసిన నెయ్యిపై ఎవరు విచారించాలి? స్వామివారికి సంబంధించిన భక్తుల మనోభావాలకు భంగం కలిగింది. అసలు ఇలాంటి కల్తీ నెయ్యి వాడకం వలన ప్రజారోగ్యం మాటేమిటి? ఒక్క నెయ్యి మాత్రమే కాదు, పాలు కూడా పెద్దయెత్తున నకిలీ పాలు దేశవ్యాప్తంగా సరఫరా అవుతున్నాయి. వీటి నాణ్యతా ప్రమాణాలు పరీక్షించడానికి తగినన్ని పరీక్షశాలలే లేవు? ఆంధ్రప్రదేశ్‌లో కల్తీపాల నిర్ధారణకు హైదరాబాద్‌లో పరీక్షించాలి అంటే మనం నాణ్యతా ప్రమాణాల విషయంలోఎంత ఉదాసీనంగా ఉన్నామో ఆశ్చర్యం కలుగుతుంది! సంవత్సరాల తరబడి కల్తీనెయ్యి సరఫరా చేస్తూ అన్నిస్థాయిల్లో వ్యాపారానికి ఇబ్బంది కలగకుండా పకడ్బందీగా నడిపిస్తున్నవారు పరీక్షశాల ఇచ్చే నివేదికలు కూడా తమకు అనుకూలంగా వచ్చేలా జాగ్రత్త పడలేరని చెప్పే పరిస్థితి ఉందా? అంతే కాదు, ఆ సంస్థ ఇప్పటికీ అదే వ్యాపారం కొనసాగిస్తుందా లేక మూతపడిందా అన్నది ఎవరికీ తెలియదు, పట్టదు? ఈ కల్తీ నెయ్యి వ్యవహారంలో ఇప్పటికి మూడు డైరీల బాగోతం మాత్రమే బయటపడింది, దేశంలో ఇంకా ఇలాంటిఎన్ని డైరీలు ఉన్నాయో సమాధానం లేని ప్రశ్న. ఇప్పటికైనా పాలకులు, న్యాయ స్థానాలు పాలు, నెయ్యి, ఇతర ఆహార పదార్థాల నాణ్యత పరీక్షలు, తగినంతమంది పర్యవేక్షణ సిబ్బందిని నియమించ డంపై దృష్టి పెట్టాలి. పాలకులు బాధ్యతారాహిత్యంగా ఉంటే ఎలాంటి అనర్థాలు జరుగుతాయో తిరుమల కల్తీనెయ్యి వ్యవహారం ఒక ఉదాహరణ! ●

# నేతల ప్రచారంలోనే పేదరిక నిర్మూలన!

ఫిరోజ్ ఖాన్

భారతదేశంలో గత పదకొండేళ్లలో దేశంలో తీవ్ర పేదరికం 27.1 శాతం నుంచి 5.3 శాతానికి తగ్గిందని ప్రపంచ బ్యాంక్ ఒక నివేదికను విడుదల చేసింది. 26.9 కోట్ల మంది అత్యంత పేదరికం నుంచి బయటకు వచ్చారని పేర్కొంది. 2011-12లో 34.4 కోట్లమంది తీవ్ర పేదరికంలో ఉండగా, 2022-23 నాటికి ఈసంఖ్య 7.5కోట్లు మాత్రమే అని పేర్కొంది. ఇదే విషయాన్ని అధికార పార్టీ మీడియా, సోషల్ మీడియాలో జోరుగా ప్రచారంచేస్తున్నది. ప్రధాని మోడీ సైతం తన ప్రసంగాల్లో ఇదే అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. 25కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని చెబుతున్నారు. అయితే అసలు పేదరికం నిర్వచనం పైనే అనేక విమర్శలు ఉన్నాయి. పేదరికం తగ్గితే మరి 80 కోట్ల మందికి ఉచిత రేషన్, ఉపాధి హామీ వంటి పనులు ఇంకా ఎందుకు కొనసాగుతున్నాయనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రపంచ బ్యాంక్ డేటాలో అత్యంత పేదరికానికి రోజుకు రూ. 2.15 డాలర్లు (2022-23 ధరల ప్రకారం) అంటే రూ.200లోపు వ్యయం చేసే వారిని పరిగణనలోకి తీసుకున్నది. అంటే నెలకు సుమారు రూ.5200 వ్యయం చేసే శక్తిఉండడం. ఈ కేటగిరిలో 2011-12లో 16.2 శాతం మంది ఉండగా, ఇది 2.3శాతానికి తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ రేటు 18.4నుండి 2.8శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 10.7 నుంచి 1.1శాతానికి తగ్గింది. దీంతో రూరల్ అర్బన్ పేదరిక వ్యత్యాసం 7.7నుంచి 1.7 శాతానికి తగ్గింది. లోయర్ మిడిల్ ఇన్‌కమ్ పేదరికం అంటే రోజువ్యయం 3.65 డాలర్లు (సుమారు రూ.300) కంటే తక్కువ నుంచి 37 కోట్ల మందికి పైగా బయటపడ్డారని పేర్కొంది. అంటే నెలకు రూ. 8,800 ఖర్చు చేసే శక్తి ఉన్నవారు. అయితే ఇక్కడ పేదరికం నిర్వచనమే తప్పుగా తీసుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. రోజుకు అన్ని రకాల ధరలు పెరుగుతుండగా.. పేదరికాన్ని లెక్క వేయడానికి తీసుకునే ప్రామాణికాలే తప్పుగా ఉన్నాయని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆ ప్రకారమే తీసుకున్నా.. 2011-12లో 60.18 శాతం మంది ప్రజలు రోజుకు 3.65 డాలర్లు (రూ.300 వరకు) సంపాదనతో జీవించేవారు. 2022-23 నాటికి ఈ సంఖ్య 28.1శాతానికి తగ్గింది. అంటే ఆ నివే



దిక ప్రకారమే చూసుకున్నా ఇప్పటికీ 35 కోట్ల మందికిపైగా ప్రజలు పేదరికంలో ఉన్నట్టే. పేదరికం తగ్గిందని ఒ వైపు ప్రగల్భాలు పలుకుతూనే.. మరోవైపు 80 కోట్ల మందికి (దేశ జనాభాలో 55శాతం) ఉచిత రేషన్‌పంపిణీ చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నది. ఒక వేళ పేదరికం తగ్గితే ఇంత మందికి ఉచిత రేషన్‌పంపిణీ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా 30 శాతం కుటుంబాలు ఉపాధి హామీ పథకం పనులపై ఆధారపడి జీవిస్తున్నాయి. 2011-12లో చేసిన సర్వేలతో పోల్చుకుంటే 2022-23 చేసిన హౌస్‌హోల్డ్ కన్స్యూమర్ ఎక్స్ పెండిచర్ సర్వేలో శాంపిలింగ్ డిజైన్, డేటా సేకరణ, రీకాల్ పీరియడ్‌లలో తీవ్ర వ్యత్యాసమున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మరోవైపు 2017-18 సర్వే డేటాను ప్రభుత్వం 'డేటా క్వాలిటీ' కారణాలతో విడుదల చేయలేదు, ఇది డేటా పారదర్శకతపై సందేహాలను లేవనెత్తుతున్నది. పేదరికాన్ని ఆదాయం ఆధారంగా కాకుండా వినియోగ వ్యయం ఆధారంగా లెక్కించడం ద్వారా ఇది రోజువారీ కూలీలు, స్వయం ఉపాధి వారి ఆర్థిక అస్థిరతను దాచిపెడుతుందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. అంతేకాకుండావినియోగ ఆధారిత జినీ కోఎఫిషియంట్ (వినియోగ వ్యయంలో ఆర్థిక అసమానతలు) 2011-12లో 28.8 శాతం ఉండగా, ఇది 2022-23కి వచ్చేసరికి 25.5కి తగ్గిందని ప్రపంచబ్యాంకు తెలిపింది. అదే సమయంలో ఆదాయ ఆధారిత జినీ కోఎఫిషియంట్ (ఆదాయ అసమానతలు)2004లో 52 శాతం ఉండగా, 2023లో ఇది 62 శాతానికి పెరిగింది. అంటే ఆదాయ, వ్యయాల్లో పూర్తి వ్యతిరేక దృశ్యం మనకు కనిపిస్తుంది. మరోవైపు 40 శాతానికి పైగా సంపదను దేశంలోని ఒక శాతం జనాభా మాత్రమే కలిగిఉండగా, 6.4శాతం సంపదను దిగువన ఉన్న 50 శాతం మంది జనాభా కలిగి ఉన్నారు. రానున్న ఏడాదికాలంలో జరిగే ఆరురాష్ట్రాల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు పేదరికం తగ్గుదల అనే అంశాన్ని ఒక ప్రాపగండాలా అధికార పార్టీ ప్రచారం చేస్తున్నట్టు కనిపిస్తున్నది. ముఖ్యంగా బిహార్‌లో వచ్చేనవంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. ఇక్కడ పేదరకం అనేది ప్రధాన సమస్య. పేదరికం తగ్గించామనే అంశం ద్వారా ఇక్కడ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నది. మరోవైపు 2026 మే నుంచి ఆగస్ట్ మధ్యలో అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడా ఈ అంశాన్ని లేవనెత్తి ప్రజలను తమవైపు తిప్పుకోవాలని భావిస్తున్నట్లు కనిపిస్తున్నది. ●

అమరావతి వార్త





మంగళవారం సిఎం చంద్రబాబుతో కేంద్ర గనుల శాఖా మంత్రి కిషన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా వెంకటేశ్వరుని ప్రతిమను అందజేస్తున్న సిఎం చంద్రబాబు . స్థానిక బిజెపి నేతలు (దిగువ)- (గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి)

# నేటి నుంచి ఎస్జీటీ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ బదిలీలు

గుంటూరు విద్య ,జూన్ 10,ప్రభాతవార్త : ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జిల్లా పరిషత్ యాజమాన్యంలో గల సెకండరీ గ్రేడ్ తెలుగు మీడియం ఉపాధ్యాయులకు బదిలీల కౌన్సిలింగ్ సీనియార్టి నెం 351 నుంచి 1000వరకు జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరం మొదటి అంతస్తులో 11వ తేది ఉదయం 9.00గంటల నుండి బదిలీల కౌన్సిలింగ్ జరుగునని అదేవిధంగా మున్సిపల్ కార్పొరేషన్ మరియు మున్సిపల్ పాఠశాల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ తెలుగు మీడియం,ఉర్దూ మీడియం ఉపాధ్యాయుల బదిలీల కౌన్సిలింగ్ 11వ తేది ఉదయం 9గంటలనుండి గ్రౌండ్ ఫ్లోర్‌లో గల జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరం గుంటూరులో జరుగునని జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక తెలియజేశారు.కాబట్టి ఉమ్మడి జిల్లాలోని ఉప విద్యాశాఖాధి కారులు,మండల విద్యాశాఖాధికారులు సీనియార్టిలోఉన్న ఉపాధ్యాయులందరూ కౌన్సిలింగ్ కు హాజరయ్యేలా చూడాల్సిందిగా తెలిపారు.



ఈనెల 21న యోగా డే నిర్వహణ ఏర్పాట్లపై విశాఖలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, గుమ్మడి సంధ్యారాణి, అధికారులు

# రాక్షసుల్లా వ్యవహరిస్తున్న వైకాపా నేతలు

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, జూన్ 10:** మహిళలను కించపరిచేలా మాట్లాడుతున్న కొమ్మినేని, కృష్ణంరాజు, సజ్జలకు కొమ్ముకాస్తున్న జగన్‌రెడ్డి, భారతిలు వెంటనే మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నజీర్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే నజీర్ మాట్లాడుతూ, హిందూ, బౌద్ధ ధర్మాల కర్మభూమిగా, శాతవాహనుల రాజధానిగా ఉన్నటువంటి అమరావతి ప్రాంతంలో రాష్ట్రం హితం కోసం గతంలో ఎక్కడా చేపట్టని విధంగా ఒక ఉద్యమాన్ని చేపట్టి ఆంధ్ర రాష్ట్రప్రతిష్టను కాపాడినటువంటి మహిళలను వైకాపా నేతలు విమర్శించటం చాలా దారుణమన్నారు. భౌద్ధుడు ప్రతి మహిళను తల్లిగా భావించే భూమిలో పుట్టిన మహిళలపై అవాకులు,చవాకులు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. జగన్ మీడియాలో కూర్చున్న కొమ్మినేని, కృష్ణంరాజు, సజ్జల మాట్లాడే మాటలు యావత్ సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు.



-రాష్ట్రంలో మంచి జరుగుతుంటే ఓర్వలేకపోతున్నారు
-మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నజీర్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్

రాజధానిగా అమరాతిని కొనసాగించాలంటూ ఉద్యమం చేస్తే.. అమరావతి మహిళలనునాడు ఎన్నోరకాలుగా అవమానించేలా మాట్లాడారని అన్నారు. నరసింహయాదవ్ మాట్లాడుతూ, నాడు వ్యవస్థలను జగన్‌రెడ్డి నిర్వీర్యం చేసి ధ్వంసం చేశారన్నారు. జగన్‌రెడ్డి ధ్వంసం చేసిన వ్యవస్థలను అపారమైన అనుభవంతో నేడు సిఎం చంద్రబాబునాయుడు గాడిలో పెడుతున్నారని అన్నారు. ఇది రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి పాలన కోరుకున్నారో.. వారు కోరుకున్న విధంగా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు కేంద్ర సహకారంతో ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. నేడు ప్రజలకు కూటమి మేలు చేస్తుంటే చూసి వైకాపా నేతలు ఓర్వలేకపోతున్నారని దుయ్యబట్టారు. వైకాపా నేతల వ్యాఖ్యలను మేధావులు, మహిళా కమిషన్ కూడా తప్పుపట్టిందన్నారు. కావున ప్రజలు దీన్ని అర్థం చేసుకుని మహిళా లోకాన్ని గౌరవించని వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు.

# కాంట్రాక్టర్లు,అధికారులు సమన్వయంతో పనిచేయాలి

## --క్షేత్రస్థాయిలోని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలి : కమీషనర్ శ్రీనివాసులు

గుంటూరు నగరపాలక సంస్థ,జూన్ 10,ప్రభాతవార్త : స్థానిక నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులను నిర్ధేశిత గడువు మేర,నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ చేపట్టాలని,ప్రమాణా మేరకు జరగని పనులకు బిల్లులు చెల్లింపు చేపట్టబోమని నగరమేయర్ కోవెలమూడి రవీంద్ర



నృష్టంచేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమీషనర్ పులి శ్రీనివాసులుతో కలసి ఇంజనీరింగ్ అధికారులు,కాంట్రాక్టర్లకు నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, కాంట్రాక్టర్ల సమస్యలు తదితర అంశాలపై సంయుక్త సమావేశం జరిగింది.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరాభివృద్ధికి కాంట్రాక్టర్లు,అధికారులు సమన్వయంతో పనిచేయాలని,కాంట్రాక్టర్ల పట్ల పక్షపాతం లేకుండా పూర్తి పారదర్శకంగా,నిర్ధేశత గడువు మేరకే బిల్లుల చెల్లింపు జరుగుతుందన్నారు.వీధి దీపాల ఏర్పాటుకు సంబంధించి స్టాండింగ్ కమిటీలో కూడా ఆమోదం తెలిపినందున వేగంగా చర్యలు తీసుకోవాలని,వీధి దీపాల సమస్యలపై ప్రజల నుండి ఫిర్యాదులు రావడానికి వీల్లేదన్నారు.కమీషనర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు ప్రభుత్వ ఆదేశాల మేరకు నిధి పోర్టల్ ద్వారానే చెల్లింపులు,పని పూర్తయిన గడువు ప్రకారం చేస్తామని తెలిపారు.ప్రతి కాంట్రాక్టర్ తప్పనిసరిగా జిఎస్టీ నో డ్యూ సర్టిఫికేట్ అందించాలన్నారు.ఏఈలు బుధవారం నుండి తమ లాగిన్ ల ద్వారా తమ పరిధిలో జరిగేపనులకుసంబంధించి నిధి పోర్టల్ లోనే అప్‌లోడ్ చేయాలన్నారు.డీఈఈలు,ఈఈలు అభివృద్ధి పనుల పర్యవేక్షణ,పరిశీలన,బిల్స్ అప్‌లోడ్,పనుల రికార్డులను సమగ్రంగా దృష్టి సారించాలన్నారు.కాంట్రాక్టర్లు కూడా తమ పరిధికి మించి పనులనుపొంది పనులు ప్రారంభించకుండా,నోటీసులకు కూడా స్పందించని వర్క్‌ల టెండర్లు రద్దుచేస్తున్నామన్నారు.కాంట్రాక్లర్లు ప్రాధాన్యత ఉండే పనులను ప్రత్యేక దృష్టితో వేగంగా చేపట్టాలని తెలిపారు.క్షేత్రస్థాయిలో ఏ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.తొలుత కాంట్రాక్టర్ల సంఘం నాయకులు కొండా రమేష్ మాట్లాడుతూ గత 3,4ఏళ్ళ కాలంలో బిల్లుల చెల్లింపులు లేక తీవ్ర ఇబ్బందుదు ఎదుర్కొన్నామని,నూతన ప్రభుత్వంలో తక్కువ కాలంలోనే పెండింగ్ బిల్స్ చెల్లించారన్నారు.జిఎంసి పరిధిలో బిల్లుల చెల్లింపుకు గడువు నిర్ధేశించాలని,జిఎస్టి క్లీయరెన్స్ సర్టిఫికేట్ లేకుండా బిల్లులు చెల్లించాలన్నారు.ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ విధానంలో బిల్లులు చెల్లించాలని,నిధి పోర్టల్ లలో కూడా గడువు మేరకే అప్‌లోడ్ చేయాలని కోరారు.సమావేశంలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు,ఈఈ లు సుందరరామిరెడ్డి,కోటేశ్వరరావు,డిఈఈలు,ఏఈలు,కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# యోగాంధ్ర-2025 కార్యక్రమాలను విజయవంతం చేయాలి

## -అధికారులకు గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశం

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, జూన్ 10:** జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యోగాంధ్ర 2025 కార్యక్రమాల్లో అన్నివర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం సక్రమంగా నిర్వహించేలా మునిసిపల్ కమిషన్లు, ఎమ్డీఓలు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం జిల్లా కలెక్టర్ ఛాంబర్ నుంచి జిల్లా



కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ తేజ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కె ఖాజావలితో కలిసి యోగాంధ్రా 2025 కార్యక్రమాల నిర్వహణపై మునిసిపల్ కమిషన్లు, ఎమ్డీఒలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21న తేదీన భారీస్థాయిలో యోగాసనాలు కార్యక్రమం నిర్వహించటానికి ముందస్తుగా జూన్ 14న యోగాసనాల కార్యక్రమం నిర్వహించటానికి ప్రదేశాల గుర్తింపు, మాస్టర్ ట్రైనర్స్ మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు.

# 15 రోజులుగా ట్యాంకర్ ఎందుకు రాలేదు?...

## గుంటూరు 'తూర్పు' ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్

గుంటూరు తూర్పు,జూన్ 10,ప్రభాతవార్త : పదిహేను రోజులుగా మంచినీరు రాకపోతే ఏం చేస్తున్నారు.ఫిట్టర్ నుంచి ఏఈల వరకు విషయం తెలియదా? అన్ని తెలిసి కూడా ట్యాంకర్లు ఎందుకు పంపడం లేదు.15నిమిషాల్లో వాటర్ ట్యాంకర్ రావలి వచ్చే వరకు నేను ఇక్కడే ఉంటాను అంటూ అధికారుల తీరుపై ఎమ్మెల్యే నసీర్ అసహనం వ్యక్తంచేశారు.వార్డుల పర్యటనలో భాగంగా మంగళవారం గుంటూరులోని కొబ్బరికాయల సాంబయ్య కాలనీలో ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు.అక్కడ మహిళలు ఎమ్మెల్యే వద్దకు వచ్చి తమకు మంచినీటి ట్యాంర్ రావడం లేదని తెలపడంతోవెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు.మంచినీటి సమస్య ఉంటే ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు.మళ్ళీ ఇలాంటి సమస్య రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.మంచినీటి ట్యాంకర్ వెంటనే వస్తుందని,ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే తనను సంప్రదించాలని స్థానికులకు సూచించారు.అనంతరం వార్డులోని ప్రజలతో మాట్లాడుతూ



సమస్యలేమైనా ఉన్నాయా అని వాకబు చేశారు.వారు చెప్పిన విషయాలను నమోదు చేసుకొని వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.శానిటేషన్ పట్ల శ్రద్ద వహించాలని,ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం సహించబోమని స్పష్టంచేశారు.తాము అధికారంలోనికి వచ్చిన కొద్ది నెలల్లోనే ప్రతి వార్డులో సమస్యలనుగుర్తించి పరిష్కారం చూపుతున్నామని తెలిపారు.గతంలో ఈ కాలనీల్లో అడుగు పెట్టడానికి కూడా వీల్లేకుండా ఉండేదని,ప్రస్తుతం పరిస్థితి మారిపోయిందని చెప్పారు.రోడ్లు,సీసీ డ్రెయిన్ల నిర్మాణం చేపడుతున్నామని,శానిటేషన్ సమస్య రానీయకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.కార్యక్రమంలో సూరే శ్రీను,మల్లెంపూడి శ్రీనివాస్,పాటిబండ్ల శ్రీనివాసరావు,భోగినేని హరికృష్ణ,రాథంశెట్టి జగన్,కోట పిచ్చిరెడ్డి,వీరారెడ్డి,మస్తాన్‌వలీ, లక్ష్మీ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి కార్యాలయంలో ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుక

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, మే10:** హిందూపురం ఎమ్మెల్యే పద్మభూషణ్, నందమూరి బాలకృష్ణ 65వ పుట్టిరోజు వేడుకలను గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం టిడిపి జాతీయ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. భారీకేక్‌ను కట్‌చేసి బాలయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నేతలు మాట్లాడుతూ, మానవత్వం యొక్క నిలువెత్తు నిదర్శనం



నందమూరి బాలకృష్ణ అని పేర్కొన్నారు. టిడిపి సీనియర్ నేతలు రమణ, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, బొద్దులూరి వెంకటేశ్వరరావు, ఎన్నారై వింగ్ సభ్యులు చప్పడి రాజశేఖర్, ఎం.సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

# సింగపూర్‌లో బాలకృష్ణ జన్మదిన వేడుకలు

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, జూన్ 10:** నందమూరి తారక రామారావు వారసుడిగా సినీరంగంలో తనదైన ముద్ర వేసిన నందమూరి బాలకృష్ణ 65వ జన్మదిన వేడకలను సింగపూర్‌లో తెలుగుదేశం ఫోరం సింగపూర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాలయ్య అభిమానులు, సింగపూర్‌లో



నివసిస్తున్న తెలుగు ప్రజలు పాల్గొని వేడుకలను పండుగలా జరుపుకున్నారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ, సినీరంగంలో తిరుగులేని హీరోగానే కాకుండా బసవతారకం హాస్పిటల్‌తో ఎంతో మంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు సహాయ సహకారాలు అందించి వారికి పునర్జన్మను ప్రసాదించిన వ్యక్తి బాలయ్య అని పేర్కొన్నారు. ఈ వేడుకలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు, అభిమానులు పాల్గొని బాలయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# 'మాదిగలకు 7శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి'

గుంటూరు విద్య,జూన్ 10,ప్రభాతవార్త : స్థానిక స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు మాదిగ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది.సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏపి ఎమ్మార్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పి.ఎం.రామాంజనేయులు మాదిగ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పుప్రకారం ఎస్సీ వర్గీకరణ



అమలు చేసిన కూటమి ప్రభుత్వం ఏపిలో మాదిగలకు అన్యాయం చేసిందని ఆరోపించారు.గత 30ఏళ్ళ నుండి వర్గీకరణ కోసం ఎంతోమంది మాజాతి మాదిగ బిడ్డలు ప్రాణ త్యాగం చేశారని వారి ప్రాణ త్యాగం మరువలేనిదని తెలిపారు.స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు మాదిగ మాట్లాడుతూ మాదిగల సామాజిక సాంఘీక విద్యాభివృద్ధే ధ్యేయంగా స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ పని చేస్తుందని వెల్లడించారు.విద్య ఉద్యోగాలు రిజర్వేషన్లు మాదిగలకు 7శాతం రిజర్వేషన్ కల్పించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు మొదలుపెడతామని మాదిగ సత్తా కూటమి ప్రభుత్వానికి చూపిస్తామని తెలిపారు.

# ఆచార్య ఎన్జీరంగాకు నివాళులు

గుంటూరు విద్య,జూన్ 10,ప్రభాతవార్త : స్వాతంత్ర్య సమర యోధులు,నిరాడంబరులు ఆచార్య ఎన్జీ రంగా వర్థంతి సందర్భంగా బృందావన్ గార్డెన్స్ కూడలి నందుగల ఆయన విగ్రహానికి పూలమాలలతో



నివాళులర్పించారు.కార్యక్రమంలో బిజేపి సీనియర్ నాయకులు ఎడ్లపాటి రఘునాథ్ బాబు, జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు,బిజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎడ్లపాటి స్వరూపరాణి,దేశు సత్యనారాయణ,ఎ.అంజిరెడ్డి,బిజేపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని వక్ఫ్ ఆస్తులను కాపాడుకుందాం : రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం

గుంటూరు తూర్పు,జూన్ 10,ప్రభాతవార్త : స్థానిక పాతగుంటూరు సీఐటియు కార్యాలయంలో ఆవాజ్ జిల్లా అధ్యక్షులు షేక్ మహబూబ్ సుభాని ఆధ్వర్యంలో సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ సర్వోత్తమ న్యాయస్థానం సుప్రీంకోర్టు పూర్తి ఆమోదం తెలపనప్పటికీ దేశవ్యాప్తంగా ఎన్డీఏ (బిజేపి) ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం 2025త్వరితగతిన అమలు చేసే ప్రయత్నం చేస్తుంది.అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులను తమ ఆధీనంలో తీసుకునేప్రయత్నం జరుగుతుందని మరి ముఖ్యంగా గుంటూరులోని పెద్దమసీదు కు చెందిన ప్రత్తిపాడుమండలం కొత్త మల్లాయపాలెం గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 232-1,2 లో 233.18ఎకరాలు మరియు అంజుమనే ఇస్లామియా సంస్థకు సంబంధించిన చినకాకానిలోని ఎన్నారై ఆస్పత్రి వెనుకున్న 78ఎకరాలు ప్రభుత్వం ఇండస్ట్రీయల్ పార్క్ అభివృద్ధి పేరుతో ఏపిఐఐసీకి బదలాయించే ప్రయత్నం జరుగుతుందని ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం అని అన్నారు.అవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిస్తి మాట్లాడుతూ సుమారు రూ.500ల నుంచి రూ.600ల కోట్ల విలువ కలిగిన ఈ ఆస్తులను బదలాయించడం వక్ఫ్ నిబంధనలకు పూర్తి విరుద్దమన్నారు.దీనికి వ్యతిరేకంగా ఆవాజ్ కమిటీ మరియు ఇతర ప్రజాసంఘాలను కలుపుకొని ఐక్య కార్యాచరణలో బాగంగా జిల్లాలో ఉన్న వక్ఫ్ ఆస్తుల పూర్తి సమాచారాన్ని ఆర్‌టిఐ ద్వారా సేకరించాలని ఆ ఆస్తులు నిర్వహణ పారదర్శకంగా జరగాలని అవి కేవలం పేద ముస్లీం ప్రజానీకం యొక్క సంక్షేమం కోసమే వినియోగించాలని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్ల సాధన కోసం వక్ఫ్ పరిరక్షణ వేదిక గుంటూరు పేరుతో సంస్థ ఏర్పాటై వారి న్యాయమైన డిమాండ్లకోసం పోరాడుతుందని తెలియజేయడం జరిగింది. సమావేశంలో ముస్లీం యూనైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి కలీం,ముస్లీం హక్కుల పోరాట సమితి నాయకులు ఖాజావలి ముస్లీం లీగ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ బషీర్ అహ్మద్,డిఎంఎస్ జాతీయ నాయకులు కె.వినయ్ కుమార్,జన చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు లక్ష్మణ్‌రెడ్డి,గుంటూరు జిల్లా ఆవాజ్ కమిటీ కార్యదర్శి షేక్ భాషా,హెల్ప్‌లైన్ ఆర్గనైజేషన్ నాయకులు ఎండి జబ్బార్,సిఐటియు నాయకులు కె.నళినీకాంత్,కౌలు రైతు సంఘం నాయకులు బి.శ్రీనివాసరావు,ముస్లీం ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు షేక్ బాజీ,టోపిబాబు,అవాజ్ నాయకులు ఖాశీం వలి,షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు.




దేవదాయ ధర్మదాయశాఖ
శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవస్థానము
అడిగొప్పల గ్రామము, దుర్గి మండలం, పల్నాడు జిల్లా

సీల్డ్ టెండరు ప్రకటన

శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవస్థానము నందు సిసి కెమెరాలు స్టోరేజిని 90 రోజులు పెంపుదలకు గాను హార్డ్‌డిస్క్ మరియు ఇతర సామాగ్రి కొరకు సీల్డ్ టెండర్లు కోరబడుచున్నది. టెండరు షెడ్యూల్స్ కొరకు ది:11.06.2025 నుంచి ది:17.06.2025 వరకు సీల్డ్ టెండర్లు ఇవ్వబడును. ది:18.06.2025న సీల్డ్ టెండరును టెండరుదారుల సమక్షములో తెరవబడును. ఇతర వివరముల కొరకు 93908 55670 ను సంప్రదించగలరు.

ఇట్లు
అమ్మవారి సేవలో ..
యాగంటి వెంకటేశ్వర్లు, బి.ఎ
వ్యవస్థాపక ధర్మకర్త
సహాయ కమీషనరు &
కార్యనిర్వహణాధికారి

## విజే విద్యార్థులకు ప్రతిభా పురస్కారం

తాడేపల్లి,జూన్ 10,ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక ంగా నిర్వహించే ప్రతిభా పురస్కారాల్లో భాగంగా ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లాల వారీగా ప్రతిభా పురస్కారాలను ప్రభుత్వం ప్రకటించింది.గుంటూరు జిల్లా మంగళగిరిలోని వి.జె.జూనియర్ కళాశాలకు చెందిన బియ్యపు ప్రవల్లిక సిఈసి 963/1000, గుర్రం రమ్య హెచ్ఇసి 959/1000లను ఎంపిక చేశారు.గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ,గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థినులు ప్రతిభా పురస్కారాలు స్వీకరించారు.ఇంటర్ ఎంపిసీ విభాగంలో



987/1000,మరియు ఆదివారం విడుదల చేసిన ఈఏపి ఈసెట్ ఫలితాల్లో 4772ర్యాంక్ సాధించిన చిరంజీవి జొన్నాదుల వెంకట నాగ అమృత రాజధానిలోని ప్రముఖ యూనివర్సిటీల్లో ఫ్రీ సీటు పొందే అవకాశాన్ని సుగమం చేసుకుంది.ఈ సందర్భంగా కళాశాల్లో ఏర్పాటుచేసిన అభినందన సభలో మంగళగిరి ఖ్యాతిని రాష్ట్రస్థాయిలో నిలబెట్టిన విద్యార్థినులు గుర్రం రమ్య,బియ్యపు ప్రవల్లిక లను వి.జె.విద్యాసంస్థల సెక్రటరీ,కరస్పాండెంట్ ప్రగఢ రాజశేఖర్,కళాశాల ప్రిన్సిపాల్ అవ్వారు సత్యన్నారాయణ,వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ,డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాదెళ్ళ శ్రీనివాసరావు,అధ్యాపక బృందం,విద్యార్థినులను ప్రశంసించి సత్కరించారు.

## ప్రధాని మోడీ 11ఏళ్ళ పాలనపై హర్షం వ్యక్తంచేస్తూ సేవా కార్యక్రమాలు

తాడేపల్లి,జూన్ 10,ప్రభాతవార్త : వడ్డేశ్వరం బైపాస్ సమీపాన శ్రీఅన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరస్వామివారి దేవస్థానం కాశీనాయన ఆశ్రమం నందు భారత ప్రధాని నరేంద్రమోడీ 11సంవత్సరాల పాలనను



దిగ్విజయంగా పూర్తిచేసుకుని అనేకమైన సంస్కరణలు తెచ్చి దేశాని ్న ముందుకు నడిపించి ఆర్థిక వ్యవస్థలో ప్రపంచంలోనే 4వ స్థానానికి చేర్చిన శుభ సందర్భంగా తాడేపల్లి పట్ ్టణ బిజేపి అధ్యక్షులు టంకశాల ఈశ్వర్ నాయుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమ ఆశ్రమంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మంగళగిరి బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పంచుమర్తి ప్రసాదు విచ్చేశారు.ఇంకా గుంటూరు జిల్లా కిసాన్ మోరా ్చ అధ్యక్షులు తుల్లిమిల్లి శ్రీనివాసరావు,మునగపాటి వెంకటేశ్వరరావు,గట్ల శివ కొండా రెడ్డి,వల్లూరు శివరామకృష్ణ,యువ మోర్చా అధ్యక్షులు బత్తుల ఆంజనేయులు,బిజేపి కార్యకర్తలు రంజిత్ జినా,కుమ్మడివేల్లి భిక్షపతి,సానబోయిన సుబ్బారావు,గొట్టాపు గోవర్ధన్‌రావు,మట్టా లక్ష్మణ్,రాజారావు రామాంజనేయులు,కాంద్రు భానుకిషోర్,కౌతారపు ధనుంజయ పాల్గొన్నారు.

## కృష్ణంరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్సీ ఆలపాటి రాజా

తెనాలి, జూన్ 10 , ప్రభాతవార్త : మహిళలను అవమాన పరుస్తూ కించపరిచే విధంగా సాక్షి ఛానల్ డిబేట్‌లో మాట్లాడిన జర్నలిస్టు కృష్ణంరాజుపై సంబంధిత ఛానల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఒన్‌టౌన్



పోలీసు అధికారులకు మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజుతో పాటుగా సాక్షి టీవీ యాజమాన్యంపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదును అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాజధాని అభివృద్ధి పనులు జరుగుతుండగా చూడలేని వారు రాజధాని ప్రాంతంలో ఉంటున్న మహిళలపై అగౌరవపరిచే విధంగా కెఎస్ఆర్ లైవ్ షోలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలని ఆయన కోరారు. అనంతరం ఒన్‌టౌన్ సిఐకు వినతిపత్రం అందజేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుక

పెదనందిపాడు, జూన్ 10, ప్రభాతవార్త: ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాతబస్టాండ్ సెంటర్‌లో టిడిపి గ్రామ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో



ప్రత్తిపాడు ఐటిడిసి కార్యదర్శి దివి నాగరాజు సహకారంతో ఘనంగా జరిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కొండపాటూరు నాగేశ్వరరావు, గంటి శ్రీనివాసు, నిమ్మగడ్డ సత్యనారాయణ, నూతి శ్రీనివాసరావు, బాలయ్య అభిమానులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా వీర్లంకమ్మతల్లి కొలుపులు



పెదనందిపాడు, జూన్ 10, ప్రభాతవార్త: రజకపాలెంలో వేంచేసియున్న శ్రీవీర్లంకమ్మతల్లి ఆలయంలో మంగళవారం కమిటీ ఆధ్వర్యంలో కొలుపులు జరిగాయి. పల్నాడు ఆచారం ప్రకారం నిర్వహించటం జరుగుతుందని ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు కాకుమాను బుర్రయ్య, కాకుమాను బ్రహ్మం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఊరేగింపు జరిపారు. సమీప ప్రాంతాల నుంచి ఆచారవంతులు హాజరయ్యారు. జాతర కార్యక్రమాల్లో పుసులూరి కృష్ణ, పుసులూరి పోతురాజు, అంగలకుదురు నాగేశ్వరరావు, అజయ్, కాకుమాను నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఏడుకొండలు, మస్తాన్‌రావు, వెంకట్రామయ్య, పుసులూరి రమేష్ పాల్గొన్నారు.

## రైతు బజార్ వద్ద బారికేడ్లను తెరిచి ప్రజలకు వెసులుబాటు కల్పించండి : శాసనసభ్యులు గద్దె

విజయవాడ క్రైం,జూన్ 10,ప్రభాతవార్త: కృష్ణలంక,రైతుబజార్ వద్ద బారికేడ్లను తెరిచి ప్రజలకు వెసులుబాటు కల్పించేలా చేయాలని తూర్పు నియోజక వర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ కోరారు. మంగళవారం ఆయన నేషనల్ హైవే అధికారులతో పాటు,కృష్ణలంక సిఐ నాగరాజుతో ట్రాఫిక్ నియంత్రణ,ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించడానికి ప్రత్యేకంగా సమావేశ



మయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణలంక ప్రాంతంలో సుమారు లక్ష మందికి పైగా ప్రజలు ప్రమాదకరమైన జాతీయ రహదారిని నిత్యం దాటుతూ ఉంటారని, దాటే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సత్యం గారి హోటల్,రైతుబజార్ వద్ద బారికేడ్లతో దారి మూసివేయడం వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని,కావున అక్కడ వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు డ్రమ్ములను అక్కడ ఉంచి వాటికి రేడియం స్టిక్కర్లను అంటించడం ద్వారా వాహనాల వేగం తగ్గుతుందని దీనివల్ల ప్రమాదాల నివారణ చాలా వరకూ సాధ్యమవుతుందని,ఆ దిశగా ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులను కోరారు. రైతు బజార్ వద్ద ఉన్న బారికేడ్లను రాత్రి 9 గంటలకు మూసివేసి,ఉదయం 6 గంటలకు తిరిగి తెరచే విధంగా చేయడం వల్ల స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులకు సూచించారు. సత్యం గారి హోటల్,నేతాజీ సుభాష్‌చంద్రబోస్ బ్రిడ్జి వద్ద సబ్‌వేలు నిర్మాణం చేస్తే ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.రాణీగారితోట నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వద్ద ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయడం లేదని, వాటిని పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారును ఆదేశించారు. ప్రజలకు ఏమాత్రం అసౌకర్యం కల్గకుండా చూడటం కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్థానిక టిడిపి నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు,వేముల పల్లి రంగారావు,కేశనం భవన్నారాయణ,కొర్రా అప్పన్న,పెద్ది అన్నారావు,జనసేన నాయకులు కొవ్వూరి కిరణ్,తోట శ్రీనులతో పాటు కూటమి పార్టీ నాయకులు,కార్యకర్తలు శాసనసభ్యులు గద్దెతో పాటు పాల్గొన్నారు.

## 'బదలీల్లో అన్యాయం' ...



విజయవాడ సిటీ, జూన్ 10, ప్రభాతవార్త: నీటీపారుదలశాఖలో అతి కీలకమైన లాక్ సూపరింటెండెంట్ వ్యవస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు బదలీల విషయంలో అన్యాయం జరుగుతుందని ఏ.పి ఇరిగేషన్ లాక్ సూపరింటెండెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు.మంగళవారం ముత్యాలంపాడులోని తమ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాత్రి, పగలనక 24 గంటలు నీటీ పారుదలశాఖ అధికారులకు అందుబాటులో ఉంటూ నీటి సరఫరా చేస్తూ, విషసర్పముల మధ్య విధులు నిర్వహిస్తున్న తమకు బదలీల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. గత నెలలో ముగిసిన బదలీల్లో కొంతమందికి అన్యాయం జరిగిందని, ఈ బదలీల జి.ఓ ఇచ్చిన ఇరిగేషన్ సర్కిల్ సూరింటెండెంట్ ఇంజనీర్‌కు తమ యూనియన్ సభ్యులు మెమోరాండం ఇచ్చినా ప్రయోజనం జరగకపోవడం తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. సమావేశంలో డివిజనల్ కార్యదర్శి దావీదు, జాయింట్ సెక్రటరీ వి.నాగేశ్వరరావు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు 'జనసేన' ఆధ్వర్యంలో బీమా చెక్కుల పంపిణీ



తెనాలి, జూన్ 10 ,ప్రభాతవార్త : నియోజకవర్గంలోని కొలకలూరు, ఖాజీపేట గ్రామాలకు చెందిన జనసేన కార్యకర్తలు గమిడి ఏడుకొండలు, వెలివల మహేష్‌బాబు ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబాలను జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్వయంగా పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తరపున రూ.5లక్షలు చొప్పున ప్రమాద భీమా చెక్కులను కుటుంబ సభ్యులకు మంత్రి మనోహర్ అందజేశారు. మంత్రి మనోహర్ వెంట ఆ పార్టీ జిల్లా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి-సంక్షేమం కూటమి ధ్యేయం: ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు, జూన్ 10,ప్రభాతవార్త: అభివృద్ధి-సంక్షేమం రెండు కళ్ళుగా భావించి కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. చేబ్రోలు మండల పరిధిలోని సుద్దపల్లి గ్రామంలో పలు ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో విధ్వంసం తప్ప అభివృద్ధి లేకుండా



పోయిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి అని నమ్మిన టిడిపి అందుకు కట్టుబడి పనిచేస్తోందన్నారు. అందులో భాగంగానే టిడిపి అధికారంలోకి వచ్చిన సంవత్సరకాలంలోనే సుద్దపల్లి గ్రామంలో నూతన సచివాలయ భవనం, సిమెంట్ రోడ్ల ప్రారంభోత్సవాలు చేసుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా సీసి డ్రెయిన్లు, మంచినీటి బోర్లు కూడా ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. పాఠశాలకు సంబంధించిన అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంఖుస్థాపన చేయడం జరిగిందన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి త్వరితగతిన గదుల నిర్మాణం చేపట్టాలన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేసిందన్నారు. అయినప్పటికీ విజన్ ఉన్న మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంక్షేమాన్ని, అభివృద్ధిని కొనసాగిస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలన్నదే టిడిపి ప్రభుత్వం యొక్క ఆలోచన అని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసశర్మ, ఎంపిడిఓ టి.ఊహారాణి, జనసేనపార్టీ నియోజకవర్గ నాయకుడు వడ్రాణం మార్కండేయబాబు, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు మైలా వెంకట రామరాజు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి దాతలు ముందుకు రావాలి

పొన్నూరు, జూన్ 10,ప్రభాతవార్త: అంజుమన్ కమిటి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అంజుమన్ షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని అంజుమన్ కమిటి అధ్యక్షుడు మగ్బుల్‌బేగ్ కోరారు. స్థానిక అంజుమన్ కమిటి కార్యాలయంలో షాపింగ్ నిర్మాణానికి ప్రముఖ న్యాయవాది స్వర్గీయ షేక్ అబ్దుల్ అజీజ్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి రూ.లక్ష విరాళం కమిటి అధ్యక్షుడు మగ్బుల్‌బేగ్‌కు అందజేశారు. షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణం పూర్తి అయితే షాపులను అద్దెకు



ఇస్తే వాటిపై వచ్చే ఆదాయాన్ని పేద ముస్లింల అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చుచేసే అవకాశం ఉంటుందన్నారు. అందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. అజీజ్ కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి విరాళం అందజేయడం సంతోషమన్నారు. ఈ సందర్భంగా అంజుమన్ కమిటి దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ బేరర్స్ షేక్ బాజ్జి, మహమ్మద్ గౌస్, షేక్ మౌలాలి, షేక్ అబ్దుల్ మజీద్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

## జీవో నెంబరు 36 అమలు చేయాలి: సీఐటియు గౌరవాధ్యక్షుడు రమేష్‌బాబు

పొన్నూరు, జూన్ 10,ప్రభాతవార్త: మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబరు 36 అమలు చేసి, తద్వారా జీతాలను చెల్లించాలని సిఐటియు గౌరవాధ్యక్షుడు నిమ్మకూరి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జీవో నెంబరు 36 ప్రకారం



రూ.21వేలు, రూ.24,500/- జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతేకుండా షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. వయో పరిమితిని 62సంవత్సరాలకు పెంచి రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.7లక్షలు, దహన సంస్కారాలకు రూ.20వేలు ఇచ్చేవిధంగా జీవోలను జారీ చేయాలన్నారు. రిటైర్మెంట్ అయిన, చనిపోయిన, అనారోగ్యం పాలైన వారి స్థానంలో వారి బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యూటి అమలు చేయాలన్నారు. చట్టబద్దమైన సెలవులను కూడా కార్మికులకు అమలు చేయాలన్నారు. కిట్లు, భద్రతా పరికరాలు సకాలంలో అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, ఉమాశంకర్, ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

## 'రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలి'



పొన్నూరు, జూన్ 10,ప్రభాతవార్త: రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఫిరోజ్‌ఖాన్ కోరారు. ఈ నెల 11వ తేదీన ఉదయం 9గంటలకు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ శిబిరంలో యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తాన్ని దానం చేయాలని కోరారు. రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదానం చేసినట్లేనన్నారు. కోవిడ్ సందర్భంగా రాష్ట్రంలో, దేశంలో ఉన్న రక్తం నిల్వలు నిండుకున్నాయన్నారు. యువత ముందుకు వస్తే మళ్ళీ రక్తం నిల్వలను పెంచేందుకు అవకాశం ఉంటుందన్నారు.

## తిరువూరు బస్టాండులో నూతన ఫ్యాన్లు




తిరువూరు, జూన్ 10, ప్రభాతవార్త :ఎపిఎస్ఆర్టీసి తిరువూరు బస్టాండులో ప్రయాణీకుల సౌకర్యార్థం నూతనంగా తక్కువ విద్యుత్‌ను వినియోగించే అధునాతన బిఎల్‌డిసి ఫ్యాన్‌లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ వారు సామాజిక బాధ్యతలో భాగంగా మొదటి విడతగా పంపిణీ చేసిన 11 ఫ్యాన్స్‌ను తిరువూరు డిపో పరిధిలోని తిరువూరు బస్‌స్టేషన్‌లో అమర్చడం జరిగినది. ఆ క్రమంలో తిరువూరు ఎపిఎస్ఆర్టీసి డిపో మేనేజర్ ఎ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ఈ ఫ్యాన్‌ల వల్ల విద్యుత్ వినియోగం తగ్గి పరోక్షంగా పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. అధునాతన అత్యుత్తమ ఫ్యాన్‌లు సరఫరా చేసిన ఎపిఎస్ఇసిఎం వారికి డిపో మేనేజర్ ఎ సుబ్రహ్మణ్యం కృతజ్ఞతలు తెలిపారు.

## రైల్వే ఇండస్ట్రీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదం ...యాజమాన్యం నిర్లక్ష్యం


ఎ కొండూరు, జూన్ 10, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం ఎ కొండూరు క్రాస్ రోడ్డు సమీపంలో ఎ కొండూరు నుండి (ఎంఎన్‌కె) రాష్ట్ర రహదారి పక్కన కుమ్మరికుంట్ల పంచాయతీలో ఉన్న ఒక వ్యాపారవేత్తకు చెందిన రైస్ ఇండస్ట్రీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణం పూర్తిగా యాజమాన్యం అగ్ని ప్రమాదానికి సంబంధించిన ముందస్తు హెచ్చరికలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రైస్ ఇండస్ట్రీలో ప్రమాదం జరిగిందని ఈ ప్రాంత రైతులు తెలిపారు. ప్రభుత్వం రైతులకు గన్నీ బ్యాగ్స్ సరఫరా చేయడంతో ఒకపక్క రైతులకు అన్యాయం జరుగుతుండగా ఈ రైస్ ఇండస్ట్రీ యజమాని వద్ద లక్ష గన్నీ బ్యాగ్స్ నిల్వ ఉండడం ఆ బ్యాగులు విద్యుత్ ప్రమాదంతో పూర్తిగా బూడిదవ్వడం వల్ల సుమారు రూ.30 లక్షల విలువ గల ఆస్తి నష్టం జరగడం పూర్తిగా యాజమాన్య నిర్లక్ష్య ధోరణి వల్ల జరిగిందని ఈ ప్రాంత రైతులు ఆరోపించారు. ఇకనైనా ఈ ప్రమాద నిర్లక్ష్యానికి కారణమైన యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## మాజీ మంత్రి జవహర్ దంపతులను కలిసిన నేతలు



ఎ కొండూరు, జూన్ 10, ప్రభాతవార్త : రాష్ట్ర మాజీమంత్రి, ఏసిస్టేట్ ఎస్సీ కమీషన్ చైర్మన్ తిరువూరు మండలం గానుగపాడు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు కెఎస్ జవహర్, ఉష దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా తిరువూరు నియోజకవర్గ టిడిపి మహిళ ప్రధాన కార్యదర్శి ఎ కొండూరు మాజీ సర్పంచ్ బలుమూరి నాగపద్మ శుభాకాంక్షలు తెలిపారు.

## ఖాదర్‌వలీ బాబా దర్బార్‌లో ఘనంగా షరీఫ్



ఎ కొండూరు, జూన్ 10, ప్రభాతవార్త : అలుపెరుగని అన్నదాత విశ్రమించని ప్రదాత సూఫీ ఆధ్యాత్మిక శిఖరం షహిన్‌షాబాబా విజయనగరం బాబా మెట్టలో వేంచేసి ఉన్న హజరత్ ఖాదర్ వలీ బాబా (ర.అ) వారి ప్రియశిష్యులు సూఫీ ఖ్వాజా ముహమ్మద్ అతావుల్లా బొగ్దాది ఔలియా వారి చాన్‌కే 13వ షరీఫ్ ధార్మిక కార్యక్రమాన్ని మంగళవారం దర్గా ముతవల్లి డాక్టర్ ఎండి ఖలీల్‌బాబు అతావుల్లా బాబా వారి తనయుడు ఆధ్వర్యంలో భక్తి శ్రద్దలతో నిర్వహించారు. డాక్టర్ ఖలీల్ బాబు, ఎ కొండూరు మండలం చీమలపాడు ఎఎంటికె దర్బార్ పీఠాధిపతి పీర్‌జాదా ఖాజా మొహియుద్దీన్‌కు విజయనగరం దర్బార్ నుండి చరవాణి ద్వారా మాట్లాడుతూ విజయనగరం చీమలపాడు దర్బార్‌లు విశ్వమానవ కళ్యాణానికి వేదికలుగా విరాజిల్లుతున్నాయని తెలిపారు.

## కొమ్మినేని శ్రీనివాసరావుకు 14రోజుల రిమాండ్

### --గుంటూరు సబ్‌జైలుకు తరలింపు

మంగళగిరి,జూన్ 10,ప్రభాతవార్త : సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును పోలీసులు అరెస్టు చేసి మంగళవారం ఉదయం మంగళగిరి న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టారు.న్యాయమూర్తి కొమ్మినేని శ్రీనివాసరావుకు 14రోజుల రిమాండ్‌ను విధించారు.పోలీసులు కొమ్మినేని పై పలు సెక్షన్‌లపై కేసు నమోదుచేయగా ఇందులో ఎస్సీ,ఎస్టీ యాక్టు 356(2)ను న్యాయమూర్తి తొలగించారు.ఎస్సీ,ఎస్టీ



యాక్టు ఈ కేసుకు ఎలా వర్తిస్తుందని పోలీసులను న్యాయమూర్తి గట్టిగా ప్రశ్నించారు.గతంలో ఓసారి చెప్పినా మళ్ళీ ఇవే సెక్షన్లు మరలా మరలా ఎలా పెడతారని న్యాయమూర్తి డిఎస్పీని ప్రశ్నించినట్లు తెలుస్తుంది.ఎస్సీ ఎస్టీ యాక్ట్ చట్టాని ఇందులో ఎందుకు చేరా ్చరు.స్పష్టమైన సమాచారం తనకు ఇవ్వాలని డిఎస్పీని ఆదేశించారు.విచారణ సమయంలో కొమ్మినేని న్యాయమూర్తిని తన వయస్సు రీత్యా కొన్ని ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని కోరగా,న్యాయమూర్తి ఇందుకు తిరస్కరించారు.అనంతరం కొమ్మినేని భారీ బందోబస్తు నడుమ గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

**కొమ్మినేని అరెస్టు దుర్మార్గం:**

సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు దుర్మార్గం,కక్షపూరితమని,సాక్షి మీడియాను టార్గెట్ చేసిన సీఎం చంద్రబాబు,నిజాయితీగా పనిచేసే జర ్నలిస్టును వేధించడం దారుణమని వైసీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు.మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు.జర్నలిస్టు కృష్ణంరాజు వ్యాఖ్యలతో 'సాక్షి'కి సంబంధం లేకపోయాని వైఎస్ జగన్,ఆయన సతీమణి భారతిని తిట్టడం ఏంటని ఆయన ప్రశ్నించారు.కూటమి పాలన వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే కొమ్మినేనిని అరెస్టు చేశారని విమరి ్శంచారు.వైసీపీ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి,మాజీ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డిని కలసి కొమ్మినేని పై టిడిపి బనాయించిన కేసులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## కాజలో వేడుకగా ఏరువాక పౌర్ణమి

### --ఉండ్రాళ్ళ ప్రసాదాన్ని పంపిణీ చేసిన పెదకాపులు

తాడేపల్లి,జూన్ 10,ప్రభాతవార్త : ఏరువాక పండుగను మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కాజరైతులు మంగళవారం సాయంత్రం సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహల మధ్య జరుపుకొన్నారు.కులవర్గ రహితంగా జ్యేష్ఠమాసం పౌర్ణమి రోజున ఏరువాక జరుపుకోవడం కాజలో పూర్వంనుంచి ఆనవాయితీగా వస్తుంది. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన ఈ ప్రాంత ఆడపడుచులు కుటుంబాలతో సహా ఏరువాక ఉత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చారు.ఎరువాక ఉత్సవంతో కాజలో కోలాహలం నెలకొంది.ఆలయ పరిసరాలన్నీ భక్త జనులతో నిండి పోయాయి.కాజలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిరత్నగర్భ విఘే ్నశ్వరస్వామి విగ్రహం వద్దకు స్థానికులందరూ తరలివచ్చి పూజలు నిర్వహించి టెంకాయలు సమర్పించారు.స్వామివారికి మొదటి నైవేద్యం పెట్టి ఆ ఉండ్రాళ్ళ ప్రసాదాన్ని పెదకాపులు సింహాద్రి వెంకటరామిరెడ్డి, కుక్కల కోటేశ్వరరావు, బొమ్మ పిచ్చిరెడ్డి,చెన్నం శ్రీనివాసరావులు స్వహస్తాలతో భక్తులకు పంపిణీ చేశారు.ఉండ్రాళ్ల ప్రసాధం స్వీకరించేందుకు భక్తులు పోటీపడ్డారు.



విఘ్నేశ్వరుని సన్నిధిలో వృషభ పూజ జరిపి ట్రాక్టర్లు,నాగళ్ళు,ఎడ్లబండ్లు,వ్యవసాయ ఉపకరణాలు,అరకలు కట్టి పసుపు,కుంకుమలురాసి గుడి వద్దకు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఏరువాక సాగారోరన్నో ...చిన్నన్నలంటూ రైతులు ఉత్సాహభరిత వాతావరణంలో లాంఛనంగా దుక్కిదున్నారు.ఆలయ ప్రాంగణంలో రైతులు మారెళ్ళ సత్యమారెడ్డి చక్రపొంగలి,పులిహోర,బొమ్ము పిచ్చిరెడ్డి,శ్రీనివాసరెడ్డి లడూ ్డ,వడ ప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారు.ఏరువాక పండుగను పురస్కరించుకొని ఏర్పాటుచేసిన పలుసాంస్కృతిక ప్రదర్శనలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు.బాలభక్త బృందం భజన సమాజం,కాజలోని కోలాట బృందం,బాలల సంఘం,ప్రజాసాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించాయి.విద్యుత్‌ప్రభ విశేష ఆకర్షణగా నిలిచింది.కాజలో ఏరువాక ఉత్సవం తిరునాళ్ళను తలపించింది.ఎఎంసీ చైర్మన్ జవా ్వది కిరణ్‌చందు,టిడీపి నేతలు గాదె పిచ్చిరెడ్డి,కళ్ళం రాజశేఖరరెడ్డి,పల్లబోతుల శ్రీనివాసరావు,తోట పార్థసారధి,నందం అబద్దయ్య,వివిధ పార్టీల నేతలు పాల్గొని పూజలు జరిపారు.

## అన్న క్యాంటీన్లలో పరిశుభ్రమైన వాతావరణం ఉండాలి : కమీషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్,జూన్ 10,ప్రభాతవార్త: నగరంలోని అన్ని అన్నా క్యాంటీన్ల లోనూ పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పాలని,ఆహారం ఉన్న చోట ఈగలు,అపరిశుభ్రమైన వాతావరణం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ ఉండాలని, త్రాగునీటి, వాడుకనీటి సరఫరా నిరంతరం ఉండేటట్లు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆయన తన పర్యటనలో భాగంగా కనకదుర్గ



నగర్,పటగమట,మహానాడు రోడ్డు,పంట కాలువ రోడ్డులను పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో అన్నా క్యాంటీన్ పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని,పటమట లోగల అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన ఆయన సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా డీ-సిల్టింగ్ పనులను శరవేగంగా చేయాలన్నారు. ఒకవేళ డ్రైనులు అన్నింటిలోనూ డీ సిల్టింగ్ పనులు పూర్తయిన్పటికీ అవసరమైన ప్రతి డ్రైన్‌లో మరలా డీ సిల్టింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కనకదుర్గనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్‌ను ఆయన పరిశీలించారు. నిర్మాణ పురోగతి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ని అడిగి తెలుసుకొని ఎటువంటి ఇబ్బందులు ఉన్న సమస్యలు ఉన్న వెంటనే తమకు తెలియచేయాలన్నారు. పంట కాలువ రోడ్డు,మహానాడు రోడ్డులో పర్యటించి పారిశుధ్ధ నిర్వహణ పరిశీలించారు. రోడ్డుపైన వ్యర్థాలు ఉండకుండా వెంటనే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ప్రతి రోజు రోడ్లను శుభ్రపర్చాలని విజయవాడ నగరాన్ని పరిశుభ్రమైన నగరంగా ఉంచాలన్నారు. ఈ పర్యటనలో ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్,పర్యవేక్షక ఇంజనీర్ పి.సత్యన్నారాయణ,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సామ్రాజ్యం,బయాలజిస్ట్ సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అజెండా విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలి : కమీషనర్ ధ్యానచంద్ర



విజయవాడ కార్పొరేషన్,జూన్ 10,ప్రభాతవార్త: విజయవాడ నగరాభివృద్ధికి,ప్రజాప్రతినిధులు పొందుపర్చిన సాధారణ సర్వసభ్య సమావేశపు అజెండాలో అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ప్రధాన కార్యాలయం లోని కమాండ్ కంట్రోల్ రూంలో రానున్న సర్వసభ్య సమావేశం లోని అజెండా విషయాలపై శాఖాధిపతులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజెండాలోని అంశాలను పరిశీలించి,వాటిపై ప్రస్తుతమున్న స్థితిగతులు, తెలుసుకోవాల్సిన చర్యలు పూర్తి స్థాయిలో తెలుసుకోవాలని అన్నారు. జోన్ వారి అభివృద్ధి పనులు,ప్రజలకు అందించాల్సిన మౌలిక సదుపాయాలు అందించే కౌన్సిల్ ఎజెండా ప్రతిపాదనలకు సహకరించాలన్నారుప.

## ఏపి ప్రభుత్వ భాగస్వామ్యంతో ఫ్లిప్‌కార్ట్ వర్క్‌షాప్

విజయవాడ, జూన్ 10, ప్రభాతవార్త : స్థానిక చేతివృత్తుల కళాకారులు, నేత కార్మికులు, మహిళా వ్యవస్థాపకులు, స్వయం సహాయక బృందాలకు దేశంలో పెరుగుతున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగం కావడానికి వీలుగా ఆన్‌బోర్డింగ్ వర్క్‌షాప్‌ను తాము ఏపి ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్వహించినట్లు ఫ్లిప్‌కార్ట్ కార్పొరేట్ ఎఫైర్స్ ఆఫీసర్ రజనీష్‌కుమార్ తెలిపారు. దీనిద్వారా వారు తమ వ్యాపారాలను ఆన్‌లైన్లో పెంచుకునే పరిజ్ఞానం అందించామన్నారు.

## సంగీత ప్రియులను అలరిస్తున్న 'కన్నె'లో మాటలకందని భావాలెన్నో

విజయవాడ, జూన్ 10, ప్రభాతవార్త : స్వర మాంత్రికుడు సిద్ శ్రీరాం సరికొత్త గీతం 'కన్నె' ద్వారా మాటలకందని భావాలను పలికించి సంగీత ప్రియుల మనసులు చూరగొన్నారు. ఈనెల 6న వార్నర్‌మ్యూజిక్ విడుదల చేసింది. ఏప్రిల్‌లో భక్తిగీతం 'శివనార్' విడుదలైంది.

## ఏపిలో ర్యాపిడో కార్యకలాపాల నిర్వహణ

విజయవాడ, జూన్ 10, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్‌లో 14 కొత్త నగరాల్లో బైక్ టాక్సీ, ఆటో సేవలను ప్రారంభించినట్లు ర్యాపిడో ప్రతినిధులు తెలిపారు. ఒంగోలు, విజయనగరం, ఏలూరు, మదనపల్లె, మచిలీపట్నం, చిత్తూరు, శ్రీకాకుళం, భీమవరం, గుడివాడ, నరసరావుపేట, నంద్యాల, తెనాలి, తాడేపల్లిగూడెం, తాడిపత్రిల్లో యాప్ ఆధారిత మొబిలిటి సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. దేశవ్యాప్తంగా 500 నగరాల్లో విస్తరిస్తామన్నారు.

## విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయండి: ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



మాచర్ల, జూన్ 10 (ప్రభాతవార్త): మాచర్ల నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా సాగిన ఏడాది పాలనకు చాటి చెప్పేలా నిర్వహిస్తున్న విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మంగళవారం కూటమి శ్రేణులు పిలుపునిచ్చారు. ఈ నెల 12 గురువారం ఉదయం 9.30 గంటలకు స్థానిక శ్రీశైలం రోడ్డులోని ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి పార్కు సెంటర్ వరకు సాగనున్న భారీ ర్యాలీకి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి కూటమి ఘన విజయం సాధించి, ఏడాది పాలనలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## వర్క్‌షాపును సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే

మాచర్ల, జూన్ 10 (ప్రభాతవార్త): మాచర్లలో బుధవారం ఏర్పాటు చేయనున్న వర్క్‌షాపును సద్వినియోగపర్చుకోవాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. యువతకు పెద్దఎత్తున ఉపాధి కల్పన, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సీడ్-ఏపీ, స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూనగర్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే వర్క్‌షాపులో వ్యవసాయం, ఉద్యానవన, పరిశ్రమలు, పశుసంవర్థక రంగాల్లో పరిశ్రమలను స్థాపించుకునేలా గల సాధ్యాసాధ్యాలు, పెట్టుబడులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం, సబ్సిడీలు, బ్యాంకు రుణాలు వంటి అనేక అంశాలపై నిపుణులు అవగాహన కల్పించడంతోపాటు తగిన సలహాలు, సూచనలు ఇస్తారని పేర్కొన్నారు. వర్క్‌షాపును ఉత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

## మాచర్లలో ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు

మాచర్ల, జూన్ 10 ప్రభాతవార్త: సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 65వ జన్మదిన వేడుకలు మాచర్ల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. నందమూరి బాలకృష్ణ అసోసియేషన్ అధ్యక్షులు గాజుల చెన్నయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గాజుల చెన్నయ్య మాట్లాడుతూ సినీ రంగంలో చరిత్ర సృష్టించడమే కాకుండా, తనదైన శైలిలో రాజకీయంలో కూడా ప్రతిభ చూపి, హిందూపురం ఎమ్మెల్యేగా మూడుసార్లు విజయం సాధించారన్నారు. ఇలాంటి జన్మదిన వేడుకలు బాలయ్య మరెన్నో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. క్యాన్సర్ రోగుల కోసం బసవతారక వైద్యశాలను కొనసాగించడం అభినందనీయమన్నారు. మాచర్లలో నందమూరి బాలకృష్ణ అసోసియేషన్ అధ్యక్షునిగా 25 సంవత్సరాలుగా



కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. 25 ఏళ్ల నుంచి సహకరిస్తున్న కమిటీ సభ్యులకు, నందమూరి అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో పలువురు రోగులకు కాయలు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి కె.పి. రావు, షేక్ అబ్బుల్ల, షేక్ ఫరీద్, పలసా వెంకన్నబాబు, షేక్ నాగూర్‌వలి, గొడుగు శ్రీను, షేక్ ఖలీల్, ఉప్పుతోళ్ల అంజి, మేళ్ళవాగు గురులింగం, షేక్ ఖాసిం, తాళ్ల మణికంఠ, నాగరాజు, అక్కెం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అసభ్యంగా మాట్లాడిన వారిని కఠినంగా శిక్షించాలంటూ భారీ ర్యాలీ

మాచర్ల, జూన్ 10 ప్రభాతవార్త: మాచర్ల పట్టణంలో మహిళలు కదం తొక్కారు. సమాజం నుంచి జగన్‌రెడ్డి అవినీతి మీడియా సాక్షిని సాగనంపాలని, సాక్షి ఛానెల్‌లో ఏపీ రాజధాని పట్ల, మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడిన జర్నలిస్టులను, అలా మాట్లాడించిన యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక వద్ద ఓన్ని సెంటర్ నుంచి



బస్టాండ్ సెంటర్ వరకు సాగిన ఈ నిరసన ర్యాలీలో కూటమి పార్టీల మహిళా నేతలు, స్వచ్ఛంద సంఘాల మహిళలు పెద్దఎత్తున పాల్గొని నినదించారు. సాక్షి ఛానెల్, పత్రికను తక్షణం ఏపీలో నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో సాక్షి పత్రిక ప్రతులను దగ్ధం చేసి ఆందోళనకు దిగారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, మాచర్ల పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ మదార్ సాహెబ్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ యర్రాకుల సిద్దమ్మ, మున్సిపల్ కౌన్సిలర్లు, యెనుముల కేశవరెడ్డి, మద్దిగపు చినవెంకటరామిరెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు

కారంపూడి, జూన్ 10 ప్రభాతవార్త: హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత నందమూరి బాలకృష్ణ 65వ పుట్టినరోజు వేడుకలు కారంపూడిలో టౌన్ మాజీ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి పంగులూరు పుల్లయ్య మాట్లాడుతూ రాజకీయ జీవితంలోనూ, సినీ జీవితంలోనూ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుని ఓటమి ఎరుగని, అలసిపోని ఎప్పటికీ బాలనటుడిగా అనిపించే నందమూరి బాలకృష్ణకి శుభాకాంక్షలు తెలియజేస్తున్నా మంటూ కేక్ కట్ చేశారు. అనంతరం దాదాపు 200 మంది పిల్లలకు పెన్నులు, పుస్తకాలు అందజేశారు. పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గోళ్ల సురేష్, చప్పిడి రాము, మునుగోడు సత్యం, మహిళా అధ్యక్షురాలు కాటంరెడ్డి నాగలక్ష్మిరెడ్డి, కారంపూడి సర్పంచ్ సరస్వతి బాయి బాలునాయక్, సాగినబోయిన నాగరాజు, రాజధాని శ్రీను, కూటమి నాయకులు పాల్గొన్నారు.



## వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, జూన్ 10 ప్రభాతవార్త : సత్తెనపల్లి రూరల్ మండల పరిధిలోని మారిశెట్టి వారి వివాహ వేడుకకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ శుభాకాంక్షలను తెలియజేశారు. గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు కన్నా వెంట ఉన్నారు.





### ఘనంగా బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు...

నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను పట్టణంలోని రఘురాంనగర్ ప్రజావేదిక నందు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం కార్యకర్తలకు, నాయకులకు మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బాలకృష్ణ ఇలాంటి పుట్టిన రోజు వేడుకలను మరెన్నో జరుపుకోవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేఎన్ఆర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో అనాధాశ్రమంలో అన్నదానం

రాజుపాలెం, జూన్ 10 ప్రభాతవార్త : హిందూపురం ఎమ్మెల్యే, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, ప్రముఖ సినీనటుడు, బసవ తారకం క్యాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ 65వ జన్మదినాని అనాధాశ్రమంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పిడుగురాళ్ళ పట్టణంలో కె.ఎన్.ఆర్. విద్యాసంస్థలు, కొండమోడు పిఎస్ఆర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్స్ కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్‌రావుల ఆధ్వర్యంలో బాలకృష్ణ జన్మదిన కేక్‌ను కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ముందుగా వారు బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా కొండమోడు వీరమ్మ కాలనీలో ఉన్న దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నడపబడుతున్న అనాథ పిల్లల, వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్స్ కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్‌రావులు మాట్లాడుతూ బాలకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా అనాథలకు అన్నదానం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. బాలకృష్ణ నిండు నూరేళ్ళు ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని భగవంతుణ్ణి వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ యాంటీ క్రైమ్ డైరెక్టర్ కోనేటి నరసింహారావు, దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆశ్రమ నిర్వాహకులు, నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా ఏపి కోఆర్డినేటర్ గరికపాటి శంకరరావు పాల్గొన్నారు.



### బ్లాక్ బెర్లీ పొగాకును ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా

# ప్రభుత్వమే కొనుగోలు

బాపట్ల,జూన్10,ప్రభాతవార్త: బ్లాక్ బెర్లీ పొగాకును ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ప్రకటించారు. చీరాల మండలం పేరాలలోని ఏపీ మార్క్ ఫెడ్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములో నూతనంగా ఏర్పాటుచేసిన బ్లాక్ బెర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వెంకట మురళి, చీరాల శాసనసభ్యులు ఎం మాల కొండయ్య కలిసి రిబ్బన్ కత్తిరించి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నష్టపోతున్న రైతులను ఆదుకోవడానికే ఏపీ మార్క్ ఫెడ్ ని ప్రభుత్వం రంగంలోకి దించిందన్నారు. కంపెనీల



మాటలు నమ్మి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలోని రైతులు బ్లాక్ బెర్లీ పొగాకును సాగు చేసి మోసపోయారన్నారు.అలాంటి రైతుల క్షేమాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని బ్లాక్ బెర్లీ పొగాకును కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం చీరాల, పర్చూరు మండలాలలో రెండు కేంద్రాలను ప్రారంభించామన్నారు. మరో మూడు కేంద్రాలు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల వద్ద 7.48 లక్షల క్వింటాళ్ల పొగాకు ఉన్నట్లు గుర్తించామన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా 1.48 లక్షల క్వింటాళ్ల పొగాకును కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. ఈనెల 16 నుంచి విస్తృతంగా పొగాకు కొనుగోలు చేపడుతామన్నారు. చీరాల శాసనసభ్యులు ఎం మాలకొండయ్య మాట్లాడుతూ పొగాకు రైతులను ఆదుకుంటాం, వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.బ్లాక్ బెర్లీ పొగాకుకు గత ఏడాది క్వింటా ధర రూ.17 వేలు పలికిందని, ప్రస్తుతం రూ.7000లకు దిగజారటంతో రైతులు నష్టపోతున్నారని చెప్పారు. కంపెనీల మాట విని పొగాకు పంటను అధికంగా ఉత్పత్తి చేయడంతోనే ఈ సమస్య ఎదురయ్యిందన్నారు. రైతుల ఇబ్బందులను తొలగించడానికే మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు పొగాకును కొనుగోలు చేయడానికి యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ జీఎం కరుణశ్రీ, ఆర్డీవో చంద్రశేఖర్, తహసిల్దార్ గోపికృష్ణ పాల్గొన్నారు.

## మద్యం అక్రమ విక్రయాలు, నాటు సారా నిర్మూలించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి

బాపట్ల,జూన్10,ప్రభాతవార్త: మద్యం అక్రమ విక్రయాలు, నాటు సారా నిర్మూలించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. నాటు సారా నిర్మూలనపై నవోదయం 2.0 అవగాహన కార్యక్రమాలపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా తయారీని అధికారులు పూర్తి స్థాయిలో అరికట్టాలన్నారు. మద్యం అక్రమ విక్రయాలు జరిగితే చర్యలు తీసుకోవాలన్నారు. గోవా నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న మద్యంను అరికట్టాలని సూచించారు. చాక్లెట్లు, ద్రవపదార్థాల రూపంలో గంజాయి విక్రయాలు జరిగితే సహించేది లేదన్నారు. చీరాల మండలంలో తొమ్మిది గ్రామాలు, నగరం మండలంలో ఐదు గ్రామాలు, బాపట్ల మండలంలో రెండు గ్రామాలు, రేపల్లె మండలాలలో ఒక గ్రామంలో నాటు సారా ఉత్పత్తులు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. 17 గ్రామాలలో 65 కుటుంబాలు రహస్యంగా నాటు సారా ఉత్పత్తి చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటికే గడిచిన నాలుగు నెలలలో 43 కేసులు నమోదయాయని, 29 మందిని అరెస్టు చేశామన్నారు. ఆ కుటుంబాల వారిని వృత్తి నుంచి మాన్పించేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆ కుటుంబాలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాల వారికి పునరావాసం కల్పించి, డి అడిక్షన్ సెంటర్ల ద్వారా వైద్యం అందించాలన్నారు. ప్రజలలోనూ చైతన్యం తీసుకురావాలన్నారు. నాటు సారా ఉత్పత్తులను బాపట్లలో పూర్తిగా అరికట్టడానికి మండల, గ్రామస్థాయిలో కమిటీలు నియమించామన్నారు. ఈ కమిటీలు అత్యంత చురుగ్గా పనిచేయాలని మార్గనిర్దేశం చేశారు. మహిళా పోలీసులు, సచివాలయాల సిబ్బందిని కమిటీలలో చేర్చాలన్నారు. కళాజాతా బృందాలతో విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు ప్రజలలో నిర్వహించాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు లభిస్తాయని సూచించారు.ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ కమిషనర్ హేమంత్ నాగరాజు, ప్రొహిబిషన్ పర్యవేక్షణ అధికారి బి వెంకటేశ్వరరావు, కమిటీలోని వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మాజీ సైనికల భవిష్యత్తు కార్యాచరణ, ప్రణాళికలపై సమావేశం

కర్లపాలెం,జూన్10,ప్రభాతవార్త: మాజీ సైనికుల సంక్షేమం,అభివృద్ధిపై భవిష్యత్తు కార్యాచరణ మరియు ప్రణాళికలపై సమావేశం ఏర్పాటు చేయబడిందని రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు అన్నారు.మంగళవారం విజయవాడ పూర్ణానందపేట లోని ఫ్రీమాషన్ హాల్ బిల్డింగ్‌లో రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటి సభ్యులు భవిష్యత్తు కార్యాచరణ మరియు ప్రణాళికల పై రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన ప్రముఖ మాజీ సైనికులతో భేటీ నిర్వహించారు.ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం యొక్క మొదటి జనరల్ బాడి మీటింగ్ ను వచ్చే నెల 20 వ తేదీన అనగా 20 జులై 2025వ తేదీన అనంతపురంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి అని మరియు అనంతపురంలో జరిగే మొదటి జనరల్ బాడి మీటింగ్ లోనే రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న మాజీ సైనికుల నామినేటెడ్ పోస్టులకు ప్రమాణ స్వీకారం కూడా జరిపించాలి అని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. అడహక్ కమిటీ కన్వీనర్ గా వ్యవహరించిన కె గోవిందరావు పటిష్టంగా తయారు కాబడిన బైలా ను వివరించి, నామినేటెడ్ పదవుల విధివిధానాల గురించి వివరించారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ సూరెడ్డి శివకుమార్ స్వాగత సుమాంజలితో సభను ప్రారంభించి, సభ యొక్క ఉద్దేశాన్ని సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు పట్నం విశ్వేశ్వర రావు, ట్రెజరర్ ఉమా మహేశ్వరరావు, గౌరవాధ్యక్షులు అన్నే రామారావు, గౌరవ సలహాదారులు సుంకర శేషగిరి రావు, సీనియర్ మాజీ సైనికులు అడపా శంకర్, గురు ప్రసాద్ , గురాయ రెడ్డి, ఎస్ పాపారావు, శరత్ బాబు, రంగనాయకులు, సుంకి రెడ్డి, డి సత్యనారాయణ, భాస్కరరావు మహిళా సభ్యురాలు బి సీతాదేవి మొదలగువారు పాల్గొన్నారు.

### శ్రీగంగా భగీరథ సగర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ



తాడేపల్లి,జూన్ 10,ప్రభాతవార్త : శ్రీగంగా భగీరథ సగర సంక్షేమ సంఘం మరియు శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరీ సేవా ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో గౌతమబుద్ధా రోడ్డు వద్ద శ్రీగంగా భగీరథ సగర సంక్షేమ సంఘం కార్యాలయం ఎదుట శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరీ సేవా ట్రస్ట్ చైర్మన్,శ్రీగంగా భగీరథ సగర సంక్షేమ సంఘం అధ్యక్షులు పందేటి సాంబశివరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది.సుమారు 1000మందికి పైగా పాదాచారులు,వాహనదారులు,ఆర్టీసీ బస్సుల ప్రయాణికులకు చల్లటి మజ్జిగను ఉచితంగా పంపిణీ చేశారు.అనంతరం సంఘ అధ్యక్షుడు పందేటి సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఎమ్మెల్యే మరియు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో సేవాగుణంతో వేసవి నేపథ్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు ప్రారంభించిన నాటి నుండి గత రెండు నెలలుగా నిర్విరామంగా ప్రతిరోజు ప్రయాణికులకు ఉచితంగా చల్లటి మినరల్ వాటర్‌ను అందించడంతోపాటు దాతల సహకారంతో ప్రతి సోమవారం 1000మందికి పైగా ప్రయాణీకులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో సగర సంఘం అధ్యక్షులు పందేటి సాంబశివరావు,నంగళం ప్రసాదు,కర్నాటి శివసత్యనారాయణ,గండికోట వీరరాఘవులు,గండికోట అచ్చియ్య,పంచల శివన్నారాయణ,పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం,నల్లమోతు నాగరాజు,బేతపూడి మధుబాబు,రెడ్డి వీరరాఘవులు,నంధ్యాల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

### - 50 వేల మందికి పైగా సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థిక సాయం: మంత్రి గొట్టిపాటి

బాపట్ల,జూన్10,ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీట వేస్తుందని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. ముందుగా అద్దంకి పట్టణంలో రూ.1.50 కోట్లతో నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి గొట్టిపాటి, జిల్లా కలెక్టర్ వెంకట మురళి రిబ్బను కత్తిరించి ప్రారంభించారు.ఈ క్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నియోజకవర్గంలో ఐదు ఆరోగ్య కేంద్రాలు నెలకొల్పేందుకు అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. అద్దంకి పట్టణ పరిధిలో సుమారు రూ. 1.50 కోట్లు వెచ్చించి ఆసుపత్రిని నిర్మించినట్లు చెప్పారు. ఈ నెలాఖరుకి నియోజకవర్గం పరిధిలోని మరో 4 ఆరోగ్య కేంద్రాలను కూడా ప్రజలకు అందుబాటులోకి



తీసుకుని వస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గం ప్రజల కోరిక మేరకు మేదరమెట్లలో త్వరలోనే డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. గడిచిన ఏడాదిలో కాలంగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50,000 మందికి పైగా ఆర్థిక సాయం పొందారని మంత్రి పేర్కొన్నారు. అద్దంకి నియోజకవర్గంలో 700 మందికి పైగా సీఎంఆర్ఎఫ్ తో లబ్ధిపొందారని మంత్రి గుర్తు చేశారు.అనంతరం అద్దంకి మండలం గోవాడ గ్రామ పరిధిలో నామ్ రోడ్డు నుంచి గోవాడ గ్రామానికి రూ. 1.20 కోట్ల వ్యయంతో కొత్త నిర్మించిన తారు రోడ్డును ఆయన ప్రారంభించారు. తొలి దశలో రూ. 6 కోట్ల వ్యయంతో నియోజకవర్గంలో రోడ్లు వేశామని, మరో రూ. 7.5 కోట్లతో రెండో దశలో రహదారుల వేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.కేంద్ర నిధులను వైసీపీ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని మంత్రి గొట్టిపాటి ఆరోపించారు. పనికి ఆహార పథకం కింద వచ్చే నిధులను కూడా పక్కదారి పట్టించారని ఆయన వాపోయారు. అన్ని ప్రాంతాలకు తాగునీట సరఫరా, రోడ్ల నిర్మాణం, మరమత్తులతో పాటు మొత్తం 175 నియోజకవర్గాల పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందన్నారు. అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు.అనంతరం కొటికలపూడి పంచాయితీ, పార్వతీపురం గ్రామ పరిధిలో జల జీవన్ మిషన్ కింద సురక్షిత మంచినీటి పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి స్థానికులతో ఆత్మీయ సంభాషణ చేశారు.

## రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

బాపట్ల,జూన్10,ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు.రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు దాడులకు నిరసనగా మంగళవారం వైకాపా మహిళా విభాగం ఆధ్వర్యంలో వైసిపి పార్టీ కార్యాలయం నుండి డా బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై అఘాయిత్యాలు,అత్యాచారాలు అధికమయ్యాయని మహిళలకు రాష్ట్రంలో రక్షణ




కల్పించడంలో ప్రభుత్వం పూర్తి స్థాయిలో విఫలమైందన్నారు.ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం అయిందని,ఇచ్చిన హామిలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు.రాష్ట్రంలో ఏమ మూలన చూసినా మహిళలపై దాడులు జరుగుతున్నాయని రక్షణ కరువైందని,మహిళలు రోడ్లపై తిరగాలంటే భయపడే పరిస్థితి ఈ కూటమి ప్రభుత్వంలో ఏర్పడిందన్నారు.వైసిపి ప్రభుత్వం లోనే రాష్ట్రంలో మహిళలకు పూర్తి రక్షణ దొరికిందని జరుగుతున్న పరిణామాలను నివారించడంలో ప్రభుత్వం వెనకడుగు వేస్తూ నిర్లక్ష్య వైఖరిలో ఉందన్నారు.మహిళలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు మెరుగ నాగార్జున,వైసిపి నాయకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### చందోలు ఆలయాల ఈవో గా ఘంటసాల నియామకం



పిట్టలవానిపాలెం,జూన్10,ప్రభాతవార్త: బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో గల ప్రముఖ దేవాలయములకు కార్యనిర్వహణాధికారిగా ఘంటసాల నరసింహమూర్తిని రెగ్యులర్ బాధ్యతలు చేయు విధంగా దేవాదాయ శాఖ కమిషనర్ కే రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అదనపు బాధ్యతలు స్వీకరించిన ఘంటసాలకు ఇప్పుడు రెగ్యులర్ గా నియామకం చేశారు. పెద్దవరం గ్రూపు దేవస్థానములలో జూనియర్ సహాయకులుగా పనిచేయుచున్న నాగుల శ్రీనివాసరావును బదిలీపై చందోలు దేవాలయములకు బదిలీ నియామకపు ఉత్తర్వలను ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ కె..బి శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేసి ఉన్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి జి నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలియపరిచారు.

### వాహనదారుడు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలి



పిట్టలవానిపాలెం,జూన్10,ప్రభాతవార్త: ప్రతి వాహనదారుని వద్ద తప్పనిసరిగా వాహన ధ్రువీకరణ పత్రాలు ఉండాలని చందోలు ఎస్ ఐ ఎం వెంకట శివకుమార్ అన్నారు.మంగళవారం మండలపరిధిలోని రెడ్డిపాలెం టోల్ ప్లాజా సెంటర్ వద్ద చందోలు ఎస్ ఐ ఎం వెంకట శివకుమార్ వాహనాల తనిఖీ చేశారు.ప్రతి వాహనదారునివద్ద వాహన ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు.ప్రతి వాహనదారులు తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు కలిగివుండాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉండాలని, లేనిచో ఎంతటి వారి పైన అయినా చర్యలు తీసుకుంటామని వాహనదారులకు సూచించారు.అతని వెంట చందోలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెదకూరపాడులో నిరసన ర్యాలీ



పెదకూరపాడు, జూన్ 10 ప్రభాతవార్త : అమరావతి మహిళలను కించపరిచేలా మాట్లాడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నిరసన ర్యాలీని మహిళలు నిర్వహించారు. సాక్షి ఛానల్‌లో మహిళలను కించపరిచేలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వై.ఎస్.భారతీరెడ్డి ఒక మహిళ అయ్యిఉండి మహిళలను అవమానించారని తెలిపారు. వెంటనే ఆ సంస్థను మూసి వేయాలన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని మహిళలు అందజేశారు.

## ఝాన్సీలక్ష్మిబాయి వలే ధైర్యంగా ఉండాలి : ముంతాజ్



పెదకూరపాడు, జూన్ 10 ప్రభాతవార్త : మండల కేంద్రమైన పెదకూరపాడులో కిశోర వికాసం కార్యక్రమాన్ని చివరి రోజైన మంగళవారం నిర్వహించారు. జిల్లా టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి షేక్.ముంతాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాలికలు యవ్వన వయస్సులో మంచి, చెడులను తెలుసుకోవాలన్నారు. వీరనారీమణి ఝాన్సీ లక్ష్మిబాయిలా ధైర్య సాహసాలతో ముందుకు వెళ్ళాలన్నారు. నిత్యం జరిగే సంఘటనలు తల్లిదండ్రులతో పంచుకోవాలన్నారు. సూపర్‌వైజర్ మున్నీ, అంగన్‌వాడీ మహిళలు పాల్గొన్నారు.

### వైకుంఠపురం, ధరణికోట గ్రామాలలో ముగిసిన కిశోరి వికాసం వేసవి శిక్షణ

అమరావతి, జూన్ 10 ప్రభాతవార్త : అమరావతి మండలంలోని వైకుంఠపురం, ధరణికోట గ్రామాలలో కిశోరి వికాసం వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లల పట్ల లింగ వివక్ష, అసమానతలు, బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను తెలియజేశారు. మండల పరిషత్ అధ్యక్షులు మేకల హనుమంతరావు పాల్గొని మాట్లాడారు. మహిళల పట్ల సమాజంలో అసమానతలు తొలగిపోవాలన్నారు. అమరావతి, ధరణికోట సెక్టార్ల ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు షేక్.ఇమామ్‌బి, భారతీదేవి, పుష్పలత, ఏఎన్ఎం మాధురి, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## బాలకృష్ణకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి



చిలకలూరిపేట,జూన్10,ప్రభాతవార్త: ప్రముఖ సినీ నటులు, హిందూపురం నియోజకవర్గ శాసనసభ్యులు, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ఛైర్మన్, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్‌లో కలసి బోకే అందించి హృదయ పూర్వక జన్మదిన శుభా కాంక్షలు మాజీమంత్రి, స్థానిక శాసన సభ్యులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ నిండు నూరేళ్ల ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలని, సినీ, రాజకీయ, సేవా రంగాలలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ప్రత్తిపాటి తెలియచేశారు. సినీనటులు, హిందూపురం నియోజకవర్గ శాసనసభ్యులు, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా





హైదరాబాద్‌లోని వారి నివాసంలో మంగళవారం ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ అసిస్ట్ అసోసియేట్ డైరక్టర్ జాష్టి కృష్ణహరీష్, టిడిపి నాయకులు, హిందూపురం నియోజకవర్గ పొలిటికల్ కో ఆర్డినేటర్ పావులూరి శ్రీనివాసరావులు బాలకృష్ణను కలసి బోకేలు అందచేసిన పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను, సినీ రంగంలో ఆయన కృషిని వారు ప్రశంసించారు.

## సాతులూరు శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



నాదెండ్ల,జూన్10,ప్రభాతవార్త: మండలంలోని సాతులూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివార్ల అష్టమ వార్షికోత్సవ సందర్భంగా ఆలయకమిటి వారు ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో, స్వామివారి శాంతి కళ్యాణంలో మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్‌మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, ఐనవోలు రాధ, గట్టినేని రమేష్, కమ్మ శ్రీనివాసరావు, ఐనవోలు సాంబశివరావు, రూరల్ సిఐ బి సుబ్బనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల కష్టానికి విలువ ఇవ్వండి :ప్రత్తిపాటి

చిలకలూరిపేట,జూన్10,ప్రభాతవార్త: బర్లీ పొగాకు రైతులకు అన్యాయం జరిగితే ముఖ్యమంత్రి సహించరని, కూటమి ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలన్న ధృడచిత్తంతో ఉందని, ఇచ్చిన మాటకు కట్టుబడి కంపెనీలు రైతులను ఆదుకోవాలని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బర్లీ పొగాకు కొనుగోళ్లపై, కలెక్టర్ పి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన అత్యున్నతస్థాయి సమావేశంలో ప్రత్తిపాటి రైతులు, బయ్యర్లకు పలు కీలక సూచనలు చేశారు.



తమ వద్ద ఉన్న పొగాకు నిల్వలు అమ్ముకోవడానికి ఇన్నాళ్లు వేచిచూసిన రైతులకు తప్పకుండా న్యాయం జరుగుతుందన్న నమ్మకాన్ని ప్రత్తిపాటి వ్యక్తం చేశారు. కొనుగోలుదారుల ఒత్తిడితో ఎవరూ తొందరపడి అమ్ముకోవద్దని హితవు పలికారు. ప్రభుత్వ ఒత్తిడితో కొనుగోళ్ల ప్రారంభించిన కంపెనీలు మొక్కుబడిగా తక్కువ ధరకు కొని చేతులు దులుపుకునే ప్రయత్నాలు చేయకుండా, రైతులకు నష్టం లేకుండా చూడాలని ప్రత్తిపాటి సూచించారు. పొగాకు కంపెనీలు హామీ ఇచ్చినందునే ఈ సంవత్సరం రైతులు అధికంగా పొగాకు సాగుచేశారని, తమను నమ్మిన రైతులను ఆదుకోవాల్సిన భాధ్యత కంపెనీ యాజమాన్యాలపైనే ఉందని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. లాభనష్టాలు పక్కన పెట్టి, రైతుల కష్టానికి విలువ ఇవ్వాలన్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోతే రైతులు ఎలా బ్రతకాలని ఎంతకాలం నష్టపోవాలని ప్రత్తిపాటి సమావేశంలో ప్రశ్నించారు.

**కొనుగోళ్లలో తొలి ప్రాధాన్యత రైతులకే ఇవ్వాలి .......**

ప్రభుత్వం నిర్దేశించిన రూ 12వేల ధర ప్రతి రైతుకు అందించాల్సిన భాధ్యత కంపెనీలదేనని, రైతువద్ద ఉన్న చివరి ఆకువరకు కొనే భాధ్యత తీసుకోవాలని ప్రత్తిపాటి ఆదేశించారు. సరుకు బాగాలేదని, రంగు, నాణ్యత తగ్గిందని చెప్పకుండా ఈ సంవత్సరం రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రత్తిపాటి కంపెనీ ప్రతినిధులను కోరారు. ప్రధాన కంపెనీలన్నీ రైతులకు అండగా నిలిస్తే ప్రభుత్వం కూడా తగిన సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. లాభనష్టాల గురించి ఆలోచించకుండా నష్టపోయిన రైతులను ఆదుకోవడం పైనే కంపెనీలు శ్రద్ధ పెట్టాలని ప్రత్తిపాటి సూచించారు. నారు ఎంపిక దశలోనే చాలామంది రైతులు నష్టపోయారని, ఇబ్బందులు, సమస్యలు అధిగమించి సాగుచేసిన రైతులకు కూడా న్యాయం చేయకపోతే ఎలాగని ప్రత్తిపాటి కంపెనీల ప్రతినిధులను ప్రశ్నించారు. ఎకరా ఒక్కటికి రూ1.25 లక్షల నుంచి రూ 1.50 లక్షల వరకు రైతులు పెట్టుబడి పెట్టారని, వారు పెట్టిన పెట్టుబడి కూడా అందివ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వ సూచనల ప్రకారం కంపెనీలు, బయ్యర్లు పొగాకు రైతులకు న్యాయం చేయాల్సిందేనని ప్రత్తిపాటి తేల్చి చెప్పారు. కొనుగోళ్లలో తొలి ప్రాధాన్యత రైతులకే ఇవ్వాలని, వారి వద్ద సరుకు లేకపోతేనే ఇతరుల వద్ద కొనుగోలు చేయాలని ప్రత్తిపాటి తెలిపారు. కంపెనీలు, వాటి తరుపు బయ్యర్లు వెంటనే వేగంగా కొనుగోళ్లు జరపాలని, ప్రభుత్వం కూడా ఈనెల 16వ తేదీనుంచి మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోళ్లు ప్రారంభిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్, డీఆర్‌ఓ మురళి, జిల్లా స్థాయి అధికారులు, చిలకలూరిపేట టిడిపి నాయకులు మద్దూరి వీరారెడ్డి, నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్‌మోహన్, గట్టినేని రమేష్, ఎస్ ఠరీష్, రైతు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## అమరావతి మహిళలపై అవమానకర వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలని కోరుతూ మహిళల భారీ ర్యాలీ


చిలకలూరిపేట,జూన్10,ప్రభాతవార్త: అమరావతి రాజధాని మహిళలపై అవమానకర వ్యాఖ్యలు చేసిన వారిని, దానిని ప్రసారం చేసిన ఛానల్ నిర్వాహకులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ, ఈ సంఘటనను నిరసనగా మంగళవారం సాయంత్రం చిలకలూరిపేట పట్టణంలో మహిళా నాయకులు, పలు మహిళా సంఘాల నాయకులు, తెలుగుయువత, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శన రైతు బజారు వద్దనుంచి ప్రారంభమై నరసరావుపేట సెంటర్‌మీదుగా గడియారస్తంభం వరకు కొనసాగింది. ఈ ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు నల్ల బెలూన్లు, ప్లకార్డులు చేతబట్టి



నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలపై దుర్మార్గపు వ్యాఖ్యలు తక్షణమే ఆపాలని, సమాజం మహిళలను గౌరవించాలని, మహిళలను కించపరిచిన సాక్షి మీడియాను రద్దుచేయాలని, రాష్ట్ర మహిళాలందరికీ ఛానల్ అధినేత భారతీరెడ్డి క్షమాపణ చెప్పాలని వారు ప్లకార్డులపై రాసి నినాదాలు చేస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ దుర్మార్గపు వ్యాఖ్యలు చేసిన వారిపట్ల రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ వ్యవస్థ తగిన చర్యలు తీసుకోవాలని మహిళా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి మహిళా ప్రధాన కార్యదర్శి మిరియాల రత్నకుమారి, నియోజకవర్గ కార్యదర్శి పోపూరి లక్ష్మీ, వివిధ సంఘాల మహిళా నాయకులు, తెలుగు యువత నాయకులు టిఎన్ఎస్ఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసిన ఎనలిస్ట్ కృష్ణంరాజు, దానిని సమర్ధించిన జర్నలిస్ట్ కొమ్మినేని చిత్రపటాలను దగ్ధం చేశారు.

## అమరావతిపై విష ప్రచారాలను ప్రజలు సహించరు : 'జనసేన' నేత పెంటేల బాలాజీ

చిలకలూరిపేట,జూన్10,ప్రభాతవార్త: తాను నాశనం చేయాలనుకున్న రాజధాని అమరావతి పునర్నిర్మాణం చేస్తుంటే సహించలేక వైసిపి నాయకులు విషం కక్కుతున్నారని, రోజుకో అసత్య ప్రచారంతో మహిళలను సైతం అవమాన పరుస్తున్నారని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా కో కన్వీనర్ పెంటేల బాలాజీ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాజధాని అమరావతి అంటే వేలమంది రైతుల త్యాగం అని గుర్తుచేశారు. రాజధాని అమరావతిగా ఉండాలని, ఆ ప్రాంతానికి చెందిన రైతులు 1630 రోజులు ఆందోళన చేశారని, ఇందులో 270మంది చనిపోయారని బాలాజీ వివరించారు. ఎంతోమంది త్యాగాలతో రూపు దిద్దుకుంటున్న అమరావతిపై విష ప్రచారం చేస్తే ప్రజలు సహించరని అన్నారు. సాక్షి న్యూస్ ఛానల్, పత్రిక సత్యబద్ధంగా నిర్వహించాల్సింది పోయి, అసభ్య పదజాలంతో ప్రచారం చేస్తున్నారని అన్నారు. సాక్షి ఛానల్ యాజమాన్యంపై చర్య తీసుకోవాలని, ఛానల్ ఛైర్మన్ వైఎస్ భారతిని అరెస్ట్ చేయాలని బాలాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయ మెప్పుకోసం మాజీమంత్రులు విడదల రజిని,రోజాలు భారతి భజన చేస్తూ వారు మహిళలు అని మర్చిపోయారని ఆయన తెలియచేశారు. అమరావతి రైతుల ఉద్యమాన్ని వైసిపి ప్రభుత్వ హయంలో ఉక్కుపాదంతో అణిచివేసి జగన్ చరిత్రలో నిలిచిపోయారని గుర్తుచేశారు. నాటినుంచి వారు చేపట్టిన ఆందోనలు, దీక్షలు వేలాది రోజులు సాగినా తమ గోడు వెళ్లబోసుకునేందుకు నాటి సియం వైఎస్ జగన్ కనీసం రైతులకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. అమరావతి విషయంలో వైసిపి ఆడే నాటకంలో పావులు కావద్దని హితవు పలికారు. ఆంధ్రుల రాజధాని అమరావతిపై విషం కక్కితే సహించేది లేదని హెచ్చరించారు.



# పల్నాడు జిల్లా వార్త



## పొగాకు రైతులను ఆదుకోవాలి : కలెక్టర్ సూచన

నరసరావుపేట, జూన్ 10 ప్రభాతవార్త : పొగాకు రైతులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచించారు. రానున్న సంవత్సరంలో బ్లాక్ బార్లీ పొగాకు సాగును ప్రోత్సహించవద్దని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో పిజిఆర్‌ఎస్ హాల్లో పొగాకు కొనుగోలు కంపెనీల ప్రతినిధులు, రైతులు, వ్యవసాయశాఖ అధికారులతో కలెక్టర్ అరుణ్‌బాబు సమీక్ష నిర్వహించారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడారు. కష్టకాలంలో





ఉన్న రైతులను అన్ని విధాలా ఆదుకోవాల్సిన బాధ్యత కంపెనీలపై ఉందన్నారు. గత ఏడాది దిగుబడి తక్కువగా, డిమాండ్ అధికంగా ఉన్నందున రైతులు బ్లాక్ బార్లీ పొగాకు పంట వైపు మొగ్గు చూపారన్నారు. గత ఏడాది సుమారు 8500 ఎకరాలలో పొగాకును సాగు చేయగా ఈ ఏడాది 19,500 ఎకరాలలో పొగాకును సాగు చేసినట్లు తెలిపారు. అదే విధంగా మార్క్‌ఫెడ్ ద్వారా ఈ నెల 16 నుండి పత్తి కొనుగోళ్ళు ప్రారంభిస్తామన్నారు. క్వింటాకు రూ.12 వేల వరకు కొనుగోలు చేస్తారని వివరించారు. పలువురు రైతు కంపెనీల ప్రతినిధులు, రైతులు ఈ అంశాలపై తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్‌గనోరే, మార్క్‌ఫెడ్ డిఎం కృష్ణారావు, జిల్లా వ్యవసాయ అధికారి మురళీ పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ళ స్థలాలు : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, జూన్ 10 ప్రభాతవార్త : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ళ స్థలాలు ఇస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని లేఅవుట్‌లను ఆర్డీవో మధులతతో కలిసి ఆయన పరిశీలించారు. పట్టణంలోని 5వ వార్డు, రొంపిచర్ల మండల పరిధిలోని గోగులపాడు, ఇక్కుర్తి గ్రామాల పరిధిలోని లేఅవుట్‌లను పరిశీలించారు. ఆయా ప్రాంతాలలో గత ప్రభుత్వం కేటాయించిన లేఅవుట్‌లలోని భూములను రికార్డుల పూర్వకంగా



పరిశీలించారు. కొద్ది రోజుల క్రితం తాము ఇళ్ళ స్థలాలకు సంబంధించి ప్రజల నుండి తమకు వస్తున్న అర్జీలను ఆర్డీవో దృష్టికి తీసుకెళ్ళామన్నారు. గత ప్రభుత్వం లేఅవుట్‌లలో ప్లాట్లను తమకు అనుకూలమైన వారికి, అనర్హులకు పంపిణీ చేసిందని తెలియజేశారు. మున్సిపాల్టీకి కేటాయించిన లేఅవుట్‌లో 26 ఎకరాలలో 1205 ప్లాట్లు, గోగులపాడు గ్రామంలో 7.63 ఎకరాలను 280 ప్లాట్లను ఏర్పాటు చేశారు. వీటిపై ఆర్డీవో మధులత, రొంపిచర్ల తహాశీల్దార్ బండి నిర్మల, నరసరావుపేట తహాశీల్దార్ వేణుగోపాల్‌తో మాట్లాడారు.

## నరసరావుపేట చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి పోటీలు



నరసరావుపేట టౌన్, జూన్ 10 ప్రభాతవార్త : నరసరావుపేట చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి చదరంగ పోటీలను నిర్వహించారు. పోటీలలో సెయింట్‌జోసఫ్ స్కూల్‌కు చెందిన 4వ తరగతి విద్యార్థి రాగిడి అభిజ్ఞాన్ పాల్గొని విజయం సాధించారు. తొమ్మిది సంవత్సరాల విభాగంలో ద్వితీయ బహుమతిని పొందారు. పాండురంగస్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి జరిగిన బహుమతుల ప్రధానోత్సవంలో నిర్వాహకులు బత్తుల మురళి, చేగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

## నరసరావుపేటలో బాలకృష్ణ జన్మదిన వేడుకలు

నరసరావుపేట, జూన్ 10 ప్రభాతవార్త : నరసరావుపేట పట్టణంలో సినీహీరో, పద్మభూషణ్, నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, వాసిరెడ్డి రవిలు హాజరై కేక్ కట్‌చేసి మిఠాయిలను పంచిపెట్టారు. హిందూపురం శాసనసభ్యునిగా కొనసాగుతున్న



ఆయన ప్రజలకు అందిస్తున్న సంక్షేమం, సేవా కార్యక్రమాలను వారు వివరించారు. వారిని ఆదర్శంగా తీసుకొని శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ముందుకు వెళ్తున్నారని తెలిపారు. తెలుగు చలనచిత్ర రంగానికి ఎంతో పేరు ప్రఖ్యాతలను అంతర్జాతీయ వేదికపై తీసుకువచ్చిన ఘనత బాలకృష్ణకే దక్కుతుందని సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ అభిమానులు, తెలుగుదేశంపార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవం

నరసరావుపేట టౌన్, జూన్ 10 ప్రభాతవార్త : పట్టణంలోని 3వ వార్డు నిమ్మతోటలో సిల్మన్ మెమోరియల్ ఎలిమెంటరీ స్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా డే ను నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు వార్డులోని స్థానికులతో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఆదేశాల మేరకు యోగా శిక్షణా తరగతులు జరుగుతున్నట్లు జిల్లా టిడిపి నాయకులు నార్ల మారుతీబాబు తెలియజేశారు. వార్డు ప్రజలకు, మహిళలకు, యువతకు, చిన్నారులకు యోగా శిక్షణా శిబిరంలో గురూజీ కొత్త పెద్దన్న శిక్షణ ఇస్తున్నట్లు వారు వివరించారు. యోగా వలన కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఈ నెల 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని నార్ల మారుతీబాబు కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## జేఈఈ మెయిన్స్‌లో 352వ ర్యాంక్ సాధించిన హర్షిత్‌కు అభినందన

సత్తెనపల్లి, జూన్ 10 ప్రభాతవార్త : జేఈఈ మెయిన్స్ ఎగ్జామ్‌లో ఆల్‌ఇండియా స్థాయిలో 352వ ర్యాంక్ సాధించిన విద్యార్థి హర్షిత్‌ను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం అభినందించారు.



పట్టణంలోని రఘురాంనగర్ నందు ఈ కార్యక్రమం జరిగింది. పట్టణానికి చెందిన కురువెళ్ళ సాంబశివరావు - శివపార్వతుల కుమారుడు హర్షిత్ ర్యాంక్ సాధించి పట్టణానికి మంచి పేరు తీసుకువచ్చిన సందర్భంగా విద్యార్థి హర్షిత్‌ను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సన్మానించారు. హర్షిత్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు.

## సుబ్బాయమ్మకు నివాళులర్పించిన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

చిలకలూరిపేట, జూన్10, ప్రభాతవార్త: పారిశ్రామికవేత్త కందిమళ్ల అంజిబాబు తల్లి సుబ్బాయమ్మ ఇటీవల మృతిచెందిన సంగతి విదితమే. కాగా మంగళవారం ఆమె పెదకర్మను మార్టూరు మండలం కోలలపూడి గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ పాల్గొని సుబ్బాయమ్మ చిత్రపటానికి పూలమాల వేసి



నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్‌తో పాటు రోటరి డైరక్టర్లు ముత్తినేని వెంకటేశ్వర్లు, తెలప్రోలు వీరయ్య చౌదరి తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## ఎస్టీయు ప్రాంతీయ కార్యాలయంలో 79వ ఆవిర్భావ దినోత్సవం

చిలకలూరిపేట,జూన్10,ప్రభాతవార్త: పట్టణంలోని యస్‌టియు ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం 79వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యస్‌టియు జెండాను రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు, రాష్ట్ర డైరీ కన్వీనర్ పి శ్రీనివాసరావులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిజాం నిరంకుశ



పాలనకు వ్యతిరేకంగా ఉపాధ్యాయులు విద్యారంగా సమస్యల సాధనకోసం ఆవిర్భవించిన సంఘం ఎస్‌టియు అని తెలిపారు. 78 సంవత్సరాలు ఉపాధ్యాయ సమస్యలపై ఉద్యమాలు, పోరాటాలు చేసిందని వారు వివరించారు. ఈ రోజు ఉపాధ్యాయులు పొందుతున్న అనేక సౌకర్యాల కల్పన కోసం అనేక ఉద్యమాలు రూపొందించి యస్‌టియు నాయకులు ముందుండి నడిపించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, యస్‌టియు నాయకులు చావలి మల్లేశ్వరరావు, మేకల కోటేశ్వరరావు, వి అజయ్ ప్రకాష్, బొంతా రవి, చిలకా వీరయ్య, అట్లూరి శ్రీనివాసరావు, సోమ్లా నాయక్, చిన వెంకటస్వామి కె ఎడుకొండలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డు కార్యదర్శిగా తిరుపతిరాయుడు



చిలకలూరిపేట,జూన్10,ప్రభాతవార్త: చిలకలూరిపేట మార్కెట్ కమిటీ నూతన కార్యదర్శిగా దేవరకొండ తిరుపతిరాయుడు నియమితులయ్యారు. తణుకునుంచి బదిలీపై చిలకలూరిపేట మార్కెట్‌యార్డ్ కార్యదర్శిగా నియమిస్తూ మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ మార్కెట్ కమిటి కార్యదర్శిగా పనిచేసిన యోగేశ్వరరావు ఆకివీడు మార్కెట్ యార్డ్‌కు బదిలీ అయ్యారు.

## తెదేపా నేత గట్టుపల్లి చిన్నాకు 'ప్రత్తిపాటి' నివాళి



చిలకలూరిపేట, జూన్10, ప్రభాతవార్త: పట్టణంలోని 12వ వార్డుకు చెందిన టిడిపి నాయకుడు గట్టుపల్లి చిన్నా మంగళవారం మరణించారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు తూర్పుమాలపల్లిలో ఉన్న వారి నివాసానికి వెళ్లి చిన్నా భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ప్రత్తిపాటితో పాటు టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్‌మోహన్, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, ముల్లా కరిముల్లా, పిల్లి లెనిన్, గేరా రాము, యోహోషువా, మాణిక్యరావు, పిల్లి కోటి, వడ్డాని చిన్నా, సుబ్బారావు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## ప్రాంగణం ఎంపికల్లో 'మిట్టపల్లి' విద్యార్థుల ప్రతిభ

యడ్లపాడు, జూన్ 10, ప్రభాతవార్త : మండల పరిధిలోని బోయపాలెం గ్రామ సమీపంలోని మిట్టపల్లి కళాశాల విద్యార్థులు ప్రాంగణ ఎంపికలలో తమ ప్రతిభను చాటారు. మిట్టపల్లి కాలేజ్ అఫ్ ఇంజనీరింగ్ కళాశాల, కళాశాల శిక్షణ మరియు ప్రాంగణ విభాగం వారి సంయుక్త అధ్వర్యంలో పిజి, ఎమ్‌బిఎ రెండవ సంవత్సరం



చదువుతున్న విద్యార్థిని,విద్యార్థులకు మూత్తూట్ మినీ కంపెనీ వారిచే ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. వీరు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల పరీక్షలలో ఉత్సాహంగా పాల్గోని మంచి ప్రతిభకనబరిచారు. ఇందులో మొత్తం 8మంది విద్యార్థులు ఎంపికైనారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం మూడు లక్షల వరకు ఉంటుందని కంపెనీ హెచ్‌అర్ ప్రతినిధులు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ ఎమ్‌బివి సత్యనారాయణ ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ గోపికృష్ణ, ఎవో సిహెచ్ శ్రీనివాసరావు, టీపి ఓకె విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## 'ఎన్‌పిఎం షాపుల ద్వారా అందుబాటులో పిఎండిఎస్ విత్తనాలు'

యడ్లపాడు, జూన్ 10, ప్రభాతవార్త : నాన్ పెస్టిసైడ్ మేనేజ్మెంట్ షాపు నందు ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన కషాయాలు, ఘనజీవామృతంతోపాటు పిఎండిఎస్ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని డిపిఎం కె అమలకుమారి తెలిపారు. మండల పరిధిలోని ఉన్నవ



గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కోటేశ్వరమ్మ నిర్వహిస్తున్న ఎన్‌పిఎంషాపును అమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అమె వివరిస్తూ ప్రస్తుతం పడుతున్న వర్షాలు ఉపయోగించుకొని రైతులందరూ ఖరీఫ్‌లో ప్రధాన పంట వేసుకోవటానికి ముందుగా 30రకాలు విత్తనాలు కలిపి వేసుకోవాలని, పప్పు జాతి విత్తనాలలో మినుము, పెసర, బొబ్బర్లు, చిక్కుళ్ళు, నూనె జాతి నువ్వులు, అముదం, వేరుశనగ, సుగంధ ద్రవ్యాల జాతి ధనియాలు మెంతులు, అవాలు, ధాన్యపు జాతి రాగులు, మొక్కజోన్న, కొర్రలు, సామలు, పచ్చిరొట్ట జీలుగ, కట్టిజనుము, పిల్లిపెసర, వివిధ రకాల కూరగాయలు అకుకూరలు దుంప జాతి తీగజాతి మొదలైనవి అన్ని కలిపి వేసుకోవాలని, వీటిని అన్నింటిని రైతులకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ విత్తనాలు వేసుకోవటం వల్ల 365రోజులు భూమి కప్పబడి నిరంతరం సాగు ప్రక్రియకు శ్రీకారం చుడుతుందన్నారు. వివిధ పంటల వేర్లు భూమిలో వైవిద్య రకాల సూక్ష్మజీవులకు అశ్రయం కల్పించి పంటలకు ఉపయోగపడేవి వీటి సంతతిను అభివృద్ధి పరుస్తాయని తద్వారా ప్రధాన పంటకు కావలిసన స్థలం పోషకాలు అందుబాటులోకి తీసుకువచ్చి మొక్కల వేరు వ్యవస్థ గ్రహించేటట్లు చేస్తాయన్నారు. నవధాన్య పంటలు పశువులకు పోషక విలువలతో కూడిన పిచ్చి మేతగా ఉపయోగపడతాయన్నారు. కావున రైతులు విత్తనాలను వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జీ ఉన్నవ కోటేశ్వరమ్మ, మాస్టర్ ట్రైనర్ బేబీ రాణి, ఎన్‌సిఅర్‌పి పాములు పాల్గొన్నారు.

## నేడు కొండవీడు కోటలో 'యోగాంధ్ర' కార్యక్రమం

యడ్లపాడు, జూన్ 10, ప్రభాతవార్త : చారిత్ర పర్యాటక కేంద్రం అయిన కొండవీడు కోటలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 6గంటలకు ప్రారంభమవుతుందని, ఇందులో జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు పాల్గొంటారని, కావున ఈ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారుల పాల్గొంటారని తెలిపారు.

## 'అఖండ' చిత్రంలోని ఎడ్లజత పోషకులకు ఎమ్మెల్యే అభినందన

సత్తెనపల్లి, జూన్ 10 ప్రభాతవార్త : అఖండ-2 మూవీలో నటించిన ఎద్దుల పోషకులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం అభినందించారు. మండలంలోని పాకాలపాడు గ్రామానికి చెందిన కంచేటి శివ ఆధ్వర్యంలో ఎద్దులు అద్భుతంగా అన్ని పోటీలలో



రాణిస్తున్నాయని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రశంసించారు. నియోజకవర్గానికి ఎద్దులు మంచి పేరు తీసుకురావడం ఎంతో సంతోషమన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తిరునాళ్ళ మహోత్సవంలో పాల్గొన్న కన్నా

సత్తెనపల్లి, జూన్ 10 ప్రభాతవార్త : తిరునాళ్ళ మహోత్సవంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం పాల్గొన్నారు. ముప్పాళ్ళ మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో వెంకటేశ్వరస్వామి తిరునాళ్ళ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దీవెనలతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు పాల్గొన్నారు.



# సీల్డ్‌కవర్ నివేదికకు హైకోర్టు ఓకే




## చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాట కేసులో తదుపరి విచారణ రేపటికి వాయిదా

**బెంగళూరు, జూన్ 10:** బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటనపై దాఖలైన కేసులో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు కొంత గడువు ఇచ్చింది. ఈ దుర్ఘటనపై నివేదికను సీల్డ్ కవర్‌లో సమర్పించేందుకు అనుమతించాలని రాష్ట్ర అడ్వకేట్ జనరల్ (ఏజీ) చేసిన అభ్యర్థనను ఉన్నత న్యాయస్థానం అంగీకరించింది. తదుపరి విచారణను జూన్ 12వ తేదీకి వాయిదా వేసింది. జూన్ 4వ తేదీన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఐపీఎల్ విజయోత్సవాల సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వద్ద అశేష జనసందోహం పోటెత్తడంతో తొక్కిసలాట జరిగింది. ఈ విషాద ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా, చాలా మంది గాయపడ్డారు. ఈ సంఘటనను సుమోటోగా స్వీకరించిన హైకోర్టు, పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇవాళ ఈ కేసు విచారణకు రాగా, తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి వి. కామేశ్వర్ రావు, జస్టిస్ సి.ఎమ్. జోషిలతో కూడిన ధర్మాసనం ముందు అడ్వకేట్ జనరల్ శశి కిరణ్ శెట్టి తమ వాదనలు వినిపించారు. ఈ దుర్ఘటనపై దర్యాప్తు చేసేందుకు ఇప్పటికే ఒక న్యాయ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేశామని, నెల రోజుల్లోగా ఆ కమిషన్ నివేదిక సమర్పించనుందని ఆయన కోర్టుకు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి బెయిల్ హియరింగ్‌లు కూడా జరుగుతున్నాయని, ఇలాంటి సమయంలో కోర్టులో ఏవైనా వాంగ్మూలాలు ఇస్తే, వాటిని నిందితులు తమకు అనుకూలంగా వాడుకునే అవకాశం ఉందని శెట్టి వివరించారు. అందువల్ల ప్రభుత్వ స్పందనను సీల్డ్ కవర్‌లో సమర్పించేందుకు అనుమతించాలని ఆయన కోరారు. ఏజీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం అందుకు అంగీకరిస్తూ విచారణను వాయిదా వేసింది. ఈ దుర్ఘటన నేపథ్యంలో సంబంధిత పోలీస్ అధికారులను సస్పెండ్ చేసినట్లు కూడా ఏజీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రయోజన వ్యాజ్యాలు, జోక్యం చేసుకోవాలంటూ వస్తున్న అభ్యర్థనల నేపథ్యంలో ఈ కేసుపై తదుపరి విచారణను కర్ణాటక హైకోర్టు జూన్ 12న చేపట్టనుంది. అయితే కేసు విచారణలో కర్ణా టక ప్రభుత్వం, సిఎంలనుద్దేశించి ఘాటు వ్యాఖ్యలుచేసింది. ఆర్సీబీ వేడుకలు నిర్వహించాలని ఎప్పుడు ఎక్కడనిర్ణయం తీసుకున్నారని, ట్రాఫిక్ కట్టడిచేసేందుకు ఎలాంటి చర్యలు చేపట్టారని, ప్రజలను,గుంపులను నియంత్రించే చర్యలు ఏమిటి,ఆర్సీబీ విజయోత్సవ వేడుకలకు స్టేడియం దగ్గర మెడికల్ ఎమర్జెన్సీ ఏర్పాట్లుచేసారా, వేడుకలకు ఎంతమంది ఉం డవచ్చని ముందుగా ఎందుకు అంచనావేయ లేదు. గాయపడినవారికి వైద్యసాయం అందిందా. వారిని ఆసుపత్రులకు తీసుకెళ్లేందుకు ఎంతసమయం పట్టింది,50వేలు అంతకంటే ఎక్కువమంది వచ్చినపుడు నియంత్రించేందుకు మీవద్ద ఉన్న ప్రణాళికలేమిటి, ఈ కార్యక్రమ నిర్వహణకు అనుమతి కోరారా అంటూ ప్రశ్నలు కురిపించింది.



# ఉక్రెయిన్‌పై మరో భీకర దాడి

## 315 డ్రోన్లతో విరుచుకుపడిన రష్యా

**మాస్కో, జూన్ 10:** ఉక్రెయిన్‌పై రష్యా వరుస డ్రోన్ దాడులతో విరుచుకుపడుతోంది. ఇన్నాళ్లలో ఎన్నడూ లేనంత తీవ్రస్థాయిలో భీకర దాడులు చేస్తోంది. రాత్రి వేళ ఉక్రెయిన్‌పై 315 షాహెద్ డ్రోన్లను ప్రయోగించింది. ఈ దాడుల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. 34 మంది తీవ్రంగా గాయపడినట్లు కీవ్ వాయుసేనను ఉటింకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 315 డ్రోన్లతోపాటు ఉత్తర కొరియాకు చెందిన కెఎన్-23 బాలిస్టిక్ క్షిపణులు, ఐదు ఇస్కాండర్-కె క్రూయిజ్‌లను ప్రయోగించింది. ఉక్రెయిన్ రాజధాని నగరం కీవ్‌ను లక్ష్యంగా చేసుకొని దాడులు నిర్వహించింది. 213 డ్రోన్లు, ఏడు క్షిపణులను నేత కూల్చినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం వెల్లడించింది. రాడార్స్ నుంచి 64 డ్రోన్లు అదృశ్యం అయినట్లు మీడియా పేర్కొంది. రష్యా దాడులతో దక్షిణ నగరంలో ఉన్న ప్రసూతి ఆస్పత్రి, వైద్య పరికరాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

కాగా 479 డ్రోన్లతో విరుచుకుపడిన రష్యా మరోసారి భీకర దాడులు నిర్వహించింది. ఇటీవల జరిగిన దాడిలో 20 క్షిపణులను ప్రయోగించిందని మధ్య, పశ్చిమ ఉక్రెయిన్‌లో ప్రదేశాలను ఇవి లక్ష్యంగా చేసుకొన్నట్లు కీవ్ వాయుసేన వెల్లడించింది. మాస్కో ప్రయోగించిన వాటిల్లో 277 డ్రోన్లు, 19 క్షిపణులను మార్గ మధ్యంలోనే తమ ఎయిర్‌డిఫెన్స్ వ్యవస్థలు కూల్చేసినట్లు ఉక్రెయిన్ పేర్కొంది. మొత్తంలో కేవలం 10 డ్రోన్లు లేదా క్షిపణులు మాత్రమే లక్ష్యాలను తాకినట్లు వెల్లడించింది.


# నీప్రియుడుతోనే పోవచ్చుగా..నా అన్నను ఎందుకు చంపేశావ్

## రఘువంశీ సోదరి ఇన్‌స్టాలో ఉద్వేగం

**పాట్నా,జూన్ 10:** అగ్ని సాక్షిగా వివాహమాడిన భర్త కంటే ప్రియుడే ఎక్కువని అనుకుంటే అతడితోనే వెళ్లిపోవచ్చు కదా.. అన్యాయంగా నా అన్నను ఎందుకు చంపావ్?' అంటూ రాజా రఘువంశీ సోదరి శ్రస్తి రఘువంశీ తన వదిన సోనమ్ ను ప్రశ్నించారు. రాజా హత్యతో తీవ్ర విషాదంలో మునిగిన రఘువంశీ కుటుంబం.. పోలీసుల విచారణలో బయటపడుతున్న వాస్తవాలతో వేదనకు గురవుతోంది. తన సోదరుడిని కిరాయి హంతకులతో వదినే చంపించిందని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు శ్రస్తి తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా శ్రస్తి తన మనోవేదనను పంచుకున్నారు. సోనమ్‌కు ఆమె ప్రియుడే ఎక్కువని అనుకుంటే ఇంట్లో నుంచి పారిపోయే అవకాశం ఉందని గుర్తుచేశారు. రాజా, సోనమ్ ఇద్దరిని అడిగి తెలుసుకున్నాకే తన తల్లిదండ్రులు వారికి వివాహం చేశారని చెప్పారు. అప్పటికే ప్రియుడు ఉన్నప్పుడు, ప్రియుడితోనే కలిసి ఉండాలని అనుకున్నపుడు సోనమ్ తన అన్నతో వివాహానికి ఎందుకు ఒప్పుకుందని శ్రస్తి ప్రశ్నించారు. ఆమె తల్లిదండ్రులు బలవంతం చేస్తే పెళ్లికి ఒప్పుకుందని అనుకుంటే పెళ్లయ్యాక కూడా తన ప్రియుడితో పారిపోవచ్చు. కానీ సోనమ్ అవేమీ చేయకుండా అన్యాయంగా తన సోదరుడిని చంపించిందని శ్రస్తి ఆరోపించారు. మా అన్నయ్య ఏడు జన్మలు తోడుంటానని సోనమ్‌కు ప్రమాణం చేశాడు, కానీ ఆమె ఏడు రోజులు కూడా మా అన్నతో ఉండలేకపోయింది. నా సోదరుడు ఏం తప్పు చేశాడని చంపేశావ్? నీకు వేరొకరు నచ్చితే వారితో పారిపోవచ్చు కదా ఎందుకు చంపావ్ ఒకరికి సోదరుడిని, మరొకరికి కొడుకును ఎందుకు దూరం చేశావ్ అంటూ ఇన్ స్టాలో ఓ వీడియో సందేశం పోస్టు చేస్తూ శ్రస్తి కన్నీటి పర్యంతమయ్యారు.

కాగా సోనమ్‌కు రాజ్ కుష్వాహ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని, అతడితో కలిసే ఈ హత్యకు పథకం రచించిందని ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. కుష్వాహతో పాటు మరో ముగ్గురు నిందితులు ఆకాష్ రాజ్‌పుత్, వికాస్ అలియాస్ విక్కీ, ఆనంద్‌లను మధ్యప్రదేశ్‌లో అరెస్ట్ చేసినట్లు మేఘాలయ డీజీపీ ఇడాశిష నాన్‌గ్రాంగ్ ధ్రువీకరించారు. భర్త హత్యలో సోనమ్ ప్రమేయం ఉందని, నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని ఆయన వెల్లడించారు. రఘువంశీ మృతదేహం లభ్యమైన వారం రోజుల తర్వాత సోనమ్ లొంగిపోవడం గమనార్హం. అయితే, ఈ ఆరోపణలను సోనమ్ తండ్రి తీవ్రంగా ఖండించారు. తన కుమార్తె అమాయకురాలని, మేఘాలయ పోలీసులు ఆమెపై తప్పుడు కేసు బనాయించి ఇరికించారని ఆరోపించారు. ఈ కేసుపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం తాను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను కలుస్తానని తెలిపారు. తనను ఎవరో కిడ్నాప్ చేసి, దోచుకోవడానికి ప్రయత్నించారని సోనమ్ ఫోన్‌లో చెప్పిందని, తాను ఘజియాబాద్‌కు ఎలా వచ్చానో కూడా తనకు తెలియదని వాపోయినట్లు ఆయన వివరించారు. ఈ పరస్పర విరుద్ధమైన వాదనలతో కేసు మరింత సంక్లిష్టంగా మారింది. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో లొంగిపోయిన సోనమ్ తనను ఎవరో కిడ్నాప్ చేసి, దోచుకోవడానికి ప్రయ త్నించారని ఫోన్‌లో చెప్పిందని, తాను ఘజియాబాద్‌కు ఎలా వచ్చానో కూడా తనకు తెలియదని వాపోయినట్లు ఆయన వివరించారు.

# హైకమాండ్ ఆదేశాలతో కర్ణాటకలో మళ్లీ కులగణన



**బెంగళూరు, జూన్ 10:** కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మళ్లీ కులగణన చేపట్టాలని భావిస్తోంది. అధిష్ఠానం ఆదేశాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని డిప్యూటీ సిఎం డికె శివకుమార్ మంగళవారం సూచనప్రాయంగా ప్రకటించారు. అయితే కులగణన అంశంపై సమీక్ష జరిపేందుకు ఈ నెల 12న కర్ణాటక మంత్రివర్గం ప్రత్యేకంగా సమావేశం కానుంది. ఇదిలా ఉంటే కర్ణాటకలో 2015లోనే అప్పటి ప్రభుత్వం కులగణన జరిపింది. హెచ్ కాంతారాజ్ నేతృత్వంలో కర్ణాటక రాష్ట్ర బిసి కమిషన్ ఈ సర్వేను నిర్వహించింది. ఆ సమయంలో కోటి 35 లక్షల ఇళ్లను సర్వే చేశారు. 51 ప్రమాణాల ఆధారంగా 5.98 కోట్ల మంది డాటాను సేకరించారు. అయితే రాజకీయపరమైన కారణాలు, ఇతర కారణాల దృష్ట్యా ఆ నివేదికను సీల్డ్ కవర్‌లోనే ఉంచారు. ఈ యేడాది ఏప్రిల్‌లో కేబినెట్ ముందుకు ఆ నివేదిక వచ్చింది. అప్పటి నుంచి దశలవారీగా కేబినెట్ భేటీ అవుతూ కర్ణాటక సోషియో ఎకనిమక్ అండ్ ఎడ్యుకేషన్ సర్వేపై చర్చలు జరుపుతోంది. అయితే ఆ నివేదికలోని ఒబిసి రిజర్వేషన్లను 51 శాతానికి పెంచాలన్న ప్రతిపాదనపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. అదే సమయంలో లింగాయత్, వక్కలింగ కులాలు ఈ నివేదికను తోసిపుచ్చుతున్నాయి. మరోవైపు మళ్లీ కులగణన చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఇటు రాజకీయ వర్గాలు, అటు మేధోవర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ముఖ్యంగా టీచర్లను సర్వేలో భాగం చేయడం వల్ల అకడమిక్ ఇయర్‌కు విఘాతం కలిగే అవకాశం ఉందని అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. జనగణతోపాటే కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం మరోసారి కులగణన జరపాలని అనుకుంటుండడం విశేషం. కేబినెట్ సబ్‌కమిటీ లేదంటే లెజిస్లేటివ్ కమిటీ ద్వారా కులగణన సర్వేపై తుది నిర్ణయం తీసుకోవాలని కర్ణాటక ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# లాస్ ఏంజెల్స్‌లో పెరిగిన ఉద్రిక్తతలు

## నేషనల్ గార్డ్‌కు తోడు పోలీసులు కూడా రంగప్రవేశం

## రబ్బరు బుల్లెట్లు, లాఠీఛార్జి, భయంకర శబ్దాలప్రయోగం






**లాస్ ఏంజెల్స్, జూన్ 10:** అక్రమ వలసదారుల అరెస్టుతో అమెరికాలోని లాస్ ఏంజెల్స్ నగరంలో నిరసనలు మరింతగా పెరుగుతున్నాయి. వరుసగా నాల్గో రోజు వేలాది మంది జనం వీధుల్లోకి వచ్చి ఆందోళన చేస్తున్నారు. అక్రమ వలసదారులను అరెస్టుచేసే క్రమంలో అనుసరిస్తున్న విధానాలను అక్కడి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వలసదారులతోపాటే ప్రజలు కూడా ట్రంప్ చర్యలను తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. దీనితో పరిస్థితులను అదుపు చేసేందుకు నేషనల్ గార్డ్స్‌కు సహాయంగా, పెంటగాన్ 700 మంది మెరైన్స్‌ను మోహరించింది. మరోవైపు లాస్ ఏంజెల్స్‌లో జరుగుతున్న నిరసనలను అడ్డుకోవడానికి అదనంగా మరో 2000 మంది నేషనల్ గార్డ్స్‌ను మోహరించడానికి ట్రంప్ ఉత్తర్వులు ఇచ్చారని అధికారులు తెలిపారు. అయితే ఈ అదనపు దళాలను అక్కడకు తరలించడానికి ఒకటి లేదా రెండు రోజులు పట్టవచ్చని ఓ అధికారి తెలిపారు. డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాన్ని కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసన్ తీవ్రంగా ఖండించారు. నిరసనకారులను అదుపు చేసేందుకు అదనంగా 2000 మంది నేషనల్ గార్డ్స్‌ను మోహరించడం మా దళాలను అగౌరపరచడమే అవుతుందని ఎక్స్ వేదికగా అసహనం వ్యక్తం చేశారు. ఇది ప్రజా భద్రత గురించి కాదు. ఇది ప్రమాదకరమైన అధ్యక్షుడి అహాన్ని తెలియజేస్తోందని న్యూసమ్ ఘాటు విమర్శలు చేశారు. నేషనల్ గార్డ్‌లను తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. అంతేకాదు ఇలా అక్రమంగా నేషనల్ గార్డ్‌లను మోహరించడం తమ రాష్ట్ర సార్వభౌమత్వాన్ని కాలరాయడమే అని న్యూసమ్ అక్షేపించారు. దీనిపై కోర్ట్‌లో దావా వేయనున్నట్లు తెలిపారు. ఇది చట్ట విరుద్ధమని, అనైతికమని, రాజ్యాంగ విరుద్ధమని న్యూసమ్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేయకుండా అక్కడ నేషనల్ గార్డులను నేరుగా మోహరించడం గత కొన్ని దశాబ్దాల్లో ఇదే ప్రథమం కావడం గమనార్హం. ట్రంప్ తీసుకున్న ఇలాంటి దుందుడుకు చర్యలవల్లే ఆందోళనలు మరింత పెరిగాయని న్యూసమ్‌తో పాటు, లాస్ ఏంజెలెస్ మేయర్ కరెన్ బాస్ విమర్శించారు. ఆందోళనకారులను అడ్డుకునేందుకు భద్రతా దళాలు బాష్పవాయువు, రబ్బర్ బుల్లెట్లను, పొగ బాంబులను, చెవులు చిల్లులు పడే శబ్దాలను ప్రయోగించాయి. దీనితో నిరసనకారులు ప్రతిదాడులకు దిగారు. పలు మార్గాలను దిగ్బంధించారు. ఒకదశలో తమను తాము రక్షించుకునేందుకు పోలీసులు వంతెన కింద వెళ్లి దాక్కోవాల్సి వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో అనేకమంది ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. లాస్ ఏంజెలెస్ లో నేషనల్ గార్డులను మోహరించాలనే ట్రంప్ నిర్ణయాన్ని టెస్లా అధినేత ఎలాన్ మస్క్ గట్టిగా సమర్థించారు. కాలిఫోర్నియా గవర్నర్, లాస్ ఏంజెలెస్ మేయర్ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన పోస్టును మస్క్ షేర్ చేశారు. జేడీ వాన్స్ పోస్టులను కూడా మస్క్ రీపోస్టు చేశారు.

# గ్రెటా థన్‌బర్గ్‌ను వెనక్కి పంపిన ఇజ్రాయెల్



**టెల్అవీవ్, జూన్ 10:** గాజాలో మానవతాసాయం అందించేందుకు ఓ నౌకలో బయల్దేరి వెళ్తుండగా స్వీడిష్ పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్‌సహా 12 మందిని ఇజ్రాయెలీ సైన్యం అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఆమెను దేశం నుంచి వెనక్కి పంపినట్లు ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రకటించింది. గ్రెటాను ఫ్రాన్స్‌కు పంపిస్తున్నామని, అక్కడి నుంచి స్వీడన్‌కు వెళ్తుందని పేర్కొంటూ ఇజ్రాయెల్ విదేశాంగశాఖ ఆమె ఫొటోను ఎక్స్‌లో పోస్టు చేసింది. ఆంక్షలను ఉల్లంఘించి తమ సముద్ర జలాల్లోకి ప్రవేశించినందుకుగాను ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. గ్రెటా, మరో ఇద్దరు కార్యకర్తలు, ఓ జర్నలిస్టు ఇజ్రాయెల్‌ను విడిచి వెళ్లడానికి అంగీకరించడంతో వారిని ఫ్రాన్స్‌కు పంపించామని ఇజ్రాయెల్‌లోని లీగల్ రైట్స్ గ్రూప్ అదాలా పేర్కొంది. ఇతర కార్యకర్తలు అక్కడి నుంచి వెళ్లడానికి నిరాకరించడంతో వారిని నిర్బంధంలో ఉంచి అధికా రులు విచారిస్తున్నారని తెలిపింది.

గాజా పౌరుల కోసం ఆహారం, బేబీ ఫార్ములా తీసుకొని గ్రెటా థన్‌బర్గ్, మెంబర్ ఆఫ్ యూరోపియన్ పార్లమెంట్ రీమా హసన్‌తోపాటు మొత్తం 12 మంది జూన్ 6న సిసిలీ ప్రాంతం నుంచి ఓ నౌకలో బయల్దేరారు. మంగళవారం సాయంత్రానికి గాజా చేరుకోవాల్సి ఉండగా సోమవారం తెల్లవారుజామున ఇజ్రాయెల్ ఆర్మీ అంతర్జాతీయ జలాల్లో వీరిని అడ్డుకుంది. అనంతరం నౌకను ఇజ్రాయెల్ పోర్టుకు మళ్లించాయి. గాజా నలువైపులా ఆంక్షలు ఉండటంతో వీరి నౌకను అదుపులోకి తీసుకున్నట్లు ఇజ్రాయెల్ దళాలు వెల్లడించాయి. అయితే అది సాయం అందించడంకోసం వస్తోన్న నౌక కాదని, కేవలం సెలబ్రిటీల 'సెల్ఫీ'యాత్ర అని ఇజ్రాయెల్ విదేశీ మంత్రిత్వశాఖ ఆరోపించింది.

# కమల్ సహా ఆరుగురు రాజ్యసభ అభ్యర్థులు ఏకగ్రీవం



**చెన్నై,జూన్ 10:** మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ సహా తమిళనాడు నుంచి ఆరుగురు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధికార డీఎంకే నుంచి ముగ్గురు, ప్రతిపక్ష ఏఐడీఎంకే నుంచి ఇద్దరు, ఎంఎన్ఎం నుంచి కమల్ హాసన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల పరిశీలన తర్వాత డీఎంకే, ఏఐడీఎంకే, ఎంఎన్ఎం సభ్యుల నామినేషన్ పత్రాలు ఆమోదం పొందినట్లు అధికారులు ప్రకటించారు. మొత్తం ఏడుగురు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరణకు గురైనట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతీ అభ్యర్థికి సుమారు 10 మంది ఎమ్మెల్యేల మద్దతు తెలపాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే స్వతంత్ర అభ్యర్థులకు ఎమ్మెల్యేల మద్దతు లేకపోవడంతో నామినేషన్ తిరస్కరణకు గురైంది. నామినేషన్ల విత్ డ్రాకు జూన్ 12వరకు గడువు ఉంది. ఈ నేపథ్యంలోనే ఈనెల 12న రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైనట్లు ఆ ఆరుగురికి సర్టిఫికెట్లు అందజేయనున్నారు. అంతకుముందు శుక్రవారమే రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు కమల్ హాసన్. చెన్నై సెక్రటేరియట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే. స్టాలిన్, మంత్రి ఉదయ నిధి స్టాలిన్ సహా పలువురు నేతలు పాల్గొన్నారు. ఆయనతో పాటు ప్రస్తుతం రాజ్యసభ ఎంపీగా ఉన్న న్యాయవాది విల్సన్, రుక్కయ్య మాలిక్ అలియాస్ కవిగ్నార్ సల్మా, ఎస్ఆర్ శివలింగం సైతం డీఎంకే తరఫున నామినేషన్ వేశారు. మరో ఇద్దరు అన్నా డీఎంకే నేతలు రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. తమిళనాడులో త్వరలో ఖాళీ కానున్న ఆరు రాజ్యసభ స్థానాలకు ఎన్నికల సంఘం ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆరుగురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం 2025 జూలై 25న ముగియనుండడంతో జూన్ 19న ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపింది. ఈ నేపథ్యంలోనే జూన్ 2న ప్రారంభమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ జూన్ 9న ముగిసింది. ఆరు సీట్లకుగానూ 3 స్థానాల్లో డీఎంకే, రెండు స్థానాల్లో అన్నాడీఎంకే, ఒక స్థానానికి డీఎంకే మిత్రపక్షమైన ఎంఎన్ఎంకు పోటీ చేశాయి.

# స్కూలులో విద్యార్థి కాల్పులు, 11 మంది మృతి

## స్వయంగా కాల్చుకొని విద్యార్థి ఆత్మహత్య

**గ్రాజ్(ఆస్ట్రియా),జూన్ 10:** ఆస్ట్రియాలోని రెండో అతిపెద్ద నగరమైన గ్రాజ్‌లో మంగళవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఇక్కడి బోర్గ్ డ్రెయిర్ షుట్జెన్‌గాస్సె పాఠశాలలో ఓ విద్యార్థి జరిపిన కాల్పుల్లో 11మంది మరణించగా, మరికొందరు గాయపడ్డారు. అనంతరం నిందితుడైన విద్యార్థి పాఠశాల టాయిలెట్‌లో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఈ దారుణం జరిగింది. పాఠశాల భవనం లోపలి నుంచి తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందింది. ఆస్ట్రియా ప్రభుత్వ ప్రసార సంస్థ వివరాలను చూస్తే ఈ కాల్పుల్లో కనీసం 10 మంది మరణించగా, పలువురు గాయపడ్డారు. అయితే, మృతుల సంఖ్యను అధికారులు ఇంకా అధికారికంగా ధృవీకరించలేదు. మరణించిన వారిలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా ఉన్నారని స్థానిక మీడియా తెలిపింది. కాల్పులు జరిపిన విద్యార్థి కూడా మరణించిన వారిలో ఉన్నాడని గ్రాజ్ నగర మేయర్ ఎల్కే ఖర్ వెల్లడించారు. డ్రెయిర్‌షుట్జెన్‌గాస్సె లోని ఫెడరల్ అప్పర్ సెకండరీ పాఠశాలలో ఈ కాల్పులు జరిగాయని ఆస్ట్రియా పోలీసులు సోషల్ మీడియా పోస్టులో ధృవీకరించారు. ప్రజలు ఆ ప్రాంతానికి దూరంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం, పాఠశాలను పూర్తిగా ఖాళీ చేయించి, విద్యార్థులు, సిబ్బంది అందరినీ సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు పోలీసులు ఎక్స్ ద్వారా తెలిపారు.

# రష్యా అధ్యక్షుడు పుతిన్ మంచి వ్యక్తి

## ప్రశంసించిన ఎరాల్ మస్క్



**మాస్కో, జూన్ 10:** ప్రపంచ కుబేరుల్లో ఒకరైన ఎలాన్ మస్క్ తండ్రి ఎరాల్ మస్క్ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఉద్దేశిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పుతిన్ చాలా మంచి వ్యక్తి అని కొనియాడారు. అలాంటి వ్యక్తిపై మీడియా తప్పుడు కథనాలు ప్రచురితం చేస్తోందని ఆరోపించారు. రష్యాలో నిర్వహించిన ఫోరం ఆఫ్ ద ఫ్యూచర్ 2050 కార్యక్రమంలో ఎరాల్ మస్క్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'పుతిన్ నిలకడ స్వభావం కలిగినవారు. ఒక మంచి మనిషి. కానీ, పాశ్చాత్య మీడియా ఆయనతోపాటు రష్యాపైనా బురద జల్లుతోంది. శత్రుదేశంలా చిత్రీకరించేందుకు అవాస్తవ కథనాలు ప్రసారం చేస్తోంది. ఆయన గురించి ప్రచురితమైన ఆ వార్తలన్నీ అర్థం లేనివి'అని వ్యాఖ్యానించారు.ఆయన చేసిన ఈవ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి.

రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, యుకె పార్లమెంట్ మాజీ సభ్యుడు జార్జ్ గల్లోవే, అమెరికా రేడియో హోస్ట్ అలెక్స్ జోన్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్‌ల మధ్య విభేదాలు తీవ్రంగా మారిన సంగతి తెలిసిందే. దీనిపై ఎరాల్ మస్క్ ఇటీవల స్పందించారు. గత కొన్ని నెలలుగా పరిపాలనకు సంబంధించిన విషయాల్లో మస్క్, ట్రంప్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారన్నారు. అయితే ట్రంప్ తీసుకువచ్చిన బిల్లు నేపథ్యంలో మస్క్ తీవ్ర అసహనానికి గురయ్యాడనిఅ ందుకే అధ్యక్షుడిపై ఆరోపణలు చేస్తున్నాడని తెలిపారు. ఈ విషయంలో వారిద్దరి మధ్య గొడవ వచ్చిం దన్నారు.ఇరువురూ వివాదాలను పక్కనపెట్టి కలిసి పని చేయాలని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు.

# రూ.100 కోట్ల విలువైన ఆస్తులు జప్తు

## ముడా కుంభకోణంలో ఇడి దర్యాప్తులో వేగం

**బెంగళూరు,జూన్ 10:**మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) స్థలాల కేటాయింపులో జరిగిన భారీ కుంభకోణానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రూ.100 కోట్ల మార్కెట్ విలువైన 92ఆస్తులను తాత్కాలికంగా జప్తుచేసింది. ఇప్పటి వరకు రూ.400 కోట్ల విలువైన ఆస్తులు ఈ కేసులో జప్తు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తులు సహకారసంఘాల పేరుతో నమోదయ్యాయని ముడా అధికారులతో సహా పలువురు బడావ్యక్తులకు బినామీలుగా ఉన్న వ్యక్తులపై ఈ ఆస్తులు ఉన్నాయని ఏజెన్సీ ఆరోపించింది.

# ఇప్పటికైనా డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోండి

## ప్రధాని మోడీకి ఖర్గే ఘాటైన లేఖ

**న్యూఢిల్లీ,జూన్ 10:** లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవి ఖాళీగా ఉంటడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం ఘాటుగా లేఖ రాశారు. ఆలస్యం చేయకుండా వెంటనే ఈ పదవికి ఎన్నిక ప్రక్రియను ప్రారంభించాలని కోరారు లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవిని ఖాళీగా ఉండటం ప్రజాస్వామ్య సూత్రాలను విరుద్ధం. అలాగే రాజ్యాంగంలోని నిబంధనలను కూడా ఉల్లంఘించినట్లు అవుతుంది. మొదటి నుంచి 16వ వరకు అన్ని లోక్‌సభల్లో డిప్యూటీ స్పీకర్ ఉన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 ప్రకారం స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక తప్పనిసరి. స్పీకర్ తర్వాత లోక్‌సభలో రెండో అత్యున్నత స్థానం డిప్యూటీ స్పీకర్‌దే. కొత్తగా ఏర్పడిన లోక్‌సభ రెండో లేదా మూడో సమావేశంలో డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోవడం జరుగుతుంది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ నుంచి డిప్యూటీ స్పీకర్‌ను నియమించడం సంప్రదాయం అని లేఖలో ఖర్గే పేర్కొన్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో వరుసగా రెండు పర్యాయాలు ఈ పదవి ఖాళీగా ఉండటం ఇదే మొదటిసారని మల్లికార్జున ఖర్గే అన్నారు. 17వ లోక్‌సభలో ఈ పదవికి ఎన్నిక జరగలేదని, ప్రస్తుతం కొనసాగుతున్న 18వ సభలోనూ ఇదే కొనసాగుతోందని పేర్కొన్నారు. ముందుగా చెప్పిన విషయాలను దృష్టిలో పెట్టుకుని సభ సంప్రదాయాలకు, మన పార్లమెంట్ ప్రజాస్వామ్యసూత్రాలకు అనుగుణంగా వెంటనే లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రక్రియను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

# బీహార్‌లో బోగస్ పోలీస్‌స్టేషన్: యేడాదిపాటు యధేచ్ఛగా దందాలు



**పూర్ణియా,(బీహార్), జూన్ 10:** నకిలీ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి, దాదాపు ఏడాదిపాటు యథేచ్ఛగా అక్రమ కార్యకలాపాలు కొనసాగించిన షాకింగ్ ఘటన బీహార్‌లో వెలుగులోకి వచ్చింది. నిందితుడు రాహుల్‌కుమార్ షా పూర్ణియా జిల్లా పరిధిలోని మోహని గ్రామంలో ఈ నకిలీ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటుచేశాడు. గ్రామీణ రక్షాదళ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ స్థానిక యువతను నమ్మించి వారి నుంచి లక్షలరూపాయలు వసూలు చేశాడు. కానిస్టేబుల్, చౌకీదార్ వంటి పోస్టుల పేరుతో ఈ అక్రమ నియామకాలు చేపట్టాడు. ఒక్కో యువకుడి నుంచి రూ.2,500 నుంచి రూ.5,000వరకు దండుకున్నట్టు తెలుస్తోంది. ఇలా డబ్బులు చెల్లించిన వారికి పోలీసు యూనిఫాంలు, లాఠీలు, నకిలీ గుర్తింపు కార్డులు కూడా అందజేశాడు. వారితో గ్రామాల్లో పెట్రోలింగ్ చేయించడం, మద్యం అక్రమ రవాణాపై దాడులు నిర్వహించడం వచ్చిన డబ్బులో కొంత భాగం తాను ఉంచుకుని, మిగిలిన మొత్తాన్ని నకిలీ ఉద్యోగులకు పంచిపెట్టేవాడు. అంతేకాకుండా స్వాధీనం చేసుకున్న మద్యాన్ని లంచాలు తీసుకుని తిరిగి వారికే అప్పగించేవాడు. అయితే, ఇటీవల ఈ వ్యవహారం గుట్టురట్టవడంతో ప్రధాన సూత్రధారి అయిన రాహుల్ కుమార్ షా పరారయ్యాడు. అతడి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

11-6Pg6exHMNWJQE.qxd:11-6Pg6exHMNWJQE.qxd 01/01/01 8:52 AM Page 1



# ఎపిని డంపింగ్ యార్డ్ రహిత రాష్ట్రంగా మార్చడంలో భాగంగా పలు ప్రాంతాల సందర్శన



**విజయవాడ,జూన్10,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ను డంపింగ్ యార్డ్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు మున్సిపల్ శాఖ కసరత్తు చేస్తుంది...ముఖ్యంగా పట్టణాలు,నగరాల్లో ప్రతి రోజూ వచ్చే ఘన,ద్రవ వ్యర్థాల నిర్వహణ ను సమర్థవంతంగా చేయడం ద్వారా గమ్యాన్ని సాధించాలని ప్రణాళికలు రూపొందిస్తుంది..ఇప్పటికే రాష్ట్రంలో విశాఖపట్నం,గుంటూరు లో ఉన్న చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్ ల ద్వారా ఘన వ్యర్థాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు..త్వరలో మరో రెండు ప్లాంట్ల ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.. .అయితే ఘన వ్యర్థాల నుంచి కేవలం విద్యుత్ మాత్రమే కాకుండా కంపోస్ట్,ఇతర అవసరాలకు వినియోగించే పదార్థాలను కూడా తయారు చేస్తే మరింత ప్రయోజనం ఉంటుందని భావిస్తుంది...దీనికోసం పలు ప్రాంతాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్లను మంత్రి నారాయణ సందర్శిస్తున్నారు. తాజాగా వ్యర్థాల నిర్వహణకు సంబంధించి అధ్యయనం చేసేందుకు మంత్రి నారాయణ బృందం మహారాష్ట్ర,ఉత్తరప్రదేశ్ లో పర్యటించింది..సోమవారం సాయంత్రం పూణే చేరుకున్న మంత్రి నారాయణ బృందం....అక్కడి నుంచి పింప్రి చించివాడ్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఉన్నటువంటి వేస్ టూ ఎనర్జీ ప్లాంట్ ను సందర్శించింది. అక్కడ ఘన వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తిని ఏ విధంగా అక్కడ అధికారులు మంత్రి నారాయణ బృందానికి వివరించారు.. ఈ పర్యటనలో మంత్రి నారాయణతో పాటుగా స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు.. పింప్రి చించివాడ్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ లో ప్రతిరోజు కూడా 14 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు.ఇదే ప్లాంట్ లో విద్యుత్ తో పాటు బయోగ్యాసును కూడా ఉత్పత్తి చేస్తున్నారు.. ప్లాంట్ పనితీరు, విద్యుత్ వినియోగంపై మున్సిపల్ మంత్రి నారాయణ కు అక్కడి కార్పొరేషన్ అధికారులు వివరించారు. ఇక బుధవారం మంత్రి బృందం ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో చేరుకుంది.లక్నో చేరుకున్న మంత్రి నారాయణ బృందానికి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సుష్మా ఖరాక్వాల్, కమిషనర్ గౌరవ్ కుమార్ ఘనస్వాగతం పలికారు.. లక్నో వెళ్లిన మంత్రి బృందంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్, గ్రీనింగ్ కార్పొరేషన్ ఎండి శ్రీనివాసులు మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అలీమ్ భాష కూడా ఉన్నారు. లక్నోలో ప్రతిరోజు ఉత్పత్తి అవుతున్న ఘన వ్యర్థాలను పలు రకాలుగా విభజిస్తూ స్థానిక అవసరాలకు ఉపయోగిస్తున్నారు.. శివ్ ప్రాంతంలో ఉన్న ప్లాంట్ కు సంబంధించి ఘనవర్థాలను ఏరకంగా ఉపయోగిస్తున్నామనే అంశాలను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రి నారాయణ బృందానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తర్వాత క్షేత్రస్థాయి పరిశీలనకు బయలుదేరి వెళ్లింది మంత్రి నారాయణ బృందం. క్షేత్రస్థాయిలో సందర్శించింది. అక్కడ ఘన వ్యర్థాల నుంచి బయో గ్యాస్ తో పాటు చెత్త నుంచి వచ్చే పౌడర్ ద్వారా ఇటుకులను కూడా తయారు చేస్తున్నారు.ఆ తర్వాత లక్నోలో 200 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నటువంటి జ్ఞానేశ్వర్ మిశ్రా పార్కును మంత్రి నారాయణ బృందం సందర్శించింది..ఈ పార్కు లక్నో మున్సిపల్ కార్పొరేషన్ అద్భుతంగా నిర్మించింది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తో ఏపీ మంత్రి పొంగూరు నారాయణబేటీ లక్నోలోని కాళిదాస్ మార్గ్ లో ఉన్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ నివాసంలో ఆయన పురపాలకశాఖా మంత్రి పి,నారాయణ సమావేశమయ్యారు.



మీడియాకు వివరాలు తెలుపుతున్న అగస్టీన్

**విజయవాడ, జూన్ 10, ప్రభాతవార్త :**పైసా పెట్టుబడి లేకుండా గ్రామీణ మహిళలకు ఉపాధి, చిన్నారులకు కార్పొరేట్ విద్యనందించేలా రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రీస్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆలిండియా ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ డైరెక్టర్ ఆగస్టీన్ తెలిపారు. మంగళవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ గ్రామీణ విద్యాజ్యోతి భారత్ ప్రై లి. తో కలిసి తాము విద్యార్థులకు ప్రాథమికస్థాయి నాణ్యమైన విద్యను శాటిలైట్ డిజిటల్ టెక్నాలజీ ద్వారా ఇంటర్నెట్ లేకుండా అందిస్తామన్నారు. ప్రస్తుతం కేరళలో ఈ విద్యనందిస్తున్నామని, దీనిద్వారా గ్రామీణ మహిళలు స్వయం ఉపాధి శిక్షణ పొంది తమ కాళ్ళపై తాము నిలబడగలుగుతున్నారన్నారు. ఏఐపిఎస్ఎ న్యూఢిల్లీ నుండి మహిళలకు నర్సరీ టీచర్స్ ఉద్యోగ సృజనదారులుగా మారేలా జీవితాకాలం అవకాశం లభిస్తుందన్నారు. విద్యాజ్యోతి భారత్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి సోమశేఖర్ మాట్లాడుతూ మూడువేల ప్రీస్కూల్స్ ప్రారంభించే అవకాశముందని, ప్రతి స్కూల్‌కు రు.3లక్షల ఆర్థిక సాయాన్ని ఏఐపిఎస్ఎ అందిస్తుందన్నారు. మహిళలకు ఇంటర్ ఎంటిటిసి డిఈఎల్ఈడి డిగ్రీ అర్హత వుంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉపాధి అవకాశాలు (ప్రీస్కూల్ లీడర్లుగా) టీచర్ ట్రైనింగ్ లో సహాయం యుజిసి ఆమోదిత విశ్వవిద్యాలయ సర్టిఫికేషన్ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల సౌకర్యార్థం రథం సెంటర్లో సేవాకేంద్రం

### - నేడు ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

**ఇంద్రకీలాద్రి, జూన్ 10, ప్రభాతవార్త** బెజవాడ దుర్గమ్మవారిని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం రథం సెంటర్లో సేవా కేంద్రాన్ని ఇఒ వికె శీనానాయక్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఆయన ఈ మేరకు స్థల పరిశీలన చేసిన అనంతరం మాట్లాడుతూ శృంగేరి భవనం పక్కన కెనరా బ్యాంక్ వరకు వున్న స్థలంలో సేవాకేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. రాజధాని లో వున్న అమ్మవారి ఆలయానికి చేరుకోని ట్రాఫిక్ఇబ్బందులెదుర్కొని, టోల్‌గేట్‌ఫీ చెల్లించి, మొబైల్ డిపాజిట్ చేసి కొండమీదకు చేరుకోవడం లో ఇబ్బందులెదురవుతున్నాయని పలువురు భక్తులు సిఎం దృష్టికి తీసుకెళ్ళారని ఆ సమస్యకు పరిష్కారంగా ఈ సేవాకేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.దుర్గమ్మవారి భక్తులకు పూజా ద్రవ్యాలు, ఆటవస్తువులు విక్రయించే నిమిత్తం మహామండపంలోని 5వ అంతస్తులో 10/10 సైజు గల 19 షాపుల వేలం ఈనెల 11, 12 తేదీల్లో జరుగుతుందని ఆ వేలం ప్రక్రియ పారదర్శకంగా జరగాలని ఇఒ వికె శీనా నాయక్ అధికారులను ఆదేశించారు. సీల్డ్ టెండర్, బహిరంగ వేలం పారదర్శకంగా జరిగేలా 11 మంది అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు. వారితో ఇఒ సమీక్ష చేసి పై ఆదేశాలిచ్చారు. నేడు జెష్ఠమాసం పౌర్ణమి సందర్భంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఉదయం 5.55 లకు ఘాట్‌రోడ్డు వద్ద శ్రీకామధేను అమ్మవారి ఆలయం వద్ద ప్రారంభమై, కుమ్మరిపాలెం, విద్యాధరపురం, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి ల గుండా తిరిగి ఇంద్రకీలాద్రికి చేరుకుంటుందని, భక్తులు ఈ గిరి ప్రదక్షణలో పాల్గొని శ్రీ స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులవ్వాలన్నారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఇఓ

## జక్కంపూడి ఎకనమిక్ టౌన్‌షిప్ నిర్మాణ పెండింగ్ పనులు పూర్తికి ప్రభుత్వం నిర్ణయం

విజయవాడ, జూన్10, ప్రభాతవార్తప్రతినిధి:భ పారిశ్రామిక అభివృద్ధి కోసం ఎన్టీఆర్ జిల్లా వేమవరం గ్రామంలో నిర్మిస్తున్న జక్కంపూడి ఎకనమిక్ టౌన్‌షిప్ (జెట్ సిటీ) నిర్మాణ పెండింగ్ పనులు పూర్తి చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. 6.45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో చేపట్టిన జెట్ సిటి నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్ ఆదేశాలిచ్చారు. నిర్మాణానికి సంబంధించి ఫేజ్ 1లో భాగంగా నిర్మిస్తోన్న జెట్ సిటీని అభివృద్ధి చేసే ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతున్నట్లు ఆదేశాల్లో ప్రభుత్వం తెలిపింది. ఇండస్ట్రియల్ పార్కులు అభివృద్ధి చేస్తోన్న రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన వేమవరం జెట్ సిటీ నిర్మాణాన్ని తిరిగి పునరుద్ధరించింది. ఎంఎస్ఎంఈ కింద పరిశ్రమల స్థాపన, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ప్రభుత్వం సూచించింది. అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎపెడ్కో ఎండీ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, వీఎంసీ కమిషనర్ కు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది.

## ప్రైవేట్ ఆస్పత్రిలో కడ పి.డి. ఆకస్మిక తనిఖీ

### - కుప్పంలో వెలుగు చూసిన నకిలీ వైద్యుడి భాగోతం.. ఆస్పత్రి సీజ్‌కు చర్యలు !!
### - పోలీసుల అదుపులో నకిలీ వైద్యుడు..? ఇదివరకే మెడికల్ షాపు సీజ్ !!

**కుప్పం, జూన్ 10 ప్రభాతవార్త** కుప్పం పట్టణం ప్యాలస్ రోడ్‌లో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మంగళవారం రాత్రి కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆస్పత్రిలో నకిలీ వైద్యుడి భాగోతం వెలుగు చూసింది.దీంతో ఆస్పత్రిని సీజ్ చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామని కడ పి.డి. పేర్కొంటూ తగు చర్యల నిమిత్తం డిఎంహెచ్ఒకు ఆదేశించారు. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ కుప్పం శాఖ ఫిర్యాదుతో ఆస్పత్రిలో కడ పి.డి. తనిఖీ నిర్వహించారు. ఈసంఘటనకు సంబంధించి వివరాలిలా.. కుప్పం పట్టణం ప్యాలస్ రోడ్‌లో ఎ.ఆర్. హాస్పిటల్, నర్సింగ్‌హోంను డా॥ అరుణ్ అన్నాత్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నాడు. ఇతను ఈ కేంద్రంలో అన్ని రకాల నొప్పులు, అన్ని రకాల రక్తపరీక్షలు, చక్కెర వ్యాధి ట్రీట్‌మెంట్, కేన్సర్ ట్రీట్‌మెంట్,ప్రమాదాల ఎమర్జెన్సీ, అన్ని రకాల సర్జరీలు నిర్వహిస్తామని పెద్ద బోర్డు సైతం పెట్టాడు. ఇతను తన క్వాలిఫికేషన్ ఎంబిబిఎస్, ఎంఎస్‌గా పేర్కొంటూ సర్జికల్ ఆంకాలజిస్టుగా బోర్డులో పేర్కొన్నాడు. దీంతో కొంతకాలంగా ఆస్పత్రికి రోగులు వస్తూ వెళ్తున్నారు. కాగా గత నెలన్నర రోజుల క్రితం జిల్లా ఔషధ నియంత్రణ అధికారులు ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించి మెడికల్ షాపును సీజ్ చేశారు. ఇదిలా ఉండగా కుప్పం శాఖ ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ఫిర్యాదుతో మంగళవారం రాత్రి కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆస్పత్రికి చేరుకుని తనిఖీ చేశారు. ఆస్పత్రి, వైద్యుడి రికార్డులు పరిశీలించగా అరుణ్ అన్నాత్ నకిలీ వైద్యుడని తేలినట్లు సమాచారం.అతని వద్ద ఎలాంటి సర్టిఫికెట్లు లేవని తేలడంతో ఆస్పత్రి సీజ్‌కు కడ పి.డి. జిల్లా వైద్యఆరోగ్యఅధికారిని ఫోన్‌లో ఆదేశించారు. కాగా నకిలీ వైద్యుడిని కుప్పం పోలీసులు అదుపులో తీసుకున్నట్లు తెలిసింది. కార్యక్రమంలో కడ సలహామండలి సభ్యులు డా॥ బిఆర్ సురేష్‌బాబు, కుప్పం ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటిండెంట్ డా॥ విజయకుమారి, కౌన్సిలర్ జిమ్‌దాము, స్థానిక వైద్యులు డా॥ సురేష్ మునిరత్నం, డా॥ క్రాంతి పాల్గొన్నారు.



నకిలీ వైద్యుడ్ని విచారిస్తున్న కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్

## అడవుల పరిరక్షణపై ప్రభుత్వ సలహాదారుగా అంకారావు

**విజయవాడ జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** నల్లమల అడవులను కాలుష్యం బారి నుంచి కాపాడేందుకు విశేషకృషి చేస్తున్న పర్యావరణవేత్త కొమెర అంకారావును రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన రెండేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగుతారని తెలిపింది. ఈ నియామకం విధివిధానాన్ని త్వరలో జారీచేస్తామని పేర్కొంది. అంకారావు రెండు దశాబ్దాలకు పైగా నల్లమల అడవుల్లో ప్లాస్టిక్ వ్యర్థాల్ని తొలగించడాన్ని ఒక యజ్ఞంలా కొనసాగిస్తున్నారు. ఆయన కృషిని గుర్తించిన సీఎం చంద్రబాబు అంకారావును ప్రభుత్వ సలహాదారుగా నియమించారు.

## ఉద్యోగుల ఆరోగ్యసంక్షేమంలో అలసత్వం ఉండదు

### - నిబంధనల ప్రకారం పదోన్నతులు,బదిలీలు: ఇఒ



**తిరుమల,జూన్ 10ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి తరలివస్తున్న భక్తులకు ఇతోధిక సేవలందిస్తున్న టిటిడి ఉద్యోగుల సమస్యలను నిర్దేశించిన సమయంలో పరిష్కరిస్తామని, ఉద్యోగుల ఆరోగ్యసంక్షేమంలో ఎంప్లాయీస్ హెల్త్‌కేర్ ఫండ్ కేటాయింపులో జాప్యం లేకుండా చూస్తామని టిటిడి ఇఒ జె.శ్యామలరావు తెలిపారు. ఆయా విభాగాల అధికారులు కూడా ఇందుకు తగ్గట్లు పనిచేయాలని ఆదేశించారు. టిటిడి పరిధిలోని ఉద్యోగుల సమస్యలను నిర్దేశించిన సమయంలో పరిష్కరించాలన్నారు. ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలు, కారుణ్యనియామకాలు,ఇతర అలవెన్స్ ల చెల్లింపులు సకాలంలో పూర్తిచేయాలన్నారు. మంగళవారం టిటిడిలోని వివిధ శాఖల ఉన్నతాధికారులతో పరిపాలనభవనంలో జెఇఒ వి.వీరబ్రహ్మం, సిఇ సత్యనారాయణ, డిఎల్ఒ వరప్రసాద్‌రావు, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి సమీక్షించారు. నిబంధనల ప్రకారం ఇప్పటికే కేటాయించిన ఇళ్ళస్థలాల విషయంలో వివిధ శాఖల అనుమతుల విషయంలో సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటుచేయాలన్నారు. ఆ ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, ఇతర ఇంజనీరింగ్ ,మౌలిక సదుపాయాలు టిటిడి ఉన్నతాధికారులు చర్చించాలన్నారు. ప్రభుత్వస్థాయిలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఇఒ శ్యామలరావు అన్నారు.



వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

# సబ్సిడీతో రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ..

### - పెడపల్లిలో వేరుశనగ కాయల పంపిణీ కార్యక్రమంలో మంత్రి సవితా, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**అనంతపురం, జూన్ 10 ప్రభాతవార్త బ్యూరో** రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతిగా పనిచేస్తున్నారని రాష్ట్ర బీసీ చేనేత సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత పేర్కొన్నారు. పుట్టపర్తి మండలంలోని పెడపల్లి గ్రామంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డితో కలిసి మంత్రి సవితా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఖరీఫ్ సీజన్లో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలను ప్రభుత్వ సబ్సిడీతో రైతులకు అందిస్తోందని తెలిపారు. ఇది రైతు మేలు కోరే మంచి ప్రభుత్వమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జూన్ 21 నుంచి అన్నదాత సుఖీభవ ద్వారా రైతుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత కింద 7000 కేంద్రం ఇచ్చే 2000 కలిపి మొత్తం రూ.9000 డబ్బులు జమ చేస్తోందని తెలిపారు. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పోలవరం రాజధాని నిర్మాణంతోపాటు ప్రతి గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వాన్ని రైతు సంక్షేమ ప్రభుత్వంగా అభివర్ణించారు. గత వైసిపి పాలనలో రైతు సంక్షేమాన్ని జగన్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్పు ,స్ప్రింకర్లు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. 2014 నుంచి 19 వరకు అప్పటి టిడిపి ప్రభుత్వం హయాంలో సుమారు 1400 కోట్లు రైతుల వ్యవసాయ పరికరాల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిధులు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో రైతాంగం సమస్యలపై తక్షణం స్పందించి అన్ని విధాలుగా ఈ ప్రభుత్వం వారిని ఆదుకుంటుందని తెలిపారు. వ్యవసాయంలో కూడా డ్రోన్ టెక్నాలజీతో రైతులకు ఖర్చు తగ్గించి ఆదాయాన్ని చేకూర్చే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఓటమి ప్రభుత్వం రైతుల ముందుకు తీసుకొచ్చిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ నూతన టెక్నాలజీని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని కొనియాడారు. జిల్లాలో 14 వేల ఎకరాల్లో పంటలు చేసుకున్న రైతులు వ్యవసాయ పరికరాలు డ్రిప్ ఇరిగేషన్ కోసం దరఖాస్తు చేసుకుంటే అందులో సుమారు 12 ఎకరాలల్లో డ్రిప్పు,

స్ప్రింకర్లను ప్రభుత్వం అందించిన విషయాన్ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది మంచి ప్రభుత్వమని రైతు సంక్షేమ ప్రభుత్వం అని అభివర్ణించారు. రైతులు ఈ ప్రభుత్వాన్ని ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకుని ప్రభుత్వం అందించే వ్యవసాయ రాయితీ పథకాలను సద్వినియం చేసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరారు. అనంతరం రైతులకు విత్తన వేరుశనక్కాయల బస్తాలను మంత్రి సవితతో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు.

## రాష్ట్రంలో అరాచక పాలన : వైఎస్సార్సీ నేతలు

### ఎంసి విజయానందరెడ్డి, నారాయణస్వామిలు

**చిత్తూరు, జూన్ 10 ప్రభాతవార్త:** రాష్ట్రంలో సిఎం నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని డిప్యూటీ సిఎం నారాయణస్వామి, చిత్తూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జ్ ఎంసి విజయానందరెడ్డి ధ్వజమెత్తారు. చిత్తూరులోని విజయానందరెడ్డి కార్యాలయంలో మంగళవారం మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి, ఎంసి విజయానందరెడ్డిలు విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో మహిళలపై అరాచకాలు అధికం అయ్యాయని, కూటమి ప్రభుత్వానికి కళ్ళు లేదని మహిళలకు తగిన రక్షణ కల్పించాలని కోరుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడు జరుగని విధంగా అరాచకాలు, దౌర్జనాలు జరుగుతున్నాయని, సాక్షి పత్రిక సీనియర్ జర్నలిస్టును కూటమి ప్రభుత్వం తప్పుడు కేసు బనాయించిందని ధ్వజమెత్తారు. గతంలో మంత్రి రోజాపై అయ్యన్నపాత్రుడు అవమానించినప్పటికీ అప్పటి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మహిళల రక్షణ కోసం అప్పటి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దిశా యాప్ తీసుకువస్తే ఈ ప్రభుత్వం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై కోపంతో దిశా యాప్ లేకుండా చేశారన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి, ఎంసి విజయానందరెడ్డిలు

## నేడు మహిళా కమీషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ రాక

**అనంతపురం కలెక్టరేట్, జూన్ 10 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ మహిళా కమీషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అనంతపురం జిల్లాలో రెండు రోజుల పర్యటనకు రానున్నట్లు ఐసిడిఎస్ పిడి నాగమణి మంగళవారం తెలిపారు. బుధ, గురువారాల్లో ఆమె అనంతపురం జిల్లాలో పర్యటించనున్నట్లు వివరించారు. బుధవారం రాత్రి 7.30 గంటలకు అనంతపురం ఆర్అండ్‌బి అతిథి గృహానికి ఆమె చేరుకుంటారు. 8 గంటల నుండి అక్కడే విశ్రాంతి తీసుకుంటారు. గురువారం ఉదయం 9 గంటలకు ఆర్అండ్‌బి అతిథి గృహంలో ప్రెస్ మీట్ నిర్వహిస్తారు. 10 గంటలకు స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని సఖి సెంటర్ ను సందర్శిస్తారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న మైనర్ బాలికను పరామర్శిస్తారు. దారుణ హత్యకు గురైన ఇంటర్ విద్యార్థిని తన్మయి కుటుంబాన్ని 11 గంటలకు సందర్శించి ఆమె తల్లిదండ్రులను పరామర్శిస్తారన్నారు.

# వైసిపి నేత సజ్జల తీరు జుగుప్సాకరం

### ఎంఎస్ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయనగరం, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి :** సాక్షి మీడియా జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టుపై వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డి ప్రతిస్పందించిన తీరు జుగుప్సాకరంగా ఉందని రాష్ట్ర ఎంఎస్ఎంఇ,ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ, సెర్ప్‌శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. విజయనగరంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో జరిగిన అకృత్యాలు అన్నింటికి ప్రత్యక్ష సాక్షి, బాధ్యులైన సజ్జల రామకృష్ణారెడ్డి నేడు నీతి కబుర్లు చెబుతున్నారని మంత్రి శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. సాక్షి మీడియాలో అమరావతి పట్ల విషయం చిమ్మటం కొత్తకాదని, గతంలోనూ అనేక సార్లు ఇలాంటి కుట్రలు చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి టివిలో జరిగిన చర్చ, అందులో సీనియర జర్నలిస్టు కృష్ణంరాజు వ్యాఖ్యలు ద్వారా వారి ఉద్దేశాలను బయటపడ్డాయని మంత్రి పేర్కొన్నారు. సాక్షి మీడియాలో అనుచిత వ్యాఖ్యల పరిణామాలపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఇప్పటికీ స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. ఈ మొత్తం సంఘటన పరిశీలిస్తే వైకాపా నాయకుల ప్రోత్సాహంతోనే కృష్ణంరాజు ఇలాంటి వ్యాఖ్యలు చేశారని స్పష్టమవుతున్నదని అన్నారు. ఇంకోసారి మహిళల పట్ల అసభ్యకర వ్యాఖ్యలు చేయాలంటే భయపడేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చర్యలు ఉండాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం అమరావతి, పోలవరం నిర్మాణం వేగవంతం చేయడంతో తమ రాజకీయ పునాదులు కదిలిపోతాయని వైకాపా నాయకులు భయపడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. అందులో భాగంగానే అమరావతి మహిళలపై దిగజారుడు వ్యాఖ్యలు చేసి అడ్డంగా సమర్థించుకుంటున్నారని మంత్రి శ్రీనివాస్ అన్నారు. తాము తప్పుచేసి ప్రశ్నించిన వారిని సంకరజాతి అని అనడం ఆయన పైశాచిక మనస్థత్వానికి నిదర్శనమని సజ్జలపై విమర్శలు గుప్పించారు. పెద్ద వయసు ఉన్న సినియర్ జర్నలిస్టును వారెంట్ చూపించకుండా ఎఫ్ఐఆర్ చూపించి అరెస్టు చేశారని చెప్పడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. తమ హయాంలో అర్ధరాత్రి అరెస్టు చేసిన కొల్లు అంకబాబు (74), రంగనాయకమ్మ (80) లాంటి వృద్దులను కేవలం వాట్సాప్‌లో సమాచారం షేర్ చేశారన్న సాకు చూపించి అరెస్టు చేసిన విషయం ప్రజలు ఇంకా మరిచిపోలేదని ఆయనగుర్తు చేశారు.

## గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

### - 3 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు

**నెల్లూరు క్రైమ్, జూన్ 10, ప్రభాతవార్త:** తమిళనాడు రాష్ట్రానికి అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు సోమవారం అర్ధరాత్రి గూడూరు రైల్వే స్టేషన్ లో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను నెల్లూరు రైల్వే డిఎస్పి జి మురళీధర్ మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు రైల్వే డిఐజి సత్య ఏసుబాబు ఆదేశాల మేరకు నెల్లూరు రైల్వే డిఎస్పి మురళీధర్ నేతృత్వంలో, జిఆర్‌పిసిఐఎ సుధాకర్ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా నెల్లూరు రైల్వే సర్కిల్ పరిధిలోని పలు రైల్వే స్టేషన్లలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించే చర్యలో భాగంగా విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి ఎర్నాకులం వెళ్తున్న రైలు నుండి గూడూరులో దిగిన జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన దేవదాస్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా తచ్చాడుతుండడంతో అక్కడ తనిఖీలు చేపడుతున్న గూడూరు రైల్వే పోలీస్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద మూడు కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని చెన్నైకు బస్సు మార్గంలో తరలించేందుకే అతను ట్రైన్ దిగినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో అదుపులోకి తీసుకున్న నిందితుడని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

## వైసిపి హయాంలో అనేక మంది మహిళలు కనిపించకుండా పోయారు

### - మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆరోపణ

**అనంతపురం, జూన్ 10 ప్రభాతవార్త బ్యూరో** గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మహిళలు ఎందరో కనిపించకుండా పోయారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆరోపించారు. మహిళలను కించపరిచే విధంగా వైసిపి వారు యత్నిస్తున్నారని దీన్ని తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన వెల్లడించారు. అనంతపురంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని అంటున్న వారే... అమరావతి వేశ్యల రాజధాని అని మహిళలను అవమానించారు అని ఆయన ఆరోపించారు. గతంలో తాడేపల్లిలో జగన్ ఇంటి దగ్గర మహిళలపై జరిగిన దాడులు, అత్యాచారాలు మర్చిపోయారా?? అని ఆయన ప్రశ్నించారు. గత వైసిపి ప్రభుత్వంలో అనేకమంది మహిళలు కనిపించకుండా పోయారు అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే వాళ్ళు ఎక్కడున్నారో తెలియదు అని ఆయన చెప్పారు. దృష్టి మరల్చడం కోసం ఇలాంటివి మాట్లాడుతున్నారని, గడిచిన ఐదేళ్లలో మీడియాతో సహా ఎవరూ బయటికి రాలేదు... మాట్లాడే స్వేచ్ఛ లేకుండా అనిచివేశారని మంత్రి సత్య కుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. తప్పు చేసిన వారిని లోకేష్ తన రెట్ బుక్‌లో రాసి పెట్టుకున్నారు అని, ప్రజల కూడా చట్టపరంగా శిక్షించాలని కోరుకుంటున్నారు. ఆయన చెప్పారు. తప్పుడు పనులు చేసిన వైసీపీ నాయకులు చట్టపరంగా కోర్టుల ద్వారా ఉపశమనం పొందవచ్చు అని ఆయన అన్నారు. వైయస్ జగన్ తన చానల్‌లో అమరావతి మహిళల గురించి వేశ్య అని మాట్లాడినప్పుడు తప్పు అని చెప్పి ఉండాల్సింది అని మంత్రి చెప్పారు. మహిళల అవమానిస్తే కడుపు మండి కేసులు పెడితే జగన్ అలాంటి వాటిని ఖండిస్తున్నారు అని ఆయన వివరించారు. జైలుకు వెళ్ళి పరామర్శించడం... అరెస్టులను ఖండించడం... బెంగళూరుకి వెళ్లిపోవడం... ఇది జగన్ చేస్తున్న మూడు పనులు అని మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు.

## అమరావతి మహిళలపై కృష్ణంరాజు వ్యాఖ్యలు.. సుమోటోగా తీసుకున్న ఎన్‌సిడబ్ల్యూ

**విజయవాడ జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి మహిళలను ఉద్దేశించి సాక్షి ఛానెల్‌లో జర్నలిస్టు కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర డీజీపీకి కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ లేఖ రాశారు. కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను ఎన్‌సీడబ్ల్యూ తీవ్రంగా ఖండించింది. ఈ వ్యవహారంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని డీజీపీని ఆదేశించింది. అమరావతి ఉద్యమంలో మహిళా రైతులు కీలకపాత్ర పోషించారని మహిళా కమిషన్ పేర్కొంది. కృష్ణంరాజు వ్యాఖ్యలపై మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా సుమోటోగా తీసుకుని విచారణకు ఆదేశించింది.

# సదరం సర్టిఫికెట్ల ఆధారంగానే సంక్షేమ పథకాలు

## పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త: సదరం సర్టిఫికెట్ల జారీలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, అందుకే అర్హులు చాలా మంది నష్ట పోయారని మంత్రి సీతక్క ఆరోపించారు. బేగంపేట లోని టూరిజం ప్లాజాలో సదరం ధ్రువీకరణ పత్రాల కోసం వైకల్య గుర్తింపుపై డాక్టర్లకు వర్క్ షాప్ నిర్వహించారు. మంగళవారం కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్లకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గత అనుభవాల దృష్టిలో దివ్యాంగుల్లో వైకల్యాన్ని గుర్తించేందుకు డాక్టర్లకు రాష్ట్ర చరిత్రలో మొదటి సారి వర్క్ షాపును నిర్వహిస్తున్నామని తెలిపారు.ఎలాంటి వైకల్యం ఉంది, ఎంత శాతం మేర వైకల్యం ఉంది అనే అంశాన్ని డాక్టర్లు పక్కాగా గుర్తించి సదరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 38 ఆస్పత్రుల్లో సదరం సర్టిఫికెట్ల జారీ కోసం అంగవైకల్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ఒక్కో ఆస్పత్రికి పది లక్షల చొప్పున మొత్తం రూ.3.8 కోట్లను రిలీజ్ చేసినట్లు స్పష్టం చేశారు. ఉద్యోగ ఉపాధి రంగాల్లో రిజర్వేషన్, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం వంటి స్వయం ఉపాధి పథకాలకు సదరం సర్టిఫికెట్స్ ఆధారమన్నారు. అందుకే డాక్టర్లు మానవతను జోడించి వైకల్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. దివ్యాంగులకు ఆత్మగౌరవం దక్కాలంటే దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ ఇవ్వకపోతే వారికి తీవ్ర అన్యాయం. చేసినట్టు అవుతుం దని అన్నారు. ఈ సదరం సర్టిఫికెట్ల ఆధారంగానే ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. చేయూత పెన్షన్, డాక్టర్లు పక్కాగా పరీక్షలు నిర్వహించి సదరం సర్టిఫికెట్లు ఇవ్వాలని సూచనలిచ్చారు.అర్హులు ఎవరు నష్టపోకూడదని, వైద్య వృత్తి అంటే ప్రాణం పోసే వృత్తి అని చెప్పారు. 21 రకాల వైకల్యాలను గుర్తించి సదరం సర్టిఫికెట్లు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారని గుర్తుకు చేశారు.సిఎం అదేశాలకు అనుగుణంగా ప్రత్యేక క్యాంపులు నిర్వహించి సర్టిఫికెట్లు ఇస్తున్నామని చెప్పారు. వైకల్యాన్ని సరిగ్గా నిర్ణయించేందుకు డాక్టర్లుకు ఓరియంటేషన్ ఇప్పిస్తున్నామన్నారు. ఎంతో అనుభవం ఉన్న వైద్య నిపుణులతో డాక్టర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సర్టిఫికెట్ల ఆధారంగానే దివ్యాంగులకు ఉపాధి, ఉద్యోగం, ఆత్మగౌరవం లభిస్తుందన్నారు. ఈ పవిత్ర యజ్ఞంలో దివ్యాంగు లందరికి డాక్టర్లు అండగా నిలవాలన్నారు. దివ్యాంగలు పరికరాల కోసం ప్రతి సంవత్సరం రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఓరియంటేషన్ కార్యకమ్రానివకి 200లకు పైగా డాక్టర్లు హాజరైనట్లు చెప్పారు.

# తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టుపెట్టిన సిఎం రేవంత్

## బిజెపి ఎంపి డా.లక్ష్మణ్

హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాకట్టు పెడుతున్నాడని రాజ్యసభ ఎంపి లక్ష్మణ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో మీడియాలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సిఎం రేవంత్ రెడ్డి టూర్లు వేస్తున్నారని అన్నారు. 46వ సారి హస్తినకు వెళ్లాడని సెటైర్లు వేశారు. ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేసిన దాఖలాలు లేవు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కు అన్న చందంగా మారిందని అన్నారు. ఆనాడు ప్రధానిగా ఉన్న రాజీవ్ గాంధీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న అంజయ్యను అవమానిస్తే తెలుగు ప్రజలు తిరగబడ్డారని అన్నారు. కానీ నేడు రేవంత్ హైకమాండ్ దగ్గర తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవం దెబ్బతింటే తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరని రానున్న రోజుల్లో సరైన గుణపాఠం చెబుతారని లక్ష్మణ్ అన్నారు.



బిసిల భవిష్యత్ కార్యాచరణపై జరిగిన సదస్సులో పాల్గొన్న ఆర్. కృష్ణయ్య, మధుసూదనాచారి, తాడూరి శ్రీనివాస్, గుజ్జ సత్యం తదితరులు

# బిసిలకు అన్యాయం చేస్తున్న రేవంత్‌రెడ్డి

## రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య విమర్శ

హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ పాలసీ వ్యతిరేకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిసిలకు అన్యాయం చేస్తున్నారని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. మంగళవారం 'తెలంగాణ బిసి బిల్లుకు కేంద్ర ప్రభుత్వ మద్దతు కోసం భవిష్యత్ కార్యాచరణ' అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం బిసి విధానాలను అమలుచేస్తూ తన మంత్రివర్గంలో 27 మంది బిసిలకు మంత్రిపదవులు కల్పించారు. సిఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లు రాష్ట్రంలో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పి స్తామన్నారు. దీనిప్రకారం ఆయన మంత్రివర్గంలో ఆరుగురికి అవకాశం కల్పించాల్సిందిపోయి ముగ్గురు బిసిలకు మాత్రమే మంత్రిపదవులు కల్పించారని విమర్శించారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి బిసిల పట్ల తన వైఖరి మార్చుకోకుంటే ఉప్పెన వస్తుందని ఆయన హెచ్చరించారు. శాసనమండలి బిఆర్ఎస్ పక్ష నాయకుడు మధుసూదనాచారి మాట్లాడుతూ రాష్ట్రంలో బిసి లను రెండోశ్రేణి పౌరులుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిసిలు అసమానతలకు గురవుతున్నారని, పాలకవర్గం కుట్రలకు బలైపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎంబిసి కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సెన్‌సెస్‌ను శాస్త్రీయ బద్ధంగా చేయడానికి ముందుకు వచ్చిందన్నారు. సమావేశంలో బిసి నేతలు నీలం వెంకటేష్, రాజేందర్, శారదాగౌడ్,అనంతయ్య, పి.సతీష్, కోల జనార్థన్, ఎ.రాజు నేత, మణికంఠ, భాస్కర్, లింగస్వామి, ఆదిమల్లేశం తది తరులు పాల్గొని మాట్లాడారు.

# వారం రోజుల దాడుల్లో 1,188 మద్యం బాటిళ్ల సీజ్

## స్పెషల్‌డ్రైవ్‌లో రూ. 25 లక్షల మద్యం స్వాధీనం

హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త: ఎన్‌డీపీఎల్ (నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ ) పై వారం రోజుల పాటు చేపట్టిన స్పషల్ డ్రెవ్ సక్సెస్ అయ్యింది.ఈ నెల 3 నుంచి 9 వరకు తెలంగాణ వ్యాప్తంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో రూ. 25 లక్షల విలువ చేసే లిక్కర్, బీర్, దేశీదారు మద్యాన్ని ఎక్సైజ్ శాఖ సీజ్ చేశారు. ఈ దాడుల్లో ఎస్‌టిఎఫ్, ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, డిటిఎఫ్ టీమ్‌లతో పాటు ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది కలిసి నిర్వహించిన దాడుల్లో 64 కేసులు నమోదు చేశారు. 33 మందిని అరెస్టు చేసి 19 వాహనాలను సీజ్ చేశారు. దాడుల్లో 1188 మద్యం బాటిళ్లు, 22 లీటర్ల బీరు బీటిళ్లు, 21 లీటర్ల దేశీదారులిక్కర్‌ను ఎక్సైజ్ శాఖ సీజ్ చేశారు.

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా..ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌డెరెక్టర్ షానవాజ్ ఖాసీం ఇచ్చిన అదేశాల మేరకు ఢిల్లీ,గోవా నుంచి వచ్చె రైళ్లలో ఎస్ టి ఎఫ్ టీమ్‌లు తనిఖీలు నిర్వహించి మద్యం బాటిళ్లను పట్టుకున్నారు.

సికిందకాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానం వచ్చిన వారి బ్యాగులను తనిఖీలు నిర్వహించిన క్రమంలో 40 మద్యాం బాటిళ్లను పట్టుకున్నారు.గోవా నుంచి వాస్కోడిగామా రైలును ఎస్ టి ఎఫ్ టీమ్‌లతోపాటు వికారాబాద్‌కు చెందిన ఎక్సైజ్, డీటిఎఫ్ సిబ్బంది కలిసి జరిపిన దాడుల్లో నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ మద్యం పట్టుకున్నారు.ఏసీ రంగారెడ్డి,శంషాబాద్ డీటిఎఫ్‌జరిపిన దాడుల్లో పెద్ద మొత్తంలో ఎన్‌డీపీఎల్ మద్యం పట్టు బడింది. గోవా ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న మద్యంతోపాటు డిఫెన్స్ మద్యం బాటిళ్లను పెద్ద మొత్తంలో పట్టుకున్నారు. శంషాబాద్, సరూర్‌నగర్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, హైదరాబాద్, సికింద్రాబాద్, సంగారెడ్డి, మెదక్, వరంగల్ అర్బన్, కరీంనగర్‌లో ఎక్సైజ్‌శాఖ దాడులు నిర్వహించి నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ ను పట్టుకున్నారు. ప్రొహిబిషన్,ఎక్సైజ్ డెరెక్టర్ ఆధ్వర్యంలో గత వారం రోజుల్లో ఎస్‌టి ఎఫ్,ఎన్‌ఫోర్స్,డిటిఎఫ్ టీమ్‌లతోపాటు ఎక్సైజ్ యంత్రాంగం చేపట్టిన దాడులు మంచి పలితాలు ఇచ్చాయి.ఇదేతీరును అన్నిటీమ్‌లు నిరంతరం దాడులు నిర్వహించి నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను అరికట్టాలి. నాన్‌పెయిడ్ లిక్కర్‌ను వినియోగదారులు ఎవ్వరు వినియోగించ వద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ షానవాజ్ ఖాసీం అధికారులను ఆదేశించారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

# ఆషాఢ బోనాలకు భారీ ఏర్పాట్లు

## 26న తొలి బోనం గోల్కొండలో నిర్వహణ

### ఏర్పాట్లపై మంత్రులు కొండా సురేఖ, పొన్నం సమీక్ష

హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త : ఆషాఢ మాస బోనాల ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. మొత్తం 28 దేవాలయాల్లో ఆషాఢ బోనాల జాతర ఘనంగా జరపాలని, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని శాఖలు సమన్వయం చేసుకుంటూ పని చేయాలని మంత్రి కొండా సురేఖ సూచించారు.బోనాల నిర్వహణకు బడ్జెట్ లోటు కూడా లేదని, ప్రభుత్వం ఇప్పటికే రూ. 20 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. మరిన్ని నిధులు అవసరమైతే సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు కేటాయిస్తామని, ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని వెల్లడించారు. భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.గత ఏడాది ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ ఇబ్బంది పడ్డారని, ఈసారి అలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా అధికారులు ప్రత్యేక కార్యచరణ రూపొందించుకొని పద్భందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జూన్ 26న తొలి బోనం గోల్కొండలో ప్రారంభం అవుతుంది.ఆ తర్వాత బల్కంపేట, ఉజ్జయిని మహంకాళీ, లాల్ దర్వాజ బోనాలు ఉంటాయి. రంగం, తొట్టెల ఊరేగింపు కూడా ఉంటుంది.అందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రులు అధికారులను ఆదేశించారు.దేవాలయాలకు ఇచ్చే చెక్స్ రెవెన్యూ ఎండోమెంట్ కోఆర్డినేట్ చేసుకొని పండుగలకు ముందే పూర్తి చేయాలని, అధికారులు ఉద్యోగం లాగ కాకుండా సేవ చేస్తున్నామనే దృక్పథంతో పని చేయాలని మంత్రులు సూచించారు.శాంతి, భద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు అన్ని శాఖలతో సమన్వయం చేసుకోవాలని, అధికారులు ఎక్కడా లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మంత్రులు ఆదేశించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో జరిగిన ఈ ఆషాడమాస బోనాల రివ్యూ మీటింగ్‌లో స్థానిక ప్రజా ప్రతినిధులు,ఆలయ కమిటీల చైర్మన్లు, సభ్యులతోనూ సమావేశం కొనసాగింది.ఆలయాల్లో నెలకొన్న సమస్యలపై అందరి అభిప్రాయాలు సేకరిస్తూ బోనాల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసేందుకు మంత్రి కొండా సురేఖ వారికి దిశానిర్దేశం చేశారు.ఈ సమన్వయ సమీక్షా సమావేశంలో జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మీ, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్,దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డీజీపీ జితేందర్,ఎండోమెంట్ డైరెక్టర్ వెంకటరావు, సిపి సివి ఆనంద్, జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఉక్కు మనిషి.. మోడీ ట్రంప్ మనిషి

## కులాలు, మతాల చిచ్చు తప్ప పాలన తెలియని ప్రధాని

### యుద్ధవిమానాల లెక్క చెప్పడానికి జంకుతున్న మోడీ ప్రభుత్వం

### షాద్‌నగర్ సభలో బిజెపిపై పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ విసుర్లు

షాద్‌నగర్, ప్రభాతవార్త, జూన్ 9: పాకిస్థాన్‌తో ధైర్యంగా భారత్ యుద్ధ రంగం లోకి దిగింది.. అమెరికా మధ్యవర్తిత్వాన్ని తిప్పికొట్టింది.. పాకిస్థాన్‌ను తేరు కోలేని దెబ్బ కొట్టింది.. అది ఇందిరమ్మ ఘనత.. ఆమె ఉక్కు మనిషి.. మరి మోడీ మనవాళ్లను కాపాడడంలో విఫలమయ్యారు. చంపిన వాళ్లను శిక్షిం చడంలో తోక ముడిశారు. చివరకు యుద్ధాన్ని కూడా అర్థాంతరంగా ఆపి ట్రంప్‌నకు దాసోహం అన్నారు. ఇందిరమ్మతో మోడీకి పోలిక ఏమిటి? మోడీ పదవుల కోసం పుట్టిన మనిషి.. గాంధీ కుటుంబం త్యాగాల కోసం పుట్టింది.. అని పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. షాద్‌నగర్ లో మంగళవారం జరిగిన జైబాపు.. జైభీమ్.. జైసంవిధాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఓవైపు మత విద్వేషాలను రెచ్చగొడుతూ, మరోవైపు బయటి దేశాలకు ఊడిగం చేస్తున్న మోడీ నుండి ప్రజలను కాపాడేందుకు, దేశ సమగ్రతను ఆవిష్కరించేందుకు సమయం ఆసన్నమైందన్నారు. కులమతాల మధ్య చిచ్చుపెట్టి, దానినే రాజకీయంగా భావించే బిజెపికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగాన్ని తొలగించి మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావడానికి బిజెపి కుట్ర చేస్తుందని ఆరోపించారు. దేశ సంపదలో 40 శాతం అంబానీలకు, ఆదానీలకు అంటగడుతూ దళిత వర్గాలకు మట్టిని మిగిలిస్తున్న హీనస్థితి, దీన స్థితి భారతీయ జనతా పార్టీదని ఆయన అన్నారు. అందుకే కులగణన ద్వారా ఎవరి శాతం ఎంతో తెలుసు కునేందుకు రాహుల్‌గాంధీ పట్టుపట్టారని పేర్కొన్నారు. రాష్ట్రంలో దళితులు, గిరిజనులు, బీసీలకు మంత్రి పదవులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కి దక్కుతుందన్నారు. దేశానికి నిజమైన శత్రువులు మోడీ, అమిత్ షా అని ఆయన ఆరోపిం చారు. పాకిస్థాన్‌తో యుద్ధం అర్థాంతరంగా ఎందుకు ఆపాల్సి వచ్చిందో, అసలు ఎన్ని యుద్ధ విమానాలు నేల కూలాయో లెక్క చెప్పడానికి కూడా భయ పడుతున్న మోడీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ట్రంపు చెప్పగానే యుద్ధం ఆపడం వెనక ఆంతర్యం ఏమిటో ప్రజలు గుర్తిం చాలన్నారు. రాష్ట్రంలో పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ పార్టీ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తే, అదే పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థను బీజేపీ సర్వనాశనం చేసిందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, చైర్మన్ చల్లా నరసింహ్మా రెడ్డి, ఎన్‌టీయూసీ నాయకుడు కరుణాకర్, జై బాపు, జై భీమ్.. జై సంవిధాన్ ఇంచార్జి తారా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ సభలో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

# ప్రతి జిల్లాలో మోడల్ ఇంక్లూజివ్ స్కూల్ ఏర్పాటు చేయాలి

## కేంద్రమంత్రి బండి సంజయ్‌కు సెటా వినతి

### కేంద్ర విద్యాశాఖ మంత్రి కార్యాలయానికి లేఖ రాసిన మంత్రి

హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ మోడల్ ఇంక్లూజివ్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్(ఎస్ఈటిఏ) తెలంగాణ రాష్ట్ర కమిటీ కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి విజ్ఞప్తి చేసింది. కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని ఆయన క్యాంప్ కార్యాలయంలో సెటా ప్రతినిధులు కలిసి.. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో మోడల్ ఇంక్లూజివ్ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించినట్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల రాజేంద్రప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అట్ల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ వినతిపత్రంపై స్పందించిన మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేక అవసరాల గల విద్యార్థుల కోసం వెంటనే స్పందిస్తూ సంబంధిత విషయంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి పర్సనల్ సెక్రటరీ ప్రవీణ్ పి నాయర్‌కి లేఖ రాసినట్టు తెలిపారు.

తాము సమర్పించిన లేఖకి స్పందించి కేంద్ర విద్యా శాఖ మంత్రికి లేఖ రాసినందుకు సెటా రాష్ట్ర అధ్యక్షులు బత్తుల రాజేంద్రప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అట్ల శ్రీనివాస్ రెడ్డి కేంద్ర మంత్రివర్యులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల అభివృద్ధిపై చూపుతున్న శ్రద్ధను ప్రశంసించారు. స్పెషల్ ఎడ్యుకేషన్ రంగానికి ఇది ఒక నూతన దిక్సూచి అవుతుందన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.

# గ్రేటర్ హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లు

## జిప్లస్3 విధానంలో నిర్మాణం

### 16 ప్రాంతాలను గుర్తించిన అధికారులు

హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త: గ్రేటర్ హైదరాబాద్‌తో పాటుగా జిల్లాల్లోని ప్రధాన పట్టణాలు, నగరాల్లోనూ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. నగరాల్లో జీ+3 విధానంలో ఇళ్లు నిర్మించనుంది. గ్రేటర్ హైదరాబాద్‌లోని 16 మురికివాడల్లో ఇప్పటికే స్థలాలను గుర్తించారు. ఐఎస్ సదన్, దిల్‌సుఖ్‌నగర్‌లోని కొన్ని ప్రాంతాలు అనుకూలంగా ఉండగా.. మిగిలిన చోట్ల వివాదాలున్నట్లు గుర్తించారు. వివాదాలు పరిష్కారం అయిన తర్వాత.. ఆయా ప్రాంతాల్లో ఇండ్లు నిర్మించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ప్రస్తుతం గ్రామాల్లోని పేదలు ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే కొందరు పనులు మెదలుపెట్టగా.. మరికొందరు ఇంటి నిర్మాణానికి రెడీ అవుతున్నారు.ఇక గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి పేదలకు ఇవ్వాలని సర్కార్ నిర్ణయించింది. జీ+3 పథకం ద్వారా నిరుపేదలకు సొంత ఇళ్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 16 మురికివాడల్లో గృహనిర్మాణ శాఖ అధికారులు ఇప్పటికే కొన్ని స్థలాలను గుర్తించారు. వీటిలో ఐఎస్ సదన్ సమీపంలోని సరళాదేవినగర్, దిల్‌సుఖ్‌నగర్‌లోని పిల్లిగుడిసె ప్రాంతాల్లో జీ+3 నిర్మాణాలకు ఎలాంటి సమస్యలు లేవని నిర్ధారించారు. అయితే మిగిలిన 14 ప్రాంతాల్లో మాత్రం వివాదాలు, స్థానికంగా ఇబ్బందులు, కొన్నిచోట్ల కోర్టు కేసులు ఉన్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో రెవెన్యూ, గృహనిర్మాణ, జీహెచ్‌ఎంసీ అధికారులు కలిసి మరోసారి పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించాలని నిర్ణయించారు.

జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ నిబంధనలకు అనుగుణంగా బ్లాకులను నిర్మించడానికి ఈ స్థలాలు సరిపోతాయా అన్నది కూడా ఈ సర్వేలో పరిశీలించనున్నారు. ఒక్కో బ్లాక్ నిర్మాణానికి కనీసం 500 గజాల స్థలం అవసరమని విధానంలో గృహాల నిర్మాణానికి స్థలాల అన్వేషణ ప్రారంభించింది. ఈ గృహనిర్మాణ శాఖ అంచనా వేస్తోంది. ఇందులో రోడ్డు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కోసం 150 గజాల స్థలం కేటాయించాలి. ఒక్కో బ్లాక్‌లో 16 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు వీలు ఉంటుంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున మొత్తం84 వేల ఇళ్లను కేటాయించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే గుర్తించిన మురికివాడల్లో పరిమిత స్థలాలు ఉండటంతో, గ్రేటర్ పరిధిలోని మిగిలిన ప్రభుత్వ, మురికివాడల స్థలాలపై కూడా మరో సర్వే నిర్వహించనున్నారు. ఈ సర్వే తర్వాత ఎన్ని ప్రాంతాల్లో జీ+3 బ్లాక్‌లు నిర్మించనున్నారు, మొత్తం ఎన్ని ఫ్లాట్లు అందుబాటులోకి వస్తాయనే దానిపై గృహనిర్మాణ శాఖ తుది నిర్ణయం తీసుకోనుంది.జిల్లాల్లోని పలు నగరాలు, పట్టణాల్లోనూ మురికివాడల ప్రజలకు జీ+3 విధానంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ తదితర ప్రాంతాల్లోని పేదల బస్తీల్లో ఇళ్ల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించి త్వరగా ప్రతిపాదనలు పంపించాలని జిల్లా కలెక్టర్లు, హౌసింగ్ పీడీలను ఉన్నతాధికారులు కోరారు.

# విద్యార్థుల బస్‌పాస్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

## విద్యార్థులకు ఆర్‌టిసి ఉచిత బస్‌పాసులు ఇవ్వాలి

### ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్

హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టిసి) సోమవారం పెంచిన విద్యార్థుల బస్‌పాసులను వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్(ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ డిమాండ్ చేసింది. విద్యార్థులకు ఆర్‌టిసి ఉచిత బస్‌పాస్‌లను ఇవ్వాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 10లక్షలకు పైగా పేద, మధ్యతరగతి, గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుకోవడానికి ఆర్‌టిసి బస్సుల ద్వారా పట్టణాలకు వెళ్తుంటారని.. పెంచిన చార్జీల మూలంగా వారిపై పెనుభారం పడుతుందన్నారు. ఆర్‌టిసి యాజమాన్యం నెలకు రూ. 400 ఉన్న బస్‌పాస్ చార్జీని రూ.600కి పెంచుతూ 3నెలల ప్యాకేజీని రూ.1200 నుంచి రూ.1800 పెంచుతూ 20శాతానికిపైగా చార్జీలను పెంచి పేద, మధ్యతరగతి విద్యార్థులపై ఆర్థిక భారం మోపారని మండిపడ్డారు. ప్రభుత్వం విద్యార్థులకు ఇప్పటికే ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్‌లను ఇవ్వకుండా ఫీజు రియింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ ఇప్పుడు బస్‌పాస్ చార్జీలను పెంచడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా బస్సు చార్జీలను పెంచామంటే.. అదే విధంగా విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్‌లను కూడా పెంచాలని, ఆర్‌టిసిలో విద్యార్థులందరికీ ఉచిత బస్సుపాసులు ఇవ్వాలని.. పెంచిన 20 శాతం బస్సు చార్జీల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.



బంజార గిరిజనుల జీవన చిత్రం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ ఎం.కోదండరామ్

# 'బంజార గిరిజనుల జీవన చిత్రం' ఆవిష్కరణ

హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 10, ప్రభాతవార్త: గిరిజనుల స్థితిగతులపై '1961లో బంజార గిరిజనుల జీవన చిత్రం' 1973లో రూపొందించిన ఆంగ్ల మోనోగ్రాఫ్ నేటి తరానికి ఉపయోగపడేలా తెలుగు అనువధించి ప్రచురించిన పుస్తకాన్ని టిజెఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ ఆవిష్కరించారు. దీంతోపాటు ఆంగ్ల పుస్తకం 'బంజార ట్రిబస్ ఇన్ 1961ని' కూడా ఆయన ఆవిష్కరించారు. తెలంగాణ బంజార రచయితల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆ పుసకాలను ఆవి ష్కరించిన కోదండరామ్ మాట్లాడుతూ గిరిజన జాతుల గత (1961), నేటి పరిస్థితులు వారి జీవన విధానంపై రచయిత సవివరంగా తెలుసుకుని ఇలాంటి మరో పుస్తకాన్ని తీసుకురావాలని కోరారు. ఈ పుస్తకాలు గిరిజనుల అభివృద్ధికి ఎంతో తోడ్పాటునిస్తాయని, ఈ పుస్తకాలను ప్రభుత్వ అధికారులకు అందించి, బంజార గిరిజనుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. పుస్తకం అనువాదకులు ప్రొఫెసర్ జాటోత్ రాజారామ్ మాట్లాడుతూ బంజారల జీవితాలకు సంబంధించి అన్ని వివరాలు ఈ పుస్తకంలో పొందు పరిచి ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ విద్యావంతుల వేదిక కార్యదర్శి డిఎస్ఎస్ఆర్ కృష్ణ అధ్యక్షత వహించగా, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోత్ రాంబాబునాయక్, ఆంగ్ల మూల సహసంపాదకుడు ముడావత్ రాముినాయక్, ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

# 91.83 లక్షలకు చేరిన కార్డుల సంఖ్య

హైదరబాద్, జూన్ 10, ప్రభాతవార్త: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేసే ప్రక్రియ చౌకధరల దుకాణల డీలర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నది.తెలంగాణలో జూన్‌నెలలో 91.38లక్ష వైట్ రేషన్ కార్డుకలిగిన 3.10లక్ష మందికి జూన్,జూలై,ఆగస్టు మాసంకు సంబందించిన బియ్యం పంపిణీ చేయాల్సిఉంది. ఒక్కొక్కరికి 18కిలోల బియ్యం చొప్పున ఇవ్వాల్సి ఉండగా అంత స్థాయిలో నిల్వలు రావడంలేదు. క్వింటాల్‌కు సగటున నాలుగు కిలోల బియ్యం తరుగు వస్తుండటంతో డీలర్లు ఇబ్బంది పడుతున్నారు. వంద క్వింటాళ్ళ బియ్యంకు డీలర్లు ఒక క్వింటాల్ నష్టపోతున్నట్లు ఆవేదన చెందుతున్నారు.

# రేషన్‌బియ్యం తూకంలో కోతలతో డీలర్లకు వెతలు

గోదాం అధికారులు తూకం వేయాలని కోరుతున్న డీలర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తూకం కావాలని కోరుతున్న డీలర్లు ఉదయం 9గంటలకు రావాలని ఆదేశాలు జారీచేస్తున్నారు. వెళ్ళితే అధికారులు పదిన్నర తరువాత వస్తున్నారు. మండల స్థాయి నిల్వల కేంద్రంలో తూకం వేయకుండా నేరుగా డీలర్లకు రవాణా చేస్తున్నారు. గోనె సంచుల బరువుకు సరిపడా, బియ్యం ఇవ్వకపోవడంతో నష్టపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా తూతూమంత్రంగా బియ్యం తూకం వేస్తున్నారు. రైస్ మిల్లుల నుంచి వచ్చిన లారీల నుంచి డీలర్లకు తరలించే వ్యాన్లలోకి నేరుగా బస్తాలు చేస్తున్నారు. సాధారణంగా రేషన్ దుకాణాల్లో కచ్చిత మైన తూకం వేస్తేనే ఈపాస్‌లో వివరాలు నమోదవుతుందన్న విషయం తెలిసిందే.ఇదే తరహాలోనే డీలర్లు తమ కోటా బియ్యం తీసుకోవాలన్నా మండల స్థాయి నిల్వల కేంద్రంలో ఈపాస్ యంత్రంలో వేలి ముద్ర వేయాల్సి ఉంటుంది. తూకంలో కొద్దిగా తేడా ఉన్న వారికి ఇవ్వాల్సిన కోటా మంజూరు కాదు. తక్కువ ఉంటే హమాలీ కార్మికులను యంత్రాలపై కూర్చోబెట్టి బరువు సర్దుబాటు చేస్తున్నారు. అప్పటికి సర్దుబాటు కాకపోతే మరో హమాలీ కార్మి కుడు తూకం సరిపోలే వరకు యంత్రంపై ఒత్తిడి పెంచుతుంటారని డీలర్లు అనుభవాలను వివరిస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో జిల్లాలోని 2,90,402 కార్డులకు మూడు నెలల కాలానికి 16,748.667 మెట్రిక్ టన్నుల బియ్యం మంజూరైంది. వీటిని 566 దుకాణాలకు తరలించి.. ఈనెల ఒకటో తేదీ నుంచి నెలాఖరులోగా పంపిణీ చేయాలి. అధికారులు పంపిణీ వేగవంతం చేయడానికి తూకం వేయ కుండానే నేరుగా బస్తాలను రేషన్ దుకాణాలకు తరలిస్తున్నారు. గోనె సంచి బరువు 450 గ్రాములుంటుంది. ఆమేరకు బియ్యం నష్టపోతున్నారు. దీనిపై గతంలో డీలర్ల సంఘం ఆధ్వ ర్యంలో ఆందోళన నిర్వహించారు. తూకం వేయడానికి అధికారులు అంగీకరించిన ప్రస్తుతం మూడు నెలల కోటా కావడంతో తూకం వేసే పరిస్థితుల్లేవని గోదాం అధికారులు అంటున్నారు. రెండు తూకం యంత్రాలున్నాయని, మరో రెండు యంత్రాలు అవసరం అని వారు వాపోతున్నారు.

# టి20 వరల్డ్ కప్.. టీమిండియాలో ప్లేస్‌కు పోటీ


అభిషేక్ శర్మ


అక్షర్ పటేల్


శుభ్‌మన్ గిల్


హార్దిక్ పాండ్యా


కుల్‌దీప్ యాదవ్


సంజు శ్యాంసన్

**న్యూఢిల్లీ:** ఐపిఎల్-2025 ఇటీవలే ముగిసింది. ఇక 2026 ఐపిఎల్ కంటే ముందు భారత క్రికెట్ జట్టు టి20 ప్రపంచ కప్ ఆడుతుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో ఈ ప్రపంచ కప్ జరగనుంది. భారత్, శ్రీలంక వేదికగా ఈ మ్యాచులు జరుగుతాయి. 2024లో జరిగిన టి20 ప్రపంచ కప్‌లో విజేతగా నిలిచిన టీమిండియా ఈ సారి సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో 2026 వరల్డ్ కప్ ఆడే అవకాశం ఉంది. మరోసారి టైటిల్ దక్కించుకోవాలనుకుంటోంది. దీనికి సంబంధించి భారత్ జట్టు కూర్పుకు భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు నడుంకట్టింది. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో బాగా ఆడి సెలెక్టర్ల దృష్టిలో పడిన వారు భారత టి20 జట్టులో చేరే వీలుంది. కెఎల్ రాహుల్ ఈ టీమ్‌లో ఉండే అవకాశం మాత్రం లేదు. శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ టి20 క్రికెట్లోకి తిరిగి రావాలని భావిస్తున్నారు. టెస్ట్ మ్యాచ్‌లు, ఛాంపియన్స్ ట్రోఫీపైనే దృష్టి అంతా ఉండటంతో గత ఏడాది వారు టి20లు ఆడలేదు. ఈ ఇద్దరు ఆటగాళ్లు ఇటీవలి ఐపిఎల్ మ్యాచుల్లో బాగా ఆడారు. దీంతో వీరు భారత్ టీమ్‌లో కీలక పాత్ర పోషిస్తారని అంచనా వేస్తున్నారు. ఇటీవల భారత టెస్ట్ జట్టు కెప్టెన్‌గా గిల్ ఎంపికయ్యాడు. గిల్ చివరిసారిగా శ్రీలంకతో ఆడిన టి20 మ్యాచ్‌లో వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. టి20 ప్రపంచ కప్‌లో కూడా అతడిని వైస్‌కెప్టెన్‌గా ఎంపిక చేసినా ఆశ్చర్యం లేదు. ఇక అభిషేక్ శర్మ తన చివరి టి20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌పై 37 బంతుల్లో సెంచరీతో చెలరేగాడు. అతని ఎడమచేతి వాటం స్పిన్ కూడా జట్టుకు కీలకంగా మారుతుంది. మిడిల్ ఆర్డర్ విషయానికొస్తే తిలక్ వర్మ దక్షిణాఫ్రికాపై వరుసగా రెండు సెంచరీలు చేశాడు. ఇంగ్లాండ్‌పై కూడా బాగా ఆడాడు. అతడు జట్టులో చేరే అవకాశాలు మెండుగా ఉన్నాయి. శ్రేయస్ అయ్యర్ 2023 డిసెంబర్ నుంచి టి20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు ఆడలేదు. అయితే, ఇటీవల జరిగిన ఐపిఎల్‌లో అద్భుతంగా ఆడాడు.

గత ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అతడికి జట్టులో ప్లేస్ కన్ఫాం అని చెప్పవచ్చు. అంతేకాదు, శ్రేయస్ కూడా కెప్టెన్సీ పోటీలో ఉండవచ్చు. వికెట్ కీపర్ బ్యాటర్ల విషయానికొస్తే 2024లో మూడు సెంచరీలు చేసిన సంజు శాంసన్ తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. రిషబ్ పంత్ జట్టులోకి తిరిగి రావడంలో విఫలమవడంతో రెండవ స్థానం ఖాళీగా ఉంటుంది. ఇక ఆల్ రౌండర్ల విషయానికొస్తే హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్‌ను తీసుకునే ఛాన్స్ ఉంది. స్టార్ స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి ఇద్దరూ జట్టులో ఉండే అవకాశాలు ఎక్కువ. 2024 టీ20 ప్రపంచ కప్ విజయంలో జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ కీలక పాత్ర పోషించారు. 2026లో కూడా ఇద్దరూ కీలకంగా మారనున్నారు.

## యూరోపియన్ హాకీ లీగ్‌లో..
# పోరాడి ఓడిన భారత్
### 2-3తో నెదర్లాండ్స్ గెలుపు



**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ హాకీ ఫెడరేషన్ (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్ యూరోపియన్ లెగ్‌లో భారత్ పురుషుల హాకీ జట్టు ఓటమి పాలైంది. నెదర్లాండ్స్‌చేతిలో 2-3 తేడాతో వరుసగా రెండో మ్యాచ్‌లో పరాజయం చెందింది. భారతదేశం తరపున అభిషేక్ (20 నిమిషాలు), జుగ్‌రాజ్ సింగ్ (54 నిమిషాలు) గోల్స్ చేయగా, డచ్ తరపున థిజ్స్ వాన్ డామ్ (24 నిమిషాలు), టిజెప్ హోడెమేకర్స్ (33 నిమిషాలు), జిప్ జాన్సెన్ (57 నిమిషాలు) గోల్స్ చేశారు. ప్రత్యర్థి రక్షణను ఛేదించుకుంటూ, ఆధిక్యాన్ని కాపాడుకుంటూ భారత్ సానుకూలంగా ఆరంభించింది. భారత్‌కు మంచి అవకాశాలు లభించడంతో డచ్‌పై ఒత్తిడి పెంచింది. నెదర్లాండ్స్ ఎదురుదాడి చేసి కొన్ని గోల్ అవకాశాలను సృష్టించింది. ఒకదానిపై మరొకటి ఆధిపత్యం కోసం రెండు జట్లు ప్రయత్నాలు కొనసాగించాయి, కానీ తొలి క్వార్టర్ గోల్ లేకుండా ముగిసింది. భారతదేశం యొక్క పట్టుదల 20వ నిమిషంలో ఫలించింది, అభిషేక్ తన మైలురాయి 100వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతూ, భారత్ 1-0 ఆధిక్యంలో గోల్ చేయడంతో. మూడో క్వార్టర్ కూడా అంతే ఆసక్తికరంగా సాగింది, భారత్ నెదర్లాండ్స్ పై ఆరు పెనాల్టీ కార్నర్లు సాధించింది. జిప్ జాన్సెన్ (57వ నిముషం) పెనాల్టీని గోల్ గా మలిచాడు, దీంతో డచ్ జట్టు 3-2 తేడాతో ఉత్కంఠభరితమైన విజయాన్ని నమోదు చేసింది. నెదర్లాండ్స్ ఇప్పుడు 20 పాయింట్లతో అగ్రస్థానంలో ఆధిక్యాన్ని పెంచుకోగా, భారత్ 15 పాయింట్లతో నాల్గవ స్థానంలో ఉంది. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత బుధవారం అర్జెంటీనాతో తలపడనుంది. ఆరు నెలల పాటు జరిగే ఈ టోర్నమెంట్ విజేత బెల్జియం మరియు నెదర్లాండ్స్ ఆతిథ్యం ఇచ్చే ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచ కప్ 2026 కి నేరుగా అర్హత సాధిస్తారు.

# సుమిత్ నాగల్ మళ్లీ ఓటమి
## ఆరోసారి మొదటి రౌండ్‌లోనే నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** భారత్ సింగిల్స్ టాప్ ప్లేయర్ సుమిత్ నాగల్ మళ్లీ ఓడిపోయాడు. 2025 ఎటిపి ఛాలెంజర్ సీజన్‌లో ఆరోసారి మొదటి రౌండ్ నిష్క్రమించాడు. ఫ్రాన్స్‌కు చెందిన అన్‌సీడెడ్ ప్లేయర్ జాఫ్రే బ్లాంచనీక్స్ ధాటికి చేతులెత్తేశాడు. క్లే కోర్ట్ ఈవెంట్‌లో ఆరవ సీడ్ నాగల్ 4-6,6-7 (4) తేడాతో అన్‌సీడెడ్ ఫ్రెంచ్ ఆటగాడు జియోఫ్రీ బ్లాంచనీక్స్ చేతిలో ఓడిపోయాడు. హోరీహోరీగా సాగిన పోరులో వరుస సెట్లలో ప్రత్యర్థికి పోటీ ఇవ్వలేకపోయాడు. ఫ్రాన్స్ వేదికగా జరుగుతున్న ఎటిపి ఛాలెంజర్స్ టోర్నీలో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన నగాల్ అంచనాలను అందుకోలేకపోయాడు. ఒక సెట్ మరియు ఒక బ్రేక్ వెనుకబడినప్పటికీ, నాగల్ రెండవ సెట్ యొక్క ఎనిమిదో గేమ్‌లో వెనక్కి తగ్గాడు, తిరిగి రావాలనే ఆశలను క్లుప్తంగా రేకెత్తించాడు.

రెండవ సెట్‌లోని ఎనిమిదో గేమ్‌లో తిరిగి బ్రేక్ అప్ అయ్యి సమానత్వాన్ని సాధించినప్పుడు నాగల్ ఒక సెట్ మరియు ఒక బ్రేక్ తేడాతో వెనుకబడ్డాడు, పోటీని నిర్ణయాత్మక ఆటగాడిగా కొనసాగించాలనే ఆశలను పెంచాడు. అయితే, ఇద్దరు ఆటగాళ్ల నుండి అస్థిరమైన సర్వింగ్ రెండవ సెట్ టైబ్రేకర్‌కు దారితీసింది, చివరికి బ్లాంచనీక్స్ గెలిచాడు. 2025 సీజన్‌లో ఛాలెంజర్ సర్క్యూట్‌లో నాగల్‌కు ఇది ఆరో మొదటి రౌండ్ ఓటమి. ఈ సంవత్సరం ప్రారంభంలో అతని ర్యాంకింగ్ టాప్ 100 నుండి 170కి పడిపోయింది.

# అమ్మకానికి రాయల్ ఛాలెంజర్స్



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో అత్యంత ప్రజాదారణ ఉన్న జట్లలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి) ఒకటి. తమ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఈ ఏడాది ఐపిఎల్-2025 విజేతగా ఆర్‌సిబి నిలిచింది. ఆర్‌సిబి ఫ్రాంచైజీని విక్రయించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. ఫ్రాంచైజీని ప్రస్తుత యాజమాన్యం డియాజియో జట్టును పూర్తిగా లేదా కొంత భాగాన్ని విక్రయించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఫ్రాంచైజీ విలువపై ఇంకా అధికారిక సమాచారం లేనప్పటికి, 2 బిలియన్ డాలర్లు (సుమారు రూ.16,384 కోట్లు) వరకు డిమాండ్ చేయవచ్చునని బ్లూమ్ బెర్గ్ నివేదించింది. బ్రిటిష్ డిస్టిలర్, యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ యొక్క మాతృ సంస్థ అయిన డియాజియో పిఎల్‌సి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరులో పాక్షి క లేదా పూర్తి వాటాను విక్రయించడానికి సంబంధింత వ్యక్తులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఆర్‌సిబి అమ్మకానికి అవకాశం ఉందనే వార్తలు వెలువడటంతో యునైటెడ్ స్పిరిట్స్ షేర్లకు కూడా సెంటిమెంట్లు ఊతమిచ్చాయి. మంగళవారం ఉదయం స్టాక్ ధరలు 3.3 వరకు పెరిగాయి. అయితే ఫ్రాంచైజీని విక్రయించాలా వద్దా అనే దానిపై ఇంకా తుది నిర్ణయం తీసుకులేదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇక దీనిపై ఇప్పటి వరకు కంపెనీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కాగా ఐపిఎల్ 2008లో ప్రారంభమైంది. అప్పుడు ఆర్‌సీబీ జట్టును కింగ్ ఫిషర్ ఎయిర్ లైన్స్ యజమాని విజయ్ మాల్యా సొంతం చేసుకున్నాడు. అయితే ఆయన 2012లో అప్పుల ఊబిలో చిక్కుకున్నాడు. ఈ క్రమంలో అతడి సామ్రాజ్యం కూలిపోయింది. ఈ సమయంలో విజయ్ మాల్యా స్పిరిట్స్ వ్యాపారాన్ని కొనుగోలు చేయడం ద్వారా ఆర్‌సిబిని డియోజియో సొంతం చేసుకుంది.

## ఆస్ట్రియన్ ఛాంపియన్‌షిప్‌లో..
# ప్రియాంకకు స్వర్ణం



**న్యూఢిల్లీ:** ఆస్ట్రియన్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల 10 కి.మీ రేస్ వాక్‌లో భారత్ అథ్లెట్ ప్రియాంక గోస్వామి స్వర్ణం సాధించింది. అలాగే పురుషుల 35 కి.మీ రేస్ వాక్ ఈవెంట్‌లో సందీప్ కుమార్ రెండవ స్థానంలో, రామ్ బాబూ మూడవ స్థానంలో నిలిచాడు. ఇన్స్‌బ్రక్‌లో మంగళవారం జరిగిన ఆస్ట్రియన్ రేస్ వాకింగ్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల 10 కి.మీ ఈవెంట్‌లో అగ్రస్థానంలో నిలిచి, ఏస్ ఇండియన్ రేస్ వాకర్ ప్రియాంక గోస్వామి ఈ సీజన్‌లో తన తొలి విజయాన్ని నమోదు చేసింది. ఈ రేసు నడకలో గోస్వామి 47 నిమిషాల 54 సెకన్లలో గమ్యాన్ని చేరుకుంది. అయితే, ఆమె అభిమాన ఈవెంట్ 20 కి.మీ రేసు నడక, దీనిలో ఆమె జాతీయ రికార్డు హోల్డర్ (1:28:45) కావడం విశేషం. ఆమె 2022లో సాధించిన 10 కి.మీ ఈవెంట్‌లో 45నిమిషాల 47 సెకన్ల వ్యక్తిగత అత్యుత్తమ సమయాన్ని కలిగి ఉంది. గోస్వామి సుదూర ఈవెంట్లలో కూడా పోటీపడుతోంది. మే నెలలో మెల్‌బోర్న్‌లో జరిగిన అథ్లెటిక్స్ విక్టోరియా వాకింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె 2 గంటల 26 నిమిషాల 54 సెకన్ల సమయంతో రెండవ స్థానంలో నిలిచింది. ఇక పురుషుల 35 కి.మీ రేస్ వాక్ ఈవెంట్‌లో సందీప్ కుమార్ 2:38:45 సమయంతో రెండవ స్థానంలో నిలిచాడు, రామ్ బాబూ 2:41:47 సమయంతో మూడవ స్థానంలో నిలిచాడు.

# వాణిజ్యం

# ఫండ్స్‌లోకి తగ్గిన నిధులు

**ముంబై, జూన్ 10:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి నిధుల ప్రవాహం తగ్గుముఖం పట్టింది. మే నెలలో ఈ విభాగంలోకి రూ.19,013 కోట్లు మాత్రమే తరలివచ్చాయి. అంతకుముందు నెలతో పోలిస్తే ఈ మొత్తం 21.66 శాతం మేర తగ్గుముఖం పట్టడం గమనార్హం. ఈమేరకు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా మే నెలకు సంబంధించిన గణాంకాలను మంగళవారం విడుదల చేసింది. ఈక్విటీ ఫండ్స్‌లోకి పెట్టుబడులు తగ్గుముఖం పట్టడం ఇది వరుసగా ఐదో నెల కావడం గమనార్హం. మరోవైపు డెట్ మ్యూచువల్‌ఫండ్స్ కేటగిరీ నుంచి మే నెలలో రూ.15,908 కోట్ల నిధులు తరలివెళ్లాయి. ఏప్రిల్ నెలలో ఈ విభాగంలోకి రూ.2.2 లక్షల కోట్ల నిధులు రాగా.. గత నెలలో వెనక్కి మళ్లడం గమనార్హం. మొత్తంగా మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీలో మే నెలలో రూ.29 వేల కోట్లు తరలి వచ్చాయి. అంతకుముందు నెలలో రూ.2.77 లక్షల కోట్ల ఇన్‌ఫ్లోతో పోలిస్తే ఈమొత్తం చాలా తక్కువ. ఇక మే నెల నాటికి మ్యూచువల్‌ఫండ్ సంస్థల నిర్వహణ లోని ఆస్తుల (ఏయూఎమ్) విలువ రూ.70 లక్షల కోట్ల నుంచి రూ.72.2 లక్షల కోట్లకు పెరిగింది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఏప్రిల్ నెలలో రూ.24,269 కోట్లు వచ్చాయి. మార్చి నెలలో రూ.25,082 కోట్లు, ఫిబ్రవరిలో రూ.29,303 కోట్లు, జనవరిలో రూ.39,688 కోట్లు, ఫిబ్రవరిలో రూ.41,156 కోట్లు నిధులు తరలివచ్చాయి. ఏ నెలకు ఆ నెల నిధుల ప్రవాహం తగ్గడాన్ని ఇక్కడ గమనించొచ్చు. ఈక్విటీ ఫండ్స్ కేటగిరీలో ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి అత్యధికంగా రూ.3,841 కోట్లు వచ్చాయి. ఈక్విటీ లింక్డ్ సేవింగ్ స్కీమ్స్ నుంచి రూ.678 కోట్లు వెనక్కి మళ్లాయి. లార్జ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.1,250 కోట్లు నిధులు వచ్చాయి. అంతకుముందు నెల రూ.2,671 కోట్లతో పోలిస్తే తగ్గాయి. మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.2,808 కోట్లు (ముందు నెల రూ.3,313 కోట్లు), స్మాల్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.3,214 కోట్లు (ఏప్రిల్ నెలలో రూ.3999 కోట్లు) వచ్చాయి. ఇక క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా మ్యూచువల్ ఫండ్స్‌లోకి మే నెలలో రూ.26,688 కోట్లు నిధులు వచ్చినట్లు యాంఫీ వెల్లడించింది. ఏప్రిల్‌లో ఈ మొత్తం రూ.26,632 కోట్లతో పోలిస్తే స్వల్పంగా పెరిగింది.




# ఆపిల్ ఎక్స్‌కోడ్‌కు చాట్‌జిపిటి లింక్‌అప్!

**వాషింగ్టన్, జూన్ 10:** ఆపిల్ డబ్ల్యూడబ్ల్యూడీసీ 2025 (వరల్డ్ వైడ్ డెవలపర్స్ కాన్ఫరెన్స్)లో పలు ఆసక్తికర మార్పులను ప్రకటించింది. దాని ప్రధాన యాప్ బిల్డింగ్ టూల్ ఎక్స్‌కోడ్‌కు చాట్ జీపీటీని అనుసంధానిస్తున్నట్లు వెల్లడించింది. ఫలితంగా కృత్రిమ మేధ సాయంతో కోడ్ రాయడం, బగ్స్‌ను సరిచేయడం, డాక్యుమెంటేషన్, యాప్స్ టెస్టింగ్ వంటివి చేసే అవకాశం లభిస్తుందని పేర్కొంది. ఎక్స్‌కోడ్ 26 అనే సరికొత్త వెర్షన్ తీసుకొచ్చింది. దీనిలో డెవలపర్లు ఇతర ఏఐ మోడల్స్‌ను కూడా ఏపీఐ 'కీ' లను వాడి ప్లగ్‌ఇన్ చేసుకొనే అవకాశం కల్పించింది. ఇప్పటికే యాపిల్ చిప్స్‌ను వాడుతున్నవారు ఇంటర్నెట్‌పై ఆధారపడకుండా ఏఐ మోడల్స్‌ను ఎటువంటి సమస్య లేకుండా రన్ చేసుకోవచ్చు. తమ పరికరాల యూజర్లు కేవలం మూడు లైన్ల కోడ్‌తో ఆపిల్ ఏఐ టూల్స్ వాడుకొనేలా ఫౌండేషన్ మోడల్స్ ఫ్రేమ్‌వర్క్‌ను ప్రారంభించింది. ఎక్స్‌కోడ్‌లో చాట్‌జీపీటీని వినియోగించాలంటే ఓపెన్ ఏఐ ఖాతాలోకి సైన్‌ఇన్ కావాల్సిన అవసరం లేదు. దీంతోపాటు ఎక్స్‌కోడ్‌లో సరికొత్త నేవిగేషన్ సిస్టమ్, మరింత మెరుగైన సపోర్ట్‌తో ట్రాన్స్‌లేటింగ్ యాప్స్, వాయిస్ కంట్రోల్ పనితీరును మెరుగుపర్చింది. ఈ కాన్ఫరెన్స్‌లో యాపిల్ తన ఐఫోన్, మ్యాక్, వాచ్‌ల కోసం సరికొత్త లిక్విడ్ గ్లాస్ డిజైన్‌ను పరిచయం చేసింది. తమ ఉత్పత్తులన్నీ ఒకేరకమైన అనుభవం ఇచ్చేందుకు అన్నింట్లో ఒకేసారి డిజైన్ అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొంది. దీంతో ఐవోఎస్, ఐపాడ్ వోఎస్, మ్యాక్ వోఎస్, వాచ్ వోఎస్ ఒకేసారి ఈ మార్పు రానుంది. చివరిసారిగా యాపిల్ డిజైన్ ఐవోఎస్7 సమయంలో జరిగింది. నేడు మా విస్తృతమైన డిజైన్ అప్‌డేట్‌ను ప్రకటించడానికి చాలా ఉత్సుకతతో ఉన్నాను. అది పూర్తిగా సరికొత్తగా ఉంటుంది. దానికి మేము లిక్విడ్‌గ్లాస్ అని పేరుపెట్టాము. దానికి గాజు, ద్రవాల వంటి పారదర్శకతను యాపిల్ సాధించింది. అది మీ కంటెంట్‌ను బట్టి మారుతుంది. మరింత వినియోగానికి అవసరమైన స్పష్టత, కంట్రోల్స్‌ను అందిస్తుంది అని ఆపిల్ పేర్కొంది.



# 5 యేళ్లలో సిఎన్‌జి మార్కెట్ వాటా మూడు రెట్లు వృద్ధి


**ముంబై, జూన్ 10:** పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో కొనుగోలుదారులు కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్)తో నడిచే వాహనాల వైపు మొగ్గు చూపిస్తున్నారు. దీంతో సిఎన్‌జి కార్ల గిరాకీ జోరందుకుంది. గతంతో పోలిస్తే వీటి అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. డీజిల్‌కార్ల కంటే సీఎన్‌జీకార్ల కొనుగోళ్లుముందంజలో నిలిచాయని వాహన తయారీ సంస్థల సమాఖ్య వెల్లడించింది. 2019-20లో 6.3 శాతంగా ఉన్న సీఎన్‌జీ కార్ల వాటా గత ఆర్థిక సంవత్సరం నాటికి 19.5 శాతానికి చేరింది. అంటే గతఐదేళ్లలో మార్కెట్ వాటా మూడు రెట్లు వృద్ధి సాధించి, డీజిల్ కార్లను వెనక్కినెట్టింది. అదే సమయంలో పెట్రోల్ కార్ల వాటా 76.3 శాతం నుంచి 57.7 శాతానికి క్షీణించింది. డీజిల్ కార్ల వాటా మాత్రం 1719 శాతంగా ఉంది. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో తొలిసారిగా సీఎన్‌జీ కార్లు, సెడాన్‌లు, ఎస్‌యూవీలు మొత్తం 10 లక్షలకు పైగా అమ్ముడవుతాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇంధన ధరలు పెరగడం, సీఎన్‌జీ స్టేషన్‌ల విస్తరణ, మారుతీసుజుకీ, టాటామోటార్స్, నిస్సాన్ వంటి కంపెనీలు విభిన్న మోడళ్లతో సీఎన్‌జీ కార్లను తీసుకురావడం వీటి విక్రయాలు పెరిగేందుకు కారణమని నిపుణులు చెబుతున్నారు.



సీఎన్‌జీ వాహనాల్లో సిలిండర్ కారణంగా బూట్ స్పేస్ తగ్గడమే సమస్య కాగా, టాటా మోటార్స్, హ్యుందాయ్ వంటి కార్ల తయారీ సంస్థలు దీనికి ట్విన్ సిలిండర్ పరిష్కారాన్ని తీసుకొచ్చాయి. 2021లో సీఎన్‌జీ వేరియంట్లు 11 ఉండగా, 2025నాటికి ఆ సంఖ్య 25కు చేరింది. మరోవైపు సీఎన్‌జీ స్టేషన్ల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. 2025లో 7,400గా ఉన్న స్టేషన్ల సంఖ్యను 2030 నాటికి 17,500కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ సూచీలు

**ముంబై, జూన్ 10:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల వరుస లాభాలకు బ్రేక్‌పడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నేపథ్యంలో సూచీలు మోస్తరు స్థాయిలో కదలాడాయి. చివరికి ఫ్లాట్‌గా ముగిశాయి. ముఖ్యంగా ఫైనాన్షియల్, రియల్టీ షేర్లలో లాభాల స్వీకరణ కనిపించింది. ఐటీ స్టాక్స్ రాణించాయి. సెన్సెక్స్ ఉదయం 82,643.73 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా 82,240.40-82,680.79 పాయింట్ల మధ్య ఓ మోస్తరు శ్రేణిలో కదలాడింది. చివరికి సెన్సెక్స్ 53.49 పాయింట్ల నష్టంతో 82,391.72 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఒక పాయింట్ లాభంతో 25,104.25 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.62 గా ఉంది. టెక్ మహీంద్రా, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు లాభాల్లో మగిశాయి. ఏషి యన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 67.33 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3,350 డాలర్ల వద్ద ట్రేడయింది.




# ఉద్యోగులకు విజయ్ మాల్యా క్షమాపణ

**న్యూఢిల్లీ, జూన్ 10:** భారీ నష్టాల కారణంగా కింగ్ ఫిషర్ ఎయిర్ లైన్స్ మూతపడిన విషయం తెలిసిందే. దీంతో ఉద్యోగులకు జీతాలు చెల్లించ లేక పోయానని ఎయిర్ లైన్స్ మాజీ యజమాని విజయ్ మాల్యా పేర్కొన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాల్యా మాట్లాడుతూ, కింగ్ ఫిషర్ ఉద్యోగులకు మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నానని అన్నారు. కింగ్ ఫిషర్ ఎయిర్ లైన్స్ ఉద్యోగులకు జరిగినదానికి తాను చింతిస్తున్నానని, వారికి క్షమాపణలు చెప్పడం తప్ప తాను చేయగలిగినది ఏమీ లేదని తెలి పారు. తన సంపద మొత్తం కోర్టు వివాదంలో చిక్కుకుందని గుర్తుచేస్తూ ఉద్యోగులకు జీతాలు అందించేం దుకు తన శాయశక్తులా కృషి చేశానని మాల్యా వివరించారు. కోర్టు వివాదంలో చిక్కు కున్న సొమ్ములో నుంచి ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని బ్యాంకులకు, కర్ణాటక హైకోర్టుకు విజ్ఞప్తి చేశానని గుర్తు చేశారు. కోర్టు తిరస్కరణపై అసహనం తన అప్పుల కన్నా సీజ్ చేసిన ఆస్తుల విలువే ఎక్కువగా ఉందని, అయినప్పటికీ కోర్టు తన విజ్ఞప్తిని తోసిపుచ్చిందని ఆరోపించారు. దీంతో జీతాలు అందక ఇబ్బందుల పాలైన ఉద్యోగులను ఆదుకోలేకపోయానని విజయ్ మాల్యా వివరించారు. ఈ విషయంలో తాను నిస్సహాయుడినని, తనను క్షమించాలని తన మాజీ సిబ్బందికి మాల్యా వరుసగా పదకొండవ ఏడాది కూడా క్షమాపణలు చెప్పారు. విజయ్ మాల్యా 2016లో భారత దేశం విడిచి లండన్‌కి వెళ్లిపోయినప్పటి నుంచి పలుచోట్ల న్యాయ ప్రక్రియను ఎదుర్కొంటున్నాడు. అతని మాటలు సానుభూతి కలిగించేలా ఉన్నా, న్యాయ పరంగా బాధ్యత తప్పించుకునే ప్రయత్నంగా కూడా భావిస్తున్నారు. విజయ్ మాల్యా ఇచ్చిన క్షమాపణలు వ్యక్తిగతంగా భావోద్వేగంగా ఉన్నా, అవి చర్యలు తీసుకోకపోతే అంతే పరిమితం అవుతాయి. ఆస్తులను మిగిలిన జీతాల కోసం ఉపయోగించాలన్న అభ్యర్థనపై భారత ప్రభుత్వం, న్యాయవ్యవస్థ చర్యలు తీసుకోవాలి అని నిపుణులు సూచిస్తున్నారు.



# మార్కెట్‌కు టివిఎస్ అపాచీ ఆర్‌టిఆర్ 200

**ముంబై, జూన్ 10:** ప్రముఖ ద్విచక్ర, త్రిచక్రవాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ 2025 మోడల్ అపాచీ ఆర్‌టీఆర్ 200 4వీ శ్రేణి మోటార్ సైకిళ్లను ఆవిష్కరించింది. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ఓబీడీ2బీ ఉద్గార ప్రమాణాలతో ఈ మోటార్ సైకిల్‌ను తీర్చి దిద్దింది. దీంతోపాటు అత్యాధునిక టెక్నాలజీ, అద్భుత పనితీరు, మెరుగుపరిచిన భద్రతా ఫీచర్లతో ఈ మోటార్ సైకిల్‌ను తీసుకొచ్చినట్లు కంపెనీ తెలిపింది. ఈ వాహనం ధర రూ.1,53,990గా కంపెనీ పేర్కొంది. ఈ మోటార్ సైకిల్‌ను ఓబీడీ2బీ నిబంధనలతో పాటు 37 ఎంఎం అప్‌సైడ్ ఫ్రంట్ సస్పెన్షన్, మెరుగైన హ్యాండ్లింగ్ కోసం హైడ్రో ఫార్మ్‌డ్ హ్యాండిల్‌బార్‌తో తీసుకొచ్చారు. రిఫ్రెష్డ్ గ్రాఫిక్స్, కలర్ ఆప్షన్లతో టీవీఎస్ తీసుకొచ్చింది. ఓబీడీ2బీ నిబంధనల ప్రకారం ఆన్ బోర్డ్ డయాగ్నోస్టిక్స్ సిస్టమ్ ఈ మోటార్ సైకిల్‌లో ఉంది. ఈ మోటార్ సైకిల్ 20.8 పీఎస్ పవర్‌ను 17.25 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. డ్యూయల్ ఛానెల్ ఏబీఎస్, మూడు రైడ్ మోడ్స్ (అర్బన్, స్పోర్ట్, రెయిన్), స్లీపర్ క్లచ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. డిజిటల్ క్లస్టర్, ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్ ఇచ్చారు. గ్లాసీ బ్లాక్, మ్యాటీబ్లాక్, గ్రానైట్ రంగుల్లో ఈ మోటార్ సైకిళ్లు లభిస్తాయి.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14